నీటిపారుదల రంగంలో జిల్లాలోని రెండు కీలక ప్రాజెక్టులకు ఊరట కలిగేలా కేటాయింపులు జరిగాయి. వెలిగొండ, గుండ్లకమ్మ పనులు వేగంగా సాగేలా నిధులు దక్కాయి. మిగతా రంగాలకూ కేటాయింపులు ఆశాజనకంగానే ఉన్నాయి. సోమవారం శాసనసభలో మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. వ్యవసాయానికి పెద్దపీట వేస్తూనే మిగతా రంగాలకూ ప్రాధాన్యం ఇచ్చారు. రైతులకు అన్నదాత సుఖీభవ ప్రకటించారు. బడ్జెట్ బ్రహ్మాండంగా ఉందని కూటమి నేతలు అంటుండగా.. వైసీపీ, వామపక్షాల నాయకులు మాత్రం పెదవి విరుస్తున్నారు.

నిధుల ఊరట


రానున్న నాలుగు నెలల్లో పనులు చేపట్టేందుకు వీలుగా బడ్జెట్ కేటాయింపు



వెలిగొండ మొదటి టన్నెల్



మంత్రి నిమ్మలకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు ఉగ్ర, కందుల, ముత్తుముల, మారిటైం బోర్డు చైర్మన్ సత్య



గుండ్లకమ్మ ప్రాజెక్టు

వెలిగొండకు రూ.393.50కోట్లు
గుండ్లకమ్మకు రూ.13కోట్లు

అన్నదాత సుఖీభవకు గ్రీన్‌సిగ్నల్

- కేంద్రం ఇచ్చే రూ.6వేలకు మరో రూ.14వేలు అదనం
- జిల్లాలో 2.45లక్షల మంది రైతులకు లబ్ధి

సంక్షేమానికి పెద్దపీట



రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమ, అభివృద్ధి రంగాలకు పెద్ద పీట వేసింది. వ్యవసాయరంగానికి రూ.43,402 కోట్లు కేటాయించింది. మిగతా రంగాలకు సముచిత స్థానం కల్పించింది. ఆరోగ్యం, విద్య, వైజ్ఞానం, నైపుణ్యం, సంపద అందించడమే లక్ష్యంగా బడ్జెట్ రూపొందించడం అభినందనీయం. ఇరిగేషన్‌కు రూ.16,705, వాణిజ్యరంగానికి రూ.3,127 కోట్లు, ఇంధన రంగానికి రూ.8,207 కోట్లు, రోడ్లుభవనాలకు రూ.9,554 కోట్లు, యువజన శాఖకు రూ.322కోట్లు, రక్షణ శాఖకు రూ.8,495 కోట్లు, మైనారిటీకి రూ.4,376 కోట్లు, ఐసీడీఎస్‌కు రూ.4,285కోట్లు, పాఠశాల విద్యకు రూ.29,909 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,326 కోట్లు, ఆరోగ్యానికి రూ.18,421కోట్లు కేటాయింపు చేశారు. ఇలా అన్ని రంగాలకు సమాన ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు జరిగాయి.

- మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎంపీ

ఒంగోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి రంగానికి నిధుల ఊరట కలిగింది. రాష్ట్ర బడ్జెట్‌లో కీలకమైన వెలిగొండ ప్రాజెక్టుకు రూ.393.50 కోట్లు కేటాయింపు జరిగింది. గుండ్లకమ్మకు రూ.13 కోట్లు కేటాయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండుసార్లు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లు ప్రవేశపెట్టగా పూర్తిస్థాయి వార్షిక (2024-25) బడ్జెట్‌ను సోమవారం శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రతిపాదించారు. మొత్తం రూ.2.94 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన కేశవ్ ప్రాధాన్యతలకు అనుగుణంగా కేటాయింపులు చేశారు. మొత్తం బడ్జెట్‌లో సుమారు రూ.43వేల కోట్లకుపైగా వ్యవసాయానికి, మరో ప్రాధాన్యత రంగంగా ఉన్న నీటి పారుదల శాఖకు రూ.16,705కోట్లు కేటాయించారు. అలాగే వివిధ రంగాలకు అవసరాలను బట్టి ప్రకటించారు.

రెండు కీలక ప్రాజెక్టులకు మంచిరోజులు

జిల్లాలో నిర్మాణంలో ఉన్న వెలిగొండ, వినియోగంలో ఉన్న గుండ్లకమ్మ ప్రాజెక్టులను గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిన విషయం విదితమే. 2023-24లో వెలిగొండకు రూ.101.4 కోట్లు మాత్రమే వైసీపీ ప్రభుత్వం కేటాయించగా

మిగతా 6వ పేజీలో



రైతులకు భారీ మేలు

ఆయా సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకంలో జిల్లా రైతాంగానికి భారీగా మేలు జరగనుంది. గతంలో కేంద్రం ఇచ్చే రూ.6వేలకు మరో రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13,500ను రైతు భరోసా పేరుతో వైసీపీ ప్రభుత్వం ఇచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం రూ.20వేలకు పెంచనున్నట్లు హామీ ఇచ్చింది. బడ్జెట్‌లో ఆమేరకు ఇవ్వనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. దీంతో ఒక్కో రైతుకు అదనంగా ఏడాదికి రూ.6,500 రానుంది. జిల్లాలో మొత్తం 2.45 లక్షలమంది రైతులకు మేలు జరగనుంది. అయితే బడ్జెట్ కేటాయింపులపై రాజకీయ పార్టీలు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశాయి. ప్రజారంజకమైన బడ్జెట్‌గా అధికార టీడీపీ అభివర్ణిస్తుండగా... అంకెల గారడీ అని వైసీపీ విమర్శిస్తోంది. ఇతర వామపక్షాలు అసంతృప్తిని వ్యక్తం చేశాయి.

ఉపాధి లక్ష్యాలను పూర్తిచేయాలి

- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను నిర్దేశించిన లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి ఆమె మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. జిల్లాలో ఉపాధి పథకం ద్వారా చేపట్టిన సిమెంట్ రోడ్లు, సైడు కాలువలు, ఇంకుడు గుంతల నిర్మాణాలు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్, సేద్యపు నీటి కుంటల నిర్మాణాలను సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమం కింద చేపట్టిన పనులపై ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి సారించి వచ్చేనెలాఖరుకు పూర్తిచేయాలని ఆదేశించారు. పనులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని శాశ్వత పరిష్కారానికి కృషిచేయాలన్నారు. అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు.

కేసులపై సమీక్ష

వివిధ శాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను కలెక్టర్ సమీక్షిస్తూ ఎటువంటి జాప్యం లేకుండా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ధిక్కార, రిట్ పిటిషన్లపై ఆయాశాఖల వారీగా సమీక్షించి

మిగతా 6వ పేజీలో

ఓం శివరుద్రాయ..



కార్తీక సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు, శివాలయాలు ఓంకార నాదంతో మార్మోగాయి. భక్తులు పెద్దఎత్తున అభిషేకాలు, పూజలు చేశారు. రాత్రికి మహిళలు కార్తీక దీపాలు వెలిగించి సుఖసంతోషాలతో జీవించేలా దీవించాలని సర్వేశ్వరుడిని ప్రార్థించారు. ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్‌లోని శివాలయంలో కోటి దీపోత్సవం ఆకట్టుకుంది. సంతపేట సాయిబాబా ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం కనుల పండువలా సాగింది.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు



ఒంగోలు కొత్తపట్నం రోడ్డులో ఉన్న శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) పార్వతీపరమేశ్వరులు

ఉద్యోగోన్నతుల్లోనూ అక్రమాలు

- లంచాలు ఇచ్చిన వారికే ప్రాధాన్యం
- కలెక్టర్‌కు పీడీసీసీ బ్యాంకు ఉద్యోగుల ఫిర్యాదు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. ఉద్యోగోన్నతుల్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదేవిషయమై ఇద్దరు ఉద్యోగులు సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఫిర్యాదు చేశారు. అనేకమంది నిజాయితీ కలిగిన ఉద్యోగులు పాలకవర్గాలకు లంచాలు ఇవ్వలేక ఉద్యోగోన్నతులు కోల్పోయారని బ్యాంకు ఉద్యోగి అయిన మంచికలపాటి లలిత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అందులో తాను కూడా ఉన్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 2011లో స్టాఫ్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరి 2015లో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగోన్నతి పొంది పనిచేస్తున్నానని తెలిపారు. 2022 మే, జూన్ నెలల్లో ఒకసారి, అదే సంవత్సరంలో నవంబరు, డిసెంబరుల్లో మరోసారి ప్రమోషన్ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. తన తర్వాత చేరిన కొంతమంది ఉద్యోగులకు, జూనియర్లకు మేనేజర్లుగా, చీఫ్ మేనేజర్లుగా ఆరునెలల వ్యవధిలోనే ఉద్యోగోన్నతి ఇచ్చారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విచారించి తనకు

మిగతా 6వ పేజీలో

పోలీసు శాఖలో విషాదం



విజయ్‌కృష్ణ (ఫైల్)



చలపతిరావు(ఫైల్)




మస్తాన్ (ఫైల్)

- ఇరువురు హెడ్ కానిస్టేబుళ్లు హఠాన్మరణం
- మరొకరు ఆత్మహత్య
- మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి

ఒంగోలు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖలో ఒకే రోజు ముగ్గురు వివిధ కారణాలతో మృతిచెందారు. వారిలో ఇరువురు హెడ్ కానిస్టేబుళ్లు హఠాన్మరణం చెందగా.. మరో కానిస్టేబుల్ కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో ఆశాఖలో విషాదం నెలకొంది. ఒంగోలు దిశ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్

మిగతా 6వ పేజీలో



వినతులను స్వీకరిస్తున్న ఎరిక్షన్‌బాబు

ప్రజాదర్బార్‌కు పెద్దఎత్తున వినతులు

ఎర్రగొండపాలెంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజలు భారీగా తరలివచ్చారు. తమ సమస్యలను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, అధికారుల ఎదుట ఏకరువు పెట్టారు. మొత్తం 201 మంది అర్జీలు సమర్పించారు. వీటిని వందరోజుల్లో పరిష్కరిస్తామని ఎరిక్షన్‌బాబు తెలిపారు. అధికారులు ప్రజలతో మమేకమై పనిచేసి, వారికి జవాబుదారీగా ఉండాలని సూచించారు. మార్పు కోసమే ప్రజాదర్బార్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, ఎర్రగొండపాలెం రూరల్

శభాష్ డాక్టర్

మానవత్వం చాటుకున్న గొట్టిపాటి లక్ష్మి

భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న గర్భిణికి ఉచిత ప్రసవం



శస్త్ర చికిత్స అనంతరం శిశువుతో లక్ష్మి

7

నమ్మి పొరుగు రాష్ట్రం నుంచి వస్తే నట్టేట ముంచిన ప్రియుడు

- పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్న యువతి
- జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట ఘటన
- ఆసుపత్రిలో మృత్యువుతో పోరాటం
- కర్ణాటకకు చెందిన ఆమె కొంతకాలంగా చినారికట్ల యువకుడితో సహజీవనం
- కేసు నమోదు చేసిన ఒంగోలు తాలూకా పోలీసులు

6



జీజీహెచ్‌లోని ఐసీయూ వద్ద ఉన్న పోలీసులు

నమ్మి పొరుగు రాష్ట్రం నుంచి వస్తే..
నట్టేట ముంచిన ప్రియుడు

- పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్న యువతి
- ఆసుపత్రిలో మృత్యువుతో పోరాటం

ఒంగోలు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రియుడిని నమ్మి ఎక్కడి నుంచో వస్తే అన్యాయం చేసి వదిలి వెళ్లిపోయాడు.. అతని ఆచూకీ కోసం పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగడం లేదు. ఈ ఆవేదనతో ఓ యువతి ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకొంది. కర్ణాటకకు చెందిన యువతి రెండేళ్ల క్రితం పశ్చిమగోదావరి జిల్లా తణుకులో స్నేహితురాలింటికి రాగా, పొదిలి మండలం చిన్నారికట్లకు చెందిన చిరిగిరి మత్తయ్య అనే యువకుడు పరిచయమయ్యాడు. అనంతరం ముత్తయ్య కర్ణాటక వెళ్లి 'మీ అమ్మాయిని ప్రేమిస్తున్నాను' అంటూ ఆమె తల్లిదండ్రులకు చెప్పాడు. వారు అంగీకరించక పోవడంతో ఇద్దరూ ఒంగోలు వచ్చి సమతానగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. సంతనూతలపాడు మండలం మద్దులూరులో గల రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. రెండు నెలల క్రితం మత్తయ్య ఆ యువతిని వదిలి ఎటో వెళ్లిపోయాడు. బాధితురాలు అప్పట్లోనే స్పందనలో ఎస్పీని కలిసి తనకు న్యాయం చేయాలని వేడుకుంది. ఎస్పీ ఆదేశాల మేరకు దిశ పోలీసు స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు విచారించి ఆమెను స్థానిక శక్తిసదన్‌కు పంపిచారు. అక్కడే ఉంటూ న్యాయం కోసం పోలీసులు చుట్టూ తిరుగుతోంది. ఇటీవల ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌కు వచ్చిన తన గోడు వెళ్లబోసుకుంది. మత్తయ్య ఎక్కడ ఉన్నాడో పిలిచి విచారించి తనకు న్యాయం చేయాలని కోరింది. అయితే తాలూకా పోలీసులు తిరిగి ఆ యువతిని శక్తి సదన్‌కు పంపించారు. ప్రియుడి ఆచూకీ తెలియకపోవడం, తనకు ఇక న్యాయం జరగదని భావించి సోమవారం యువతి పెట్రోల్‌తో జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చింది. ఎదురుగా రోడ్డుపై పెట్రోలు పోసుకుని నిప్పు అంటించుకుంది. వెంటనే కార్యాలయంలోకి పరుగు తీసే ప్రయత్నం చేసింది. అక్కడ గేటు వద్ద ఉన్న సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై దుప్పటి తెచ్చి ఆ యువతిపై కప్పి మంటలను ఆర్పారు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు న్యాయమూర్తి యువతి వద్ద వాంగ్మూలం రికార్డు చేశారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు తాలూకా సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

చెన్నకేశవస్వామి భూముల్లో
ఆక్రమణల తొలగింపు


అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న దేవాదాయశాఖాధికారులు

మార్కాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానానికి చెందిన భూమిలో చోటుచేసుకున్న ఆక్రమణలను దేవదాయశాఖ అధికారులు సోమవారం తొలగించారు. స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని 206-బీ సర్వే నంబరులోని 0.65 ఎకరాల చెన్నయ్య ఆలయానికి చెందిన భూమి ఆక్రమణకు గురైంది. ఆ భూమిలో ఒక లారీ కాటా, సుమారు ఐదు బడ్డీ కొట్లు వెలిశాయి. దీంతో దేవదాయశాఖ అధికారులు ఇప్పటికే పలుమార్లు వాటిని తొలగించాలని నోటీసులు ఇచ్చారు. కానీ ఆక్రమణదారుల నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. దీంతో సోమవారం దేవదాయశాఖ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో అక్కడ ఉన్న ఆక్రమణలను తొలగించారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం.పానకాలరావు ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. అక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ ఎస్సై సైదుబాబు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మార్కాపురం, కందుకూరు ఇన్‌స్పెక్టర్లు నాగమల్లేశ్వరరాజు, జీపీ సత్యనారాయణ, మార్కాపురంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఈవోలు గొలమారి శ్రీనివాసరెడ్డి, రమేష్, వేణుగోపాలరావు, శివశంకర్, నారాయణరెడ్డి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, కార్తీక్, నరసింహబాబు తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంతోనే సమస్యలకు పరిష్కారం

చీరాలటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కార్మికులు సంఘటితంతోనే సమస్యలకు పరిష్కారం ఉంటుందని ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-1104 విద్యుత్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్‌రావు అన్నారు. సోమవారం బాపనమ్మ కల్యాణ మండపంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ క్రమంలో సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. చీరాల డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.


పుష్కరిణిలోకి చేరుతున్న నీరు

తెప్పోత్సవానికి పుష్కరణి సిద్ధం

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి పుష్కరిణిని తెప్పోత్సవానికి సిద్ధం చేశారు. కార్తీక మాసంలో చిలుక ద్వాదశిని పురస్కరించుకుని ఏటా శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఈ పుష్కరిణిలో జలవిహారం చేస్తారు. బుధవారం రోజు స్వామికి జరుగనున్న తెప్పోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. చెరువు నుంచి పంటకాలువ ద్వారా కోనేరుకు నీరందించే మార్గం మూసుకుపోవడంతో మోటార్ల ద్వారా నీటిని తోడి కోనేరును నింపారు. పారిశుధ్య పనులు చేపట్టి రంగుల వేశారు. ఈ కార్యక్రమానికి శాశ్వత ఉభయదాతలుగా డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ వ్యవహరిస్తున్నారు. పుష్కరిణిలో జరిగే కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో పూర్తి చేశారు.

కుటుంబ కలహాలతో కానిస్టేబుల్ ఆత్మహత్య

మార్కాపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో కానిస్టేబుల్ వేముల మస్తాన్ (33) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కొట్టాలపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి తర్వాత చోటుచేసుకుంది. అందిన సమాచారం ప్రకారం... మృతుడు మస్తాన్ మార్కాపురం పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటూ స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వర్తించేవాడు. ఆదివారం రాత్రి సమయంలో ఇంట్లో భార్యభర్తల మధ్య చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకుంది. అదే గ్రామంలో నివాసం ఉంటున్న మస్తాన్ సోదరుడు భార్యభర్తలకు సర్దిచెప్పి గొడవను సద్దుమనిగేలా చేశారు. మస్తాన్ పిల్లలను, మస్తాన్ భార్యను పక్కనే ఉన్న ఇంటికి తీసుకెళ్లాడు. అప్పటి వరకు బాగానే అన్నమాటను విన్న మస్తాన్


కానిస్టేబుల్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న సీఐ, ఎస్‌ఐలు


మస్తాన్ (ఫైల్)

ఎమైందో ఏమో తెలియదు. తన ఇంట్లోనే తెల్లవారేసరికి ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెంది కనిపించినట్లు తెలిపారు. తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. భార్య గాయత్రి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కానిస్టేబుల్ మస్తాన్ మృతదేహం వద్ద సీఐ సుబ్బారావు, రూరల్, టౌన్ ఎస్‌ఐలు అంకమ్మరావు, సైదుబాబులు నివాళి అర్పించారు. సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. పోలీసుల డిపార్ట్‌మెంట్ నుంచి రూ.75వేల చెక్కు అందించారు. ఎస్సైలు, సీఐలు మట్టిఖర్చులు నిమిత్తం రూ.55వేలు అందించారు. ఘటనలపై మస్తాన్ తల్లికి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.



అబ్బురం.. విన్యాసం!

ఒంగోలులోని రామనగర్‌లో ఎంపీ మాగుంట కార్యాలయం సమీపాన పార్వతీ పరమేశ్వరుల దర్బార్ సేవ కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కళారంగాలకు చెందిన ప్రముఖులు తమ కళారూపాల ద్వారా నిర్వహించిన విన్యాసాలు అబ్బురపరిచాయి. చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఉపాధి లక్ష్యాలను
నిర్దేశించాలి

(5వ పేజీ తరువాయి)

దిశానిర్దేశం చేశారు. లోకాయుక్త కేసులపై కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు చేపట్టడంతోపాటు వాటర్ ట్యాంకుల పరిశుభ్రం, వాటర్ టెస్టింగ్, క్లోరినేషన్‌పై దృష్టిసారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.

బాల్యవివాహాల రహిత ప్రకాశం

జిల్లాను బాల్య వివాహల రహిత ప్రకాశంగా తీర్చిదిద్దేందుకు ఈనెల 14న అన్ని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మెగా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసి రానున్న మార్చి నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో చిన్నఓబులేసు, ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్ లోకేశ్వరరావు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, డీపీవో వెంకటనాయుడు, వెంకటేశ్వర్లు, డాక్టర్ సురేష్‌కుమార్, భరద్వాజ్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగోన్నతుల్లోనూ
అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

న్యాయం చేయాలని కోరారు. బ్యాంకులో జరిగిన అవినీతిలో పాలకవర్గాలే కాకుండా అందులో పనిచేసే అనేకమంది ఉద్యోగుల ప్రమేయం కూడా ఉందని ఆమె కలెక్టర్‌కు చెప్పారు.

సమగ్ర విచారణ చేయాలి

గతేడాది సెప్టెంబరు, ఈ ఏడాది ఫిబ్రవరి నెలల్లో పీడీసీసీ బ్యాంకులో ఇచ్చిన ఉద్యోగోన్నతుల్లో తనకు తీవ్ర అన్యాయం జరిగిందని స్టాఫ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ మహబూబ్ సుభాని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సీనియారిటీ జాబితాలో తనకన్నా జూనియర్స్ దగ్గర లంచాలు తీసుకొని తనకు అన్యాయం చేశారన్నారు. బ్యాంకులో 2019 నుంచి 2024 వరకు జరిగిన ఉద్యోగుల ప్రమోషన్లతో పాటు బ్యాంకులో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.


అద్దంకి మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న సంత

గాడిన పడని అన్నగారి సంత

- వైసీపీ పాలనలో పేరు మార్చిన వైసీపీ
- నిర్వహణ అస్తవ్యస్తం

అద్దంకి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మార్కెట్ యార్డ్ ఆవరణలలో నిర్వహించే సంతలు ఇంకా గాడిన పడలేదు. దశాబ్ద కాలం కిందట తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అప్పటి అద్దంకి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో వినూత్నంగా అన్నగారి సంత నిర్వహణ ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తిం పు వచ్చింది. రైతులే స్వయంగా తమ ఉత్పత్తులను తెచ్చుకొని అమ్మకాలు చేసుకునేలా ఎన్టీఆర్ పేరుతో అన్నగారి సంతగా నామకరణం చేసి ప్రారంభించారు. కొనుగోలుదారులకు తక్కువ ధరకే తాజా కూరగాయలు అందుబాటులోకి రాగా, రైతులకు కూడా ఉపయోగకరంగా దళారులు లేకుండా తాము పండించిన కూరగాయలను నేరుగా అమ్ముకునే అవకాశం రావడంతో రైతులకు కూడా లాభదాయకంగా మారింది. అద్దంకి మార్కెట్ యార్డు పరిధిలోని అద్దంకి, మేదరమెట్ల, పం గులూరులో ఉన్న యార్డులలో నిర్వహించారు. కొంతకాలం తరువాత పంగులూరులో నిలిపివేశారు. ఆదివారం అద్దంకిలో, బుధవారం మేదరమెట్లలో నిర్వహిస్తున్నారు. ముందురోజే ఆయా కూరగాయల ధరలను నిర్ధారించి, కచ్చితంగా ఆయా ధరలకే అన్ని దుకాణాలలో ని ర్వహించేలా చేశారు. అయితే వైసీపీ అధికారంలోకి వ చ్చిన తరువాత అన్నగారిసంత పేరును రాజన్న సంతగా మార్పు చేశారు. నిర్వహణపై మార్కెట్ కమిటీలు ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సంతలో రైతుల స్థానంలో కొంత మంది వ్యాపారులు రంగ ప్రవేశం చేయడంతో సంత నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ధరలపై నియంత్రణ లేకుండా పోయింది. దీంతో ఎవరి ఇష్టం వచ్చిన ధరలకే వారు అమ్మకాలు చేయడం ప్రారంభించారు. దీంతో సంత పట్ల ప్రజలలో ఆసక్తి తగ్గింది. టీడీపీ కూటమి ప్రభు త్వం అధికారంలోకి రావడంతో అన్నగారి సంతకు పూర్వ వైభవం వస్తుందని ప్రజలు భావించారు. అయితే ఇంకా మార్కెట్ కమిటీ నియామకం జరగకపోవడంతో సంత నిర్వహణను కొంత మంది టీడీపీ నేతలు అనధికారికంగా నిర్వహిస్తున్నా ఇంకా గాడిన పడలేదన్న విమర్శలు వస్తున్నాయి. ధరలపై నియంత్రణ లేకపోవడంతో నిర్దిష్టమైన ధరలు లేకుండా పోయాయి. అదే సమయంలో ఎవరికి వారే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు కూడా అమ్మకాలు చేస్తున్నారు. మార్కెట్ కమిటీ ఏర్పడే వరకు కనీసం మార్కెట్ యార్డులో పనిచేసే సిబ్బంది ద్వారా అయినా పర్యవేక్షణ చేసేలా చర్య లు చేపట్టి అన్నగారి సంత పూర్వవైభవం చేసేలా చర్య లు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. రైతులు పండించిన కూరగాయలను రైతులే స్వయంగా వచ్చి అమ్మకాలు చేసుకునే విధంగా రూపకల్పన చేసి మార్కెట్ యార్డు ఆధ్వర్యంలోనే నిర్వహించే విధంగా అన్ని అనుమతులు తీసుకుంటే మార్కెట్ యార్డు కమిటీలు లేనప్పుడు కూడా స క్రమంగా నిర్వహించే వీలుంటుందని పలువురు అభి ప్రాయపడుతున్నారు. ప్రస్తు తం అలా కాకుండా మార్కెట్ యార్డు పర్యవేక్షణ లేకుం డా అనధికారికంగా నిర్వహిస్తుండడంతో అజమాయిషీ లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి.

నిధుల ఊరట

(5వ పేజీ తరువాయి)

అందులో కేవలం రూ.26.34కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. ఇక గుండ్లకమ్మ ప్రాజెక్టుకు రూ.30కోట్లు కేటాయింపు చేయగా రూ.3.87 కోట్లు ఖర్చుచేశారు. దీంతో వెలిగొండ పనులు ముందుకు సాగలేదు. గుండ్లకమ్మ గేట్ల మరమ్మతులకు కూడా నిధులు లేక రెండేళ్లుగా ఆయకట్టుకు నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ రెండింటిపై దృష్టిసారించింది. వెలిగొండలో రూ.100 కోట్లకుపైగా పనులు ఇప్పటికే చేయగా రూ.80 కోట్ల చెల్లింపులు కూడా జరిగాయి. అందుకు సంబంధించిన నిధులను ఓటాన్ అకౌంట్ బడ్జెట్ నుంచి ఇచ్చారు. మరో రూ.23 కోట్లు చెల్లించాల్సి ఉంది. కాగా ఇటీవల ప్రాజెక్టును ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు సందర్శించి సమీక్ష చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు అవకాశం ఉన్న మేర పనులు చేస్తామని వాటికి అవసరమైన నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామన్నారు. దానికి అనుగుణంగా ప్రస్తుతం బడ్జెట్‌లో కేటాయింపు కనిపించింది.

తక్షణ అవసరాల కోసం..

ఓటాన్ బడ్జెట్‌లో ఇచ్చిన నిధులను కూడా కలిపి ఈ ఏడాదికి వెలిగొండకు రూ.393.50 కోట్లు కేటాయింపు చేశారు. అంటే ఇప్పటికే ఖర్చుచేసిన రూ.100 కోట్లు పోను రానున్న నాలుగు నెలలకు మరో రూ.200 కోట్లు ఖర్చుచేసేలా నిధులు అందుబాటులో ఉన్నాయి. మొత్తం రూ.393.50 కోట్లలో ప్రాజెక్టు పనులకు రూ.248 కోట్లు కేటాయించగా నిర్వాసితులకు పరిహారం చెల్లింపునకు రూ.80కోట్లు, భూసేకరణకు రూ.48కోట్లు, ఆర్‌అండ్‌ఆర్‌కు రూ.16.42 కోట్లు కేటాయించారు. నిర్వాసితుల పునరావాసానికి ఇంకా భారీగా నిధుల అవసరం ఉండగా తక్షణం ప్రాజెక్టుకు నీరిచ్చే పరిస్థితి లేదు కనుక వచ్చే ఏడాది బడ్జెట్‌లో అందుకు కేటాయింపులు ఉంటాయని అధికారవర్గాల సమాచారం. ఇక గుండ్లకమ్మ ప్రాజెక్టుకు గత వైసీపీ ప్రభుత్వం రూ.30కోట్లు కేటాయింపు చేసి రూ.3.87 కోట్లు మాత్రమే ఇవ్వగా ప్రస్తుత బడెట్‌లో తక్షణ అవసరాలకు అనుగుణంగా రూ.13కోట్లు కేటాయించారు. గేట్ల మరమ్మతుల కోసం రూ.6.50 కోట్లు ఇంకా అవసరం కాగా అవి పోను మిగిలిన ఈ నాలుగు నెలల నిర్వహణ ఖర్చులకు ఇబ్బంది లేకుండా చేశారు.

నీటివనరుల అభివృద్ధికి నిధులు

ఒంగోలులోని ప్రాజెక్టుల సీఈ పరిధిలో రాష్ట్రంలో ఎన్ఎస్‌పీ కాలువల నిర్వహణ మొత్తం ఉండగా వాటి కోసం రూ.128.62 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని ఎన్ఎస్‌పీ కాలువల నిర్వహణ సాగనుంది. ఇక ఇదే సీఈ పరిధిలో మొత్తం జలవనరుల శాఖ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర నిర్వహణ ఖర్చులకు రూ.31.44కోట్లు, మీడియం ఇరిగేషన్, ఇతర పనులకు మరో రూ.6.20 కోట్లు కేటాయించారు. అలా మొత్తంగా ఒంగోలు కేంద్రంగా ఉన్న సీఈ పరిధిలో ఈ బడ్జెట్‌లో రూ.581.76 కోట్లు కేటాయింపు జరిగింది. అదే వైసీపీ ప్రభుత్వంలోని 2023-24లో ఈసీఈ పరిధిలోనూ రూ.301 కోట్లు కేటాయించి రూ.217.39 కోట్లు మాత్రమే ఖర్చుచేశారు.

ప్రజారంజకబడ్జెట్


దామచర్ల సత్య, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్



కూటమి ప్రభుత్వం ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజారంజక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి, చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తోంది. దానికి అనుగుణంగా ప్రతిపాదనలు ఉన్నాయి. అభివృద్ధి, సంక్షేమం రెండింటికి సమప్రాధాన్యత ఇస్తూ సూపర్ సిక్స్ పథకాల అమలుకు చర్యలు ఉన్నాయి. వాటా ప్రకారం జిల్లా ప్రజలకు మేలు జరగనుంది. వెలిగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టులకు తక్షణ అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయించింది. రానున్న ఏడాది ఇంకా పెరుగుతాయి.

బడ్జెట్‌లో జిల్లాకు ప్రయోజనాలు శూన్యం

డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు



రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు ఎలాంటి ప్రయోజనం లేదు. కేవలం అంకెల గారిడీ బడ్జెట్‌గా ఉంది. వెలిగొండకు నిధులు కేటాయించకపోవడం దారుణంగా ఉంది. మార్కాపురంలోని మెడికల్ కాలేజీకి నిధుల కేటాయింపుతోపాటు దొనకొండను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ఆ ప్రాంత నిరుద్యోగయువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని విస్మరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేవు. సూపర్ సిక్స్ పథకాలను కూడా బడ్జెట్‌లో విస్మరించారు.

మాటల గారడీ బడ్జెట్

-ఎంఎల్ నారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి



మాటల గారడీ బడ్జెట్‌లాగా ఉంది. జిల్లావాసుల ఆశలపై నీళ్లు చల్లింది. ఏ ఒక్క సంక్షేమ కార్యక్రమానికి నిధులు కేటాయింపులు లేవు. రాష్ట్రప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలకు నిధుల కేటాయించలేదు. ఇళ్ల స్థలాలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు కేటాయింపునకు బడ్జెట్లో ప్రస్తావనేది. ఇరిగేషన్‌కు కేటాయించిన నిధులు జీతాలు, బకాయిలు, నిర్వహణ ఖర్చులకే సరిపోతాయి. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం తిరిగి అటకెక్కే పరిస్థితి నెలకొంది. మహిళా శిశు సంక్షేమశాఖకు కేటాయించిన నిధులు చూస్తే ప్రతి మహిళకు ప్రతినెల రూ.1500 పథకం లేనట్లుగా ఉంది.

పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు నిల్

-సయ్యద్ హనీఫ్, సీపీఎం జిల్లా కార్యదర్శి



జిల్లాలోని ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు లేదు. వెలిగొండకు సుమారు రూ.4వేల కోట్లు అవసరం ఉండగా ఈ ఏడాది కనీసం రూ.2వేల కోట్లు కేటాయించాల్సి ఉంది. కానీ అందుకు భిన్నంగా నిధులు కేటాయించారు. ఇక పెండింగ్‌లో ఉన్న గుండ్లకమ్మ, రామతీర్థం, సంగమేశ్వర ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి. వెలిగొండను అటకెక్కించే విధంగా బడ్జెట్ ఉంది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి కేటాయింపులు అరకొరే. సూపర్ సిక్స్‌కు నిధులు కేటాయింపులు విషయంలో ప్రభుత్వం మాయ చేస్తుంది.

హామీలకు దక్కని బడ్జెట్

చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి



బడ్జెట్‌లో హామీలకు నిర్దిష్టమైన కేటాయింపులు లేవు. ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేసి అధికారంలోకి వచ్చాక విస్మరించారు. అనేక పథకాల అమలుకు బడ్జెట్‌లో కేటాయింపులు కూడా లేవు. వ్యవసాయ, వైద్య, గృహ నిర్మాణ రంగాలకు నిధుల కేటాయింపులు చూపించినా ఆచరణలో అమలుకు సంబంధిత శాఖలకు ఖర్చు చేయడం లేదు.

గుండెపోటుతో పశువైద్యాధికారి మృతి

యద్దనపూడి (మార్టూరు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి పశువైద్యాధికారి బట్టా సురేష్‌బాబు (42) గుండెపోటు కారణంగా ఆదివారం సాయంత్రం గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అతని భార్య శారద మండలంలోని పూనూరు పశు వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. గత పదేళ్లుగా మార్టూరు మండలంలో ద్రోణాదుల, బొబ్బేపల్లి, బల్లికురవ మండలంలో సురేష్ బాబు పశువైద్యాధికారిగా పనిచేశారు. ప్రస్తుతం యద్దనపూడి పశువైద్యాధికారిగా పనిచేస్తూ ఆదివారం ఉదయం మార్టూరులోని స్వగృహంలో గుండెపోటుకు గురయ్యారు.దాంతో కుటుంబసభ్యులు అతనిని చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. అనంతరం మృతదేహన్ని అతని స్వగ్రామమైన జాండ్రపేటలోని ఇంటికి తీసుకువెళ్లారు. అతనికి 13 ఏళ్ల కుమార్తె, రెండేళ్ల బాబు ఉన్నారు. సోమవారం ఉదయం జాండ్రపేటలో జరిగిన అంత్యక్రియలు కార్యక్రమానికి మండలంలోని పశువైద్యాధికారులు మాధవీలత, క్రాంతికిరణ్, మహేష్‌తో పాటు పలువురు సిబ్బంది వెళ్లి నివాళులర్పించారు. మార్టూరు, యద్దనపూడి మండలాల్లో పశుపోషకులకు, రైతులకు సుపరిచితులైన సురేష్‌బాబు మృతి కలిచివేసింది.


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్


నివాళి అర్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పోలీసు శాఖలో
విషాదం

(5వ పేజీ తరువాయి)

చలపతిరావు ఈనెల 6న అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా శనివారం తెల్లవారుజామున గుండెపోటు వచ్చింది. తిరిగి వెనక్కి తీసుకొస్తుండగా మృతిచెందారు. ఒంగోలులో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కోమటినేని విజయకృష్ణ (46) స్థానిక మార్కెట్ యార్డులో విధులు ముగించుకొని శనివారం ఉదయం కమ్మపాలెంలో ఇంటికి వచ్చి టిఫిన్ చేస్తూ వాంతులు చేసుకున్నాడు. ఆసుపత్రికి తరలించేలోపే ఆయన గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు.. మార్కాపురం మండలం కొట్టాలపల్లెకు చెందిన కానిస్టేబుల్ వేముల మస్తాన్(32) మార్కాపురం పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్నారు. కుటుంబ కలహల నేపథ్యంలో ఇంట్లో ఉరి వేసుకొని మృతిచెందారు.

మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి

హెడ్ కానిస్టేబుల్ విజయకృష్ణ హఠాన్మరణం విషయం తెలిసి మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత పభుత్వంలో చంద్రబాబు కుటుంబంపై అసెంబ్లీలో తీవ్ర పదజాలంతో వైసీపీ ఎమ్మెల్యేలు మాట్లాడిన సమయంలో మనస్తాపానికి గురై విజయకృష్ణ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ విషయం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే తిరిగి చంద్రబాబునాయుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత ఆయన మళ్లీ విధుల్లో చేరారు. ప్రస్తుతం వీఆర్‌లో పనిచేస్తున్న విజయకృష్ణ గుండెపోటుతో మృతిచెందడంతో మంత్రి లోకేష్ ఎక్స్‌లో తన విచారాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. అదేవిధంగా హెడ్‌కానిస్టేబుల్ విజయకృష్ణ మృతి చాలా బాధాకరమని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఓ ప్రకటనలో తెలిపారు. వైసీపీ అరాచకాలను నిలదీసినందుకు విజయకృష్ణను గతంలో అనేక రకాలుగా వేధించారని పేర్కొన్నారు. కానిస్టేబుల్ విజయకృష్ణ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ముక్తినూతలపాడులోని అయన గృహానికి మృతదేహాన్ని తరలించగా సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, టీడీపీ నాయకుడు కామేపల్లి శ్రీనివాసరావు సందర్శించి నివాళులర్పించారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, తాలూకా సీఐ అజయ్‌కుమార్ కూడా మృతదేహంపై పూలమాలలు ఉంచి అంజలి ఘటించారు.



ఉపాధ్యాయుడు ప్రసాద్

ఇంటర్‌లో ఫెయిల్... టీచర్‌గా పాస్!

- ఫెయిల్ అయిన ఇంగ్లీషుపైనే పట్టు సాధన
- అదే సబ్జెక్టుపై బీఈడీ చేసి ఉద్యోగం పొందిన టీచర్
- తన సబ్జెక్ట్‌లో విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత
- ఆదర్శంగా నిలుస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు

ఆయన పేరు తంగెళ్ల ప్రసాద్. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్న దానికి ఆయన నిదర్శనం. ఇంటర్‌లో ఇంగ్లీషు ఫెయిల్ అయిన ప్రసాద్.. అనంతరం ఆ సబ్జెక్టుపైనే పట్టు పెంచుకున్నారు. ప్రస్తుతం అదే సబ్జెక్టు ఉపాధ్యాయుడిగా తాను చదువుకున్న పాఠశాలలోనే పనిచేస్తున్నారు. ఆయన ఎక్కడ పనిచేసినా అక్కడి విద్యార్థులు ఇంగ్లీషులో 98 శాతం ఉత్తీర్ణులవ్వడం ఖాయమన్న అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమవుతోంది.

కొండపి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొండపికి చెందిన తంగెళ్ల ప్రసాద్ 1983-85లో గ్రామంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. సెకండియర్ ఇంగ్లీషులో ఫెయిలయ్యారు. అప్పటి వరకూ ఇంగ్లీషు అంటే ఆయనకు భయం ఉండేది. ఆ తర్వాత భయం వదిలి ఇంగ్లీషుపై మక్కువ పెంచుకున్నారు. పట్టుదలతో తిరిగి పరీక్ష రాసి పాసయ్యారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో దూర విద్య ద్వారా డిగ్రీ పాసయ్యారు. మచిలీపట్నం ఏజే కాలేజీలో సోషల్, ఇంగ్లీషు తీసుకుని బీఈడీ పూర్తి చేశారు. 1996లో ఎస్‌జీటీగా కొండపి మండలంలోని కోయవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో తొలిసారి విధుల్లో చేరారు. ఆ తరువాత చినకండ్లగుంట, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని లింగసముద్రం మండలం వీరరాఘవునికోటలో పని



క్లాసులు బోధిస్తున్న ఉపాధ్యాయుడు ప్రసాద్

చేరారు. అనంతరం ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఇంగ్లీషు పాఠాలు బోధిస్తూ శభాష్ అనిపించుకున్నారు.

20 సంవత్సరాలుగా ఇంగ్లీషు బోధన

కొండపిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రసాద్ 2005లో ఇంగ్లీషు ఉపాధ్యాయుడిగా చేరారు. 2015 వరకూ పనిచేశారు. 2015 నుంచి 2018 వరకు సింగరాయకొండలోని జీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వర్తించారు. తిరిగి 2018 నుంచి కొండపిలోని జీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్నారు. ఈ 20 ఏళ్లలో ప్రధానంగా విద్యార్థులు ఇంగ్లీషు అంటే భయపడకుండా వారికి శిక్షణ ఇవ్వడంతోపాటు, వారిలో ఆత్మవిశ్వాసం పెరిగేలా ప్రసాద్ వృత్తికి అంకితమై పనిచేస్తున్నారు. తన సబ్జెక్టు ఇంగ్లీషులో ఒక్కరు కూడా ఫెయిల్ కాకూడదన్నదే ఆయన లక్ష్యం. తన వద్ద ఇంగ్లీషు చదివిన విద్యార్థుల్లో ఏటా 98 శాతం మంది ఉత్తీర్ణులవుతున్నారు. ప్రసాద్ తండ్రి దివంగత తంగెళ్ల శ్రీనివాసులు కూడా టీచర్‌గా పనిచేశారు. ఒక్కరోజు కూడా పాఠశాలకు సెలవు పెట్టని రికార్డు ఆయనకు ఉంది. ప్రసాద్ తమ్ముడు కూడా ఉపాధ్యాయుడిగానే పనిచేస్తుండటం విశేషం.

ఇంగ్లీషు అంటే భయం పోయింది

ప్రసాద్ మాస్టర్ సులువుగా అర్థమయ్యేలా ఇంగ్లీషు బోధిస్తారు. అందరూ పాస్ అవ్వాలని ప్రతిరోజూ తరగతి గదిలో చెబుతుంటారు. పాఠ్యాంశాల్లో అనుమానాలను ఎప్పటికప్పుడు నివృతి చేస్తారు. వ్యాకరణం క్షుణ్ణంగా చెబుతారు.

- డి.లేఖన, 9వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొండపి

స్టడీ మెటీరియల్ సొంత డబ్బులతో కొనిచ్చారు

మా తరగతిలోని అందరు విద్యార్థులకు ప్రసాద్ సార్ దాదాపు రూ.7,500 వెచ్చించి ఇంగ్లీషు స్టడీ మెటీరియల్, ప్రాక్టీసు బుక్స్ అందజేశారు. గతంలో ఇంగ్లీషు అంటే కొంత భయం ఉండేది. ఇప్పుడు నాకు భయం పోయింది. మంచి మార్కులు సాధిస్తాననే ధైర్యం వచ్చింది. అందరిలో ఈ మార్పు కనిపిస్తోంది.

- ఎస్.కె. మొబీనా, పదో తరగతి, ప్రభుత్వ పాఠశాల, కొండపి

క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి

- ఎస్పీ దామోదర్, ఎంపీ మాగుంట
- ఘనంగా రాష్ట్రస్థాయి మినీ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలు ఒంగోలులో నిర్వహించడం అభినందనీయం అని, ప్రతి క్రీడాకారుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఎస్పీ దామోదర్ పేర్కొన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 11 బాల, బాలికల రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను ఎస్పీ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు సంబంధించి ఆదివారం క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు జరగ్గా, సోమవారం పోటీలను ఎస్పీ ప్రారంభించి, చిన్నారులను అభినందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు, పోలీస్ శాఖ తరుపున ప్రథమ బహుమతిగా రూ.2వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1000 అందజేస్తామని తెలిపారు. ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులను రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడాకారులుగా సిద్ధం చేస్తున్న తల్లిదండ్రులను ఆయన అభినందించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అకాడమి నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. వ్యాపారవేత్త శిద్దా సుధీర్ కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో ఒంగోలులో లార్డ్ కృష్ణ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. నిపుణులైన కోచ్‌ల ఆధ్వర్యంలో క్రీడాకారులను తీర్చి దిద్దుతూ జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తున్న అకాడమి నిర్వాహకులను సుధీర్ అభినందించారు.



బ్యాడ్మింటన్ ఆడి పోటీలు ప్రారంభిస్తున్న ఎస్పీ, ఆటలో పాల్గొన్న క్రీడాకారులు

అకాడమి ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీ కృష్ణ మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే మ్యాచ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారన్నారు. మొదటిసారి ఇండోనేషియన్ కోచ్‌లను నియమించినట్టు తెలిపారు. క్రీడాకారులను జాతీయస్థాయిలో రాణించేలా శిక్షణ అందిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కామేపల్లి శీతారామయ్య, రాష్ట్ర ప్రెసిడెంట్ ద్వారకానాథ్, అంకమ్మ చౌదరి, రఘు, శ్రీనివాస్ పాల్గొన్నారు. మొదటి రోజ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. సుమారు 200 మందికిపైగా వివిధ జిల్లాల నుంచి చిన్నారి క్రీడాకారులు పాల్గొని, గెలుపు కోసం పోటీ పడ్డారు.

శభాష్ డాక్టర్!

- మానవత్వం చాటుకున్న గొట్టిపాటి లక్ష్మి
- భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న గర్భిణికి ఉచిత ప్రసవం

ముండ్లమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి వైద్య వృత్తిలో అత్యంత ప్రతిభ కనబరుస్తూ నిరుపేదల పాలిట ప్రాణదాతగా నిలుస్తున్నారు. మండలంలోని తూర్పుకంభంపాడు పంచాయతీ పరిధిలోని భట్లపల్లి గ్రామానికి చెందిన తేలుకుట్ల వెంకట నారాయణ ఈనెల 7వ తేదీ స్నేహితులతో కలిసి అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నదిలో సరదాగా ఈతకు వెళ్లాడు. ఈత కొట్టే క్రమంలో సుడిగుండంలో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయాడు. ఆయన ఫొటోగ్రాఫర్‌గా జీవనాన్ని కొనసాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి ఏడాది బాలుడు ఉన్నాడు. భార్య పద్మ పది నెలల గర్భంతో ఉంది. ప్రసవం కోసం లక్ష రూపాయలకుపైగా ఖర్చు పెట్టాల్సి వచ్చింది. చేతిలో చిల్లిగవ్వ లేకుండా పుట్టెడు దుఃఖంతో తల్లడిల్లుతున్న ఆమె పాలిట దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దేవతలా ప్రత్యక్షమైంది. వెంకట నారాయణ మృతి వార్త తెలుసుకున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత సాగర్ దంపతులు పరామర్శించేందుకు ఆదివారం వెంకట నారాయణ ఇంటికి వెళ్లారు. మృతుడి భార్యను ఓదార్చి పైసా ఖర్చు లేకుండా శస్త్ర చికిత్స చేసి తల్లీబిడ్డను కాపాడతానని భరోసా ఇచ్చారు. ఆ మేరకు సోమవారం నరసరావపేటలోని తన ఆస్పత్రిలో పద్మకు శస్త్ర చికిత్స చేసి పండంటి బిడ్డను ఆమె చేతిలో పెట్టారు. ఆపదలో ఉన్నవారు ఎవరైనా కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా ఏవైనా వైద్య సేవలు అవసరమైతే ఒక డాక్టర్‌గా స్పందిస్తానని గొట్టిపాటి లక్ష్మి తెలిపారు.



మృతి చెందిన వెంకట నారాయణ భార్య పద్మను పరామర్శిస్తున్న దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి (ఫైల్)

జాతీయస్థాయిలో పోలీసు ఖ్యాతి

నిలబెట్టిన కానిస్టేబుల్

- సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్‌లో బంగారం పతకం

ఒంగోలుక్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయిలో జరిగిన సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ - 2024లో ఏఆర్ కానిస్టేబుల్ పి.కరిముల్లా బంగారం పతకం సాధించారు. తన అద్వితీయమైన ప్రదర్శన కనబరిచి పోలీసు ఖ్యాతిని చాటారు. ఈనెల 9, 10న తిరుపతిలో ఈ పోటీలు జరిగాయి. ఈ మేరకు సోమవారం ఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్ కరిముల్లాను ఎస్పీ ఏఆర్.దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించి జిల్లా పోలీసు శాఖకు గుర్తింపు తెచ్చారని కొనియాడారు. భవిష్యత్తులో ఇలాంటి పతకాలు సాధించి పోలీసు శాఖ కీర్తి ప్రతిష్టలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఆర్‌ఐలు రమేష్ కృష్ణన్, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.



కరిముల్లాకు బంగారు పతకం, ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ



ర్యాలీలో పాల్గొన్న మందక్రిష్ణ మాదిగ



బహిరంగ సభలో పాల్గొన్న జనం

నగరంలో భారీ ర్యాలీ, డప్పు మోత

ఒంగోలులో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమ్మేళనం గతం కంటే భిన్నంగా వైభవంగా జరిగింది. నగరమంతా ఎమ్మార్పీఎస్ జెండాలు, ఫ్లెక్సీలతో నిండగా, మంద కృష్ణ మాదిగకు కార్యకర్తలు భారీగా స్వాగతం పలికారు. స్థానిక అద్దంకి బస్టాండ్ వద్ద నుంచి వేలాది మంది శ్రేణులు భారీగా తరలివచ్చారు. బాణ సంచాలు కాలుస్తూ, తప్పెట్ల మోతతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. - ఒంగోలు కార్పొరేషన్, ఆంధ్రజ్యోతి



జమ్ములపాలెంలోని 1116 శివలింగాల వేదికలో పూజలు



మార్కాపురంలోని మర్కండేశ్వరాలయంలో భారీ క్యూ



ఆలయాన హారతితో..

- జిల్లా వ్యాప్తంగా కార్తీకశోభ
- భక్తులతో దేవస్థానాలు కిటకిట
- వెల్లివిరిసిన భక్తిభావం

మంచుపొరలు తొలగకముందే.. కోడి కూయకముందే.. తూర్పున సింధూరపు సూరీడు వెలుగులు పంచకముందే.. చిరు చీకట్లు తొలగకముందే... జిల్లాలోని ఆలయాలన్నీ కార్తీక శోభతో కనువిందుచేశాయి. మహిళలు, యువతులు కార్తీక స్నానాలు ఆచరించి దేవస్థానాల్లో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లాలోని త్రిపురాంతకేశ్వరాలాయంలోనూ, టంగుటూరు మండలంలో జమ్ములపాలెంలోని 1116 శివలింగాల వేదికలోనూ, ఒంగోలులోని శివాలయంలోనూ భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి పూజలు చేశారు.



ఒంగోలులోని కొత్తపట్నం రోడ్డులోని శివాలయంలో పూజలు

నగర సుందరీకరణకు 'వార్డుకో వారం'

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో

కమిషనరు వెంకటేశ్వరరావు

వెంగముక్కలపాలెం సచివాలయ

సెక్రటరీలకు షోకాజ్ నోటీసు


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్, మేయర్

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగర సుందరీకరణ కోసం 'వార్డుకో వారం' ప్రత్యేక పారిశుధ్యం, ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమాలను శ్రీకారం పలికినట్లు నగర కమిషనరు డాక్టర్ కే వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు సోమవారం స్థానిక వెంగముక్కలపాలెం, లాయరుపేటలో మేయర్ గంగాడ సుజాతతో కలిసి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ఆయా డివిజన్లలో కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించడంతోపాటు శుభ్రంచేయడం, రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించడం, ఆయిల్ స్ప్రేయింగ్ వంటివి చేస్తామని చెప్పారు. అలాగే వీధిదీపాల మరమ్మతులు, తాగునీటి సమస్యలు, పైపులైను లీకులు, గుంతల రోడ్లు పూడ్చి వేయడం వంటి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు, సిబ్బందితోపాటు వార్డు ప్లానింగ్ సెక్రటరీ, శానిటేషన్ సెక్రటరీ, హెల్త్ ఆఫీసర్, వెల్ఫేర్ సెక్రటరీ పాల్గొనాలని ఆదేశించారు.

ఇదిలా ఉండగా, వెంగముక్కలపాలెంలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వర్తించని కార్మికులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనరు హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డిని ఆదేశించారు. అదేవిధంగా విధులకు గైర్హాజరైన సచివాలయ సిబ్బంది, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ, మహిళా పోలీస్, హెల్త్ సెక్రటరీ, వెల్ఫేర్ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సంబంధిత అధికారులకు చెప్పారు.

విద్యారంగంలో సంస్కరణలకు ఆద్యుడు ఆజాద్

కలెక్టర్ తమీమ్ అన్సారియా


నివాళి అర్పిస్తున్న కలెక్టర్, ఎంపీ, మేయర్, అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన మహనీయుడు మౌలానా అబుల్‌కలాం ఆజాద్ అని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. నేటి యువత ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందన్నారు. అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మైనార్టీల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ థెరిస్సా హైస్కూలు ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏ వ్యక్తి అయినా, సమాజమైనా అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. అంతకు ముందు పాత మార్కెట్ సెంటర్‌లో ఉన్న ఆజాద్ విగ్రహానికి ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మేయర్ గంగాడ సుజాతతో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు లక్ష్మానాయక్, అంజల, నారాయణ, వెంకటేశ్వరరావు, మైనార్టీ నాయకులు కపిల్‌బాషా, హనీఫ్‌ఖాన్, షేక్ సైదా, ఖలీఫాతుల్లా బాషా, గౌస్ పాల్గొన్నారు.

సత్వర పరిష్కారం చూపాలి

ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. అంతకు ముందు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం పలురకాల సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో చిన్న ఓబులేసు, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

జిల్లాలో ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు జరగనున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం కార్యక్రమంలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అదే విధంగా కేన్సర్ నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వైద్యశాఖ ప్రచురించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు బి. చిరంజీవి, వసుంధర, జోసఫ్‌కుమార్, మాధురి, వెంకటనాయుడు, డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ బేబిరాణి, వెంకటేశ్వర్లు, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు పాల్గొన్నారు.

నీరు-చెట్టు బిల్లుల కోసం ఎదురుచూపులు

పొదిలి సబ్ డివిజన్‌లో

రూ.4కోట్లు పెండింగ్

టీడీపీ హయాంలో పనులు

చెల్లింపులు నిలిపివేసిన

గత వైసీపీ ప్రభుత్వం

కూటమి అధికారంలోకి

వచ్చినా లభించని మోక్షం



మర్రిపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం ప్రభుత్వ హయాం (2014-19)లో నీరు-చెట్టు పనులు చేసిన వారికి బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొదిలి ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలోని మూడు మండలాల్లో రూ.4కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నీరు-చెట్టు పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులను నిలిపివేసింది. టీడీపీ సానుభూతిపరులు పనులు చేశారన్న నెపంతో వివిధ రకాల విచారణలతో కాలయాపన చేసింది. దీంతో అప్పులు తెచ్చి పనులు చేసిన వారు తీవ్రంగా నష్టపోయారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి రాగానే వడ్డీతో సహా బకాయిలు చెల్లిస్తామని పార్టీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్‌లు అప్పట్లో స్పష్టమైన హామీ ఇచ్చారు. పలువురు కోర్టుకు వెళ్లడంతో న్యాయస్థానం ఆదేశాల మేరకు కొంత మేర బిల్లులు చెల్లించారు. మర్రిపూడి, పొదిలి మండలాల్లో రూ.కోటికి పైగా చెల్లించాల్సి ఉండగా ఫైనల్ బిల్లులు మరో రూ.2 కోట్ల వరకూ పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు చేసిన వారంతా బిల్లులు అందుతాయని ఆశించారు. కానీ ఐదు నెలలవుతున్నా స్పందన లేకపోవడంతో వారిలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

కళామిత్ర వార్షికోత్సవ కరపత్రాలు ఆవిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో ఈనెల 24వ తేదీన జరగనున్న కళామిత్రమండలి 18వ వార్షికోత్సవ కరపత్రాలను ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాలు ఆవిష్కరించారు. స్థానిక సెయింట్ థెరిస్సా పాఠశాల ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలకు తమవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళామిత్రమండలి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, అవార్డ్సకమిటీ చైర్‌పర్సన్ తేళ్ల అరుణ, మేయర్ గంగాడ సుజాత, వివిధ సాహిత్య రంగాల ప్రముఖులు నాగభైరవ ఆదినారాయణ, కుర్రా ప్రసాద్‌బాబు, యూవీ రత్నం, బీరం అరుణ తదితరులు ఉన్నారు. ఈనెల 24న జరిగేసభలో ప్రముఖ సాహితీవేత్త, రచయిత కే శివారెడ్డికి నూనె వెంకాయమ్మ, వెంకటరత్నం స్మారకజీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేయడంతో పాటు జాతీయ స్థాయిలో పది మందికి కళామిత్ర ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు అంకమ్మరావు, తేళ్ల అరుణలు తెలిపారు.

బాల్యవివాహాల నిర్మూలనకు సమన్వయంతోపనిచేయాలి

జిల్లాలో బాల్య వివాహాలు నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. వైపాలెం, కనిగిరి, కొండపి మండలాలను ఎంపిక చేసి వాటిలోని అన్ని గ్రామాలను చైల్డ్ ఫ్రెండ్లీ విలేజెస్‌గా మార్చడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన బంగారు బాల్యం జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో డీఆర్వో చిన్నఓబులేసు, వివిధ శాఖల అధికారులు శ్యాంబాబు, మాధురి, రవికుమార్, వసుంధర, కనకదుర్గ, అంజల, లక్ష్మానాయక్, జగన్నాధరావు, నారాయణ, అర్చన, వెంకటేశ్వరరావు, చిరంజీవి, డాక్టర్ సురేష్‌కుమార్, కిరణ్‌కుమార్, సామా సుబ్బారావు, దినేష్‌కుమార్, సైమన్ విక్టర్, బాలలసంక్షేమ కమిటీ చైర్మన్ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యాదినోత్సవం


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కొత్తపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ విద్యాదినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయిని మన్నం శ్రీదేవి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రైయినింగ్ కమిషనర్ కొణిజేటి శేషారావు, స్టాఫ్ సెక్రటరీ హరిబాబు, కోశాధికారి పర్రె వెంకటరావు, గైడ్స్ కెప్టెన్ పద్మశ్రీ, ఎం.రమేష్, జిలానీ బాష పాల్గొన్నారు.

మాగుంట నివాసంలో పార్వతీ పరమేశ్వరుల దర్బార్ సేవ


పూజల్లో మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో పార్వతీ పరమేశ్వరుల దర్బార్ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మశ్రీ మతంపల్లిదక్షిణామూర్తి శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవేడుకల్లో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు. వేదపండితులు మఠంపల్లి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. వివిధ కళారంగాలకు చెందిన ప్రముఖులు తమ కళారూపాల ద్వారా విన్యాసాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునరెడ్డి, తాతా ప్రసాద్, బెల్లం సత్యం, పమ్మి భద్రిరెడ్డి ఉన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ చలపతి మృతి

ఒంగోలుక్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహిళ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎం.చలపతిరావు(56) కొద్ది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతిచెందాడు. ఆరోగ్యం సరిగా లేక ఈనెల 6న ఆయన ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరాడు. మెరుగైన వైద్యం కోసం సోమవారం హైదరాబాదు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఒంగోలు మంగమూరు రోడ్డులో ఉన్న స్వగృహానికి ఆయన మృతదేహాన్ని తరలించారు. పలువురు ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు.

అభిషేక ప్రియునికి కార్తీక పూజలు



కార్తీక సోమవారం సందర్భంగా టంగుటూరు మండలంలోని జమ్ములపాలెం 1,116 శివలింగాల వేదికకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అభిషేక ప్రియుడికి రుద్రాభిషేకాలు చేశారు. వేదిక ప్రాంగణంలోనూ, ఉసిరి చెట్టుకింద దీపార్చనలు, దీపదానాలు చేశారు. దేవస్థానం కార్యనిర్వాహకుడు బ్రహ్మయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. - టంగుటూరు



ఫిబ్రవరిలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

అవీఇవీ


సమావేశమైన కరవది హైస్కూలు పూర్వ విద్యార్థులు

ఒంగోలురూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మండలం కరవది జడ్పీ హైస్కూల్లో రిటైర్డ్ హెచ్ఎం సూరిగుచ్చి హనుమంతరావు జ్ఞాపకార్థం ఫిబ్రవరిలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు హైస్కూల్ పూర్వ విద్యార్థులు తెలిపారు. సోమవారం రాత్రి కరవది జడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. ఈ కార్యక్రమాలో వారు మాట్లాడుతూ స్త్రీ, పురుష విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శిరిగిరి రంగారావు, ఆర్ఎంపీ ప్రభాకర్, పెద్దసుబ్బారెడ్డి, మన్నె శ్రీను, వెంకటేశ్వర్లు, గుట్లపల్లి కోటేశ్వరరావు, కొల్లా సుబ్బారావు, నాగిరెడ్డి, భాస్కర్, కొండ్రగుంట శేషు, యూనియారాజు పాల్గొన్నారు.

హేతువాద సంఘం అధ్యక్షుడికి సన్మానం


బేగ్‌ను అభినందిస్తున్న కాంగ్రెస్ పార్టీనాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికైన ఎంకే బేగ్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్కరించారు. సోమవారం ఒంగోలులో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి బోడ్డు సతీష్‌బాబుల ఆధ్వర్యంలో బేగ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో దర్శి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జులు కైపు వెంకట కృష్ణారెడ్డి, పాలపర్తి విజేష్‌రాజ్, షైనం మధు, ఉప్పలపాటి చిన్న కాశయ్య, పాలపర్తి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

'నిందితుడిని అరెస్టు చేయడంలో విఫలం'


నిరసన వ్యక్తం చేస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు మండలం కారుమంచి హైస్కూలులో నాల్గో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ పద్మ ఆరోపించారు. ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి నిష్పక్షపాతంగా విచారణ చేయించి కీచక ఉపాధ్యాయుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రీవెన్స్‌సెల్‌లో వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్యామ్, మహిళా సంఘం కార్యదర్శి వాకా మంజుల, చిట్టిపాటి పద్మ, వేణి, సీతారావమ్మ, అమ్మాజీ, చందన, మహేశ్వరి, చొప్పర జాలన్న, సీఎస్ సాగర్, రంగారావు తదితరులు ఉన్నారు.

కోత విధించిన జీతాన్ని ఇప్పించాలి


జేసీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న వైద్యశాఖ ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వైద్యశాఖ పరిధిలో పనిచేస్తున్న నేషనల్ హెల్త్‌మిషన్ ఉద్యోగులకు కోత విధించిన జీతాలను తిరిగి ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో జేఏసీ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు జేసీ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగావారు జేసీకి సమస్యలను వివరించారు. ఈ ఏడాది అక్టోబరులో ఉద్యోగుల జీతాల్లో కోత విధించారన్నారు.మరో వైపు ఎఫ్ఆర్ఎస్ లోపాలను సవరించకుండా ఇదే పద్ధతి అమలు చేస్తే ఉద్యోగులకు ఎవరికీ జీతాలు వచ్చే పరిస్థితి లేదన్నారు.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

ఒంగోలు(రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : రైతులు పొగాకుకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పొగాకు వేలం కేంద్రం 2 నిర్వహణాదికారి ఎం.సత్య శ్రీనివాస్ చెప్పారు. ఒంగోలు పొగాకు వేలం కేంద్రం 2లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రెజిల్, చైనా, జింబాంబ్వే దేశాలలో పొగాకు విస్తృతంగా సాగు చేశారన్నారు. ఈకార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ రాజశేఖర్, జీపీఐ మేనేజర్ ఉన్నం శ్రీను, రైతు నాయకులు వడ్డెళ్లప్రసాదు, వై.వెంకటశేషయ్య పాల్గొన్నారు.

అంకేపల్లి మాజీ సర్పంచ్ వెంకటనర్సింహారెడ్డి మృతి

నివాళులర్పించిన మారిటైం బోర్డ్ చైర్మన్ సత్య


పాలుగుండ్ల మృతదేహానికి నివాళులర్పిస్తున్న దామచర్ల సత్య

మర్రిపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు, అంకేపల్లి మాజీ సర్పంచ్ పాలుగుండ్ల వెంకటనర్సింహారెడ్డి(80) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం స్వగృహంలో కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అంకేపల్లికి చేరుకొని వెంకటనర్సింహారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతి టీడీపీకి తీరని లోటన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి వెంకటనర్సింహారెడ్డి అంకితభావంతో పనిచేశారన్నారు. ఒకవైపు ప్రాణాంతక వ్యాధితో బాధపడుతూనే సార్వత్రిక ఎన్నికల్లో మంత్రి స్వామి విజయం కోసం ఎండను సైతం లెక్కచేయకుండా ప్రచారం చేశారని కొనియాడారు. సత్య వెంట టీడీపీ నాయకులు యర్రమోతు శ్రీనివాసులు, రేగుల వీరనారాయణ, గొంటు హనుమారెడ్డి, మత్తుముల వెంకటేశ్వర్లు, రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

వృద్ధుడిని రక్షించిన పోలీసులు

కురిచేడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాలువలో కొట్టుకుపోతున్న ఓ వృద్ధుడిని కానిస్టేబుళ్లు రక్షించారు. ఈఘటన సోమవారం కురిచేడు పక్కనే ఉన్న దర్శి బ్రాంచి కాలువ వద్ద చోటుచేసుకుంది. కురిచేడుకు చెందిన 65ఏళ్ల వృద్ధుడు ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయాడు. స్థానికులు కేకలు వేయడంతో అదే దారిన దర్శికి వెళుతున్న కానిస్టేబుళ్లు విజయ్, ప్రసన్నలు వెంటనే ఇద్దరు యువకులను కాలువలోకి దింపి రక్షించారు.

నేర వార్తలు

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

టంగుటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిజేడుకు చెందిన చిన్నకత్తుల వల్లూరయ్య (38) మద్యం మత్తులో ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. వల్లూరయ్య కూలి పనులు చేస్తుంటాడు. ఆదివారం రాత్రి ఆయనకు రావాల్సిన డబ్బులు రూ.5వేలు వచ్చాయి. వాటితో పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్యప్రశ్నించడంతో ఆమెతో వాగ్వివాదానికి దిగాడు. అర్ధరాత్రి ఇంటికప్పునకు ఉన్న రాడ్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు వల్లూరయ్య భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

టంగుటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి జి.స్వర్ణలత సూచించారు. సోమవారం టంగుటూరు, వెలగపూడి పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఏటా పొగాకు సాగు చేస్తే భూసారం తగ్గడంతోపాటు తెగుళ్లు, పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. అందుకే రైతులు ప్రత్యామ్నాయంగా శనగ, మినుము సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, పంచాయతీ సభ్యుడు మక్కెన కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సంచాలకులు సిహెచ్.శ్రుతి, ఎం.లింగారావు, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతులు చిరుధాన్య పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలి

ఒంగోలురూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : రైతులు చిరు ధాన్యం పంటలు సాగు చేయాలని వ్యవసాయశాఖ ఏడీఏ రమేష్‌బాబు చెప్పారు. ఒంగోలు మండలం వలేటివారిపాలెం, చేజర్ల గ్రామాలలో సోమవారం రైతులతో సమావేశం జరిగింది. ఈకార్యక్రమంలో ఏవో కిషోర్‌బాబు, చేజర్ల సర్పంచ్ చాగంటి రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు

అగ్రహారం రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చొరవతో ఒంగోలులోని ఎన్. అగ్రహారం రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి జనరల్ మేనేజర్ అనుమతించారు. రైల్వే నిధులతో వంతెన నిర్మించాలని ఇటీవల విజయవాడలో జరిగిన రైల్వే శాఖ సమావేశంలో ఎంపీ మాగుంట ప్రస్తావించారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా ఇచ్చారు. ఆ బ్రిడ్జినిర్మాణానికి సంబంధించి అన్ని చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను జనరల్ మేనేజర్ ఆదేశించారని మాగుంట తెలిపారు.

వై పాలెంలో రైతు బజారు అందుబాటులోకి...

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : యర్రగొండపాలెంలోని మన రైతు బజారును పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు బజారులో నిర్మించి సిద్ధంగా ఉన్న 46 స్టాల్స్‌ను ఉచితంగా పండ్లు కూరగాయాలు పండించే రైతులకు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. క్యాంటిన్, కిరణా సరుకులు దుకాణాల నిర్వహించేందుకు ఐదు షాపులను అద్దె ప్రాతిపదికన కేటాయిస్తామని తెలిపారు.

మెడికల్ సర్టిఫికెట్లు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలి

ఒంగోలు నగరం, నవంబరు(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దివ్యాంగులు రిమ్స్ నుంచి మెడికల్ సర్టిఫికెట్ పొందేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ ఇబ్బందులు తొలగేలా తగిన చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి నాయకులు కోరారు. సోమవారం సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాలేషా ఆధ్వర్యంలో నాయకులు రిమ్స్ సూపరింటెండెంట్ జమునను కలిసి విజ్ఞప్తి చేశారు. సూపరింటెండెంట్‌ను కలిసిన వారిలో సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా, బాబ ణవత్, వెంకటేశ్వరరావు, అమీర్ హంజా, రాజు తదితరులు ఉన్నారు.

ఒంగోలు జేసీఐ చైర్మన్‌గా శ్రీరాములురెడ్డి


శ్రీరాములురెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జేసీఐ ఒంగోలు చైర్మన్‌గా శ్రీరామ్ హైస్కూలు కరస్పాండెంట్ వెన్నపూస శ్రీరాములురెడ్డి ఎన్నికయ్యారు. స్థానిక సత్యనారాయణపురంలోని ఆంధ్ర హైస్కూలులో సోమవారం జరిగిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఎన్నికైన శ్రీరాములురెడ్డిని జేసీఐ పూర్వ జాతీయ అధ్యక్షుడు నైనాల రామకృష్ణ, జేసీఐ జోన్ చైర్మన్ గోపీకిషోర్, రీజనల్ చైర్మన్ ఆత్మకూరు బ్రహ్మయ్య, ట్రెజరర్ నందకుమార్, విజేత రమణ, సోమినేని సురేష్, నామినేని మోహన్‌రావు, దాసరి కృష్ణారావు, శేఖర్‌బాబు, శ్రీనివాసరావు,ఆంధ్ర శ్రీనివాసరావు, అధ్యక్షుడు జేసీఎం సుబ్బారావు, బాలకృష్ణ, వరుణ్‌కుమార్‌లు అభినందించారు. శ్రీరాములురెడ్డి 2025 సంవత్సరానికి జేసీఐ చైర్మన్‌గా కొనసాగనున్నారు.

క్రైం సమాచారం

సోలార్ ప్యానళ్ల చోరీ

గిద్దలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని నరవ రోడ్డులో రైతులు ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానల్‌ను దొంగలు దోచుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి దొంగలు వ్యవసాయం కోసం ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానల్‌ను చోరీ చేశారు. వీటి విలువ రూ.20వేలు ఉంటుందని రైతు తెలిపాడు.

మద్యం సీసాల స్వాధీనం

కంభం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలంలోని తురిమెళ్ల గ్రామంలో మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తి వద్ద నుంచి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. ఎవరైనా అక్రమ మద్యం కలిగి ఉన్నా, తరలించినా, బెల్టుషాపులు నిర్వహిస్తున్నా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొండచిలువ కలకలం

గిద్దలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లుపల్లి సచివాలయ సమీపంలో కొండచిలువ కలకలం సృష్టించింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఫారెస్టు సిబ్బందికి సమాచారం అందించారు. వైల్డ్ లైఫ్ రెస్క్యూ టీమ్ సభ్యులు ప్రసాద్, శివ, అశోక్, కృష్ణ, బీట్‌ఆఫీసర్ నాగశేఖర్‌రెడ్డి తదితరులు సుమారు గంటపాటు శ్రమించి గడ్డివాములోకి వెళ్లిన కొండచిలువను పట్టుకుని సమీప అటవీప్రాంతంలో వదిలిపెట్టారు. దీంతో ఆప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఆక్రమణల తొలగింపులో ఉపాధి కోల్పోయిన వారిని ఆదుకోవాలి

● సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న వీధివిక్రేతలు

మార్కాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 7న ఆక్రమణలు తొలగించిన నేపథ్యంలో ఉపాధి కోల్పోయిన పూలు, అరటికాయలు అమ్మే తోపుడుబండ్లు, బంకులు, టీ కొట్లు, మెకానిక్ షాపుల బాధితులను ప్రత్యామ్నాయ మార్గం చూపి ఆదుకోవాలని స్ట్రీట్ వెండర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం వారు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు గాలి.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపుతో సుమారు 2 వేల మంది రోడ్డున పడ్డారన్నారు. వారిలో ఏ రోజుకు ఆరోజు పనిచేస్తేనే కడుపునిండేదన్నారు. అటువంటి వారిని ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా బంకులు, బండ్లు తొలగించి రోడ్డున పడేశారన్నారు. సుమారు రూ.10 కోట్ల మేర వీధుల్లో చిరువ్యాపారులు చేసుకునే వాళ్ల నష్టపోయారన్నారు. వారి జీవనో పాధికి ప్రత్యామ్నాయం చూపకుంటే ప్రత్యక్ష ఆందోళనకు వెనుకాడేదిలేదని అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతపత్రాన్ని సబ్ కలెక్టర్ వెంకట్‌త్రివినాగ్‌కు అందజేశారు. కార్యక్రమంలో చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

పుట్టినరోజు నమోదు తేడాలతో అవస్థలు

పెద్దారవీడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డులో విద్యార్థుల పుట్టినరోజు నమోదులో తేడాలతో అపార్, సాంప్ నమోదులో జాప్యం జరుగుతుందని ఎంఈవో ఎస్.వీ.సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని వై.డి.పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అపార్, సాంప్ నమోదుపై సమీక్షించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్‌డీ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి అపార్ జనరేట్ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మార్కాపురంలో నాగశిలలకు పాలుపోస్తున్న మహిళలు, కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, మార్కండేశ్వరుడు, రావిపాడులో భీమేశ్వరుడికి పూజలు, తర్లుపాడులో శివయ్యకు విశేష అలంకరణ

వైభవంగా కార్తీక సోమవారం

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 11 ఆంధ్రజ్యోతి: కార్తీక సోమవారం పురస్కరించుకుని పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు ఏలూరి ఆంజనేయశర్మ, వరుణ్ తేజ శర్మలు జగదాంబ, మార్కండేశ్వరస్వాములకు అభిషేకాలు, అర్చనలు, అలంకరణ నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామున 3 గంటల నుంచే దర్శనానికి బారులు తీరారు. ఆలయంలోని నాగశిలలకు పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

● కంభం : కార్తీక సోమవారం సందర్భంగా అర్ధవీడు, కంభం మండలాలు శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కంభం మండలంలోని రావిపాడులోని భీమేశ్వరాలయం, తురిమెళ్ళలోని కనక సురభేశ్వరాలయం, కంభంలోని కోటేశ్వరాలయం, చిన్నకంభంలోని వీరభద్రస్వామి ఆలయం, కంభం పట్టణంలోని శివాలయం, అర్ధవీడు మండలంలోని మొహిద్దీన్‌పురం, యాచవరం శివాలయాలలో అభిషేకాలు, పూజలు, కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో భక్తులు ఆధ్యాత్మిక భావనలో నిండిపోయారు. కార్తీక మాసం 2వ సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు దేవాలయాల్లో బారులు తీరారు.

● గిద్దలూరు : కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పాతాళ నాగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం తెల్లవారుజాము నుంచే మహిళలు కార్తీక దీపాలు వెలిగించి సామూహిక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు చేశారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ ఆధ్వర్యంలో శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గంగమ్మ, గౌరమ్మలకు మహిళలు కుంకుమార్చన చేశారు. కే.ఎస్.పల్లె సమీపంలోని భీమాలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలలో శివాలయాలలో సైతం కార్తీక సోమవారం సందర్భంగా పూజలు నిర్వహించారు.

● తర్లుపాడు : తర్లుపాడులో వెలసియున్న సహస్ర లింగేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా కార్తీక సోమవారం పూజలు నిర్వహించారు. అర్చకులు దేవులపల్లి శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తెల్లవారుజామున కార్తీకదీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త నేరెళ్ల కుమార్ భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు



మాట్లాడుతున్న ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికగా ప్రజాదర్బార్ నిర్వహిస్తునట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని డా.బి.ఆర్.అంబేద్కర్ ఆడిటోరియంలో ఎంపీడీవో బి.శ్రీనివాసులు ఆధ్యక్షతన ప్రజదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎరిక్షన్‌బాబు హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం నిలబెడుతుందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు, రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గ ప్రజలు తనను ఆదరించారని వారి సమస్యలను పరిష్కరించేందుకే ఎన్నడూ లేనివిధంగా ప్రజదర్బార్ వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉంటారన్నారు. ఇక్కడ వచ్చే సమస్యలను నెల రోజుల వ్యవధిలో పరిష్కరిస్తామన్నారు. అధికారులు ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయి సమస్యలు కూడా పరిష్కరించేందుకు తాను ఎప్పుడు ముందుంటానని అన్నారు. నియోజవర్గంలో ఎక్కువగా భూ సమస్యలు, నీటి సమస్య, రోడ్ల సమస్యలు ఉన్నాయని తన దృష్టికి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే రూ.15 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అలాగే 135 మందికి రాయితీపై గోకులం షెడ్డులు మంజూరయ్యాయన్నారు. త్వరలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాయితీల ద్వారా పథకాలు వస్తాయని అన్నారు. ఇటీవల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు అధికారులతో కలసి వెలిగొండ ప్రాజెక్టు పరిశీలించి అక్కడ జరుగుతున్న పనుల నివేదికను రాష్ట్ర ముఖమంత్రి చంద్రబాబు దృష్టికి మంత్రులు తీసుకెళ్లినట్లు తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్‌లో వెలుగొండ ప్రాజెక్టు నిధులు కేటాయించి పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. **కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, కాశికుంట తాండ సర్పంచ్ ఎంసీహెచ్ మంత్రునాయక్, మాజీ సర్పంచ్ కంచర్ల సత్యనారాయణగౌడ్, పట్టణ అధ్యక్షుడు షేక్.మస్తాన్, డీటీ మల్లికార్జుననాయుడు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.** ఎర్రగొండపాలెం మండలంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వివిధ సమస్యలపై ప్రజలు 201 అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తజనం



శ్రీశైలానికి తరలివెళ్తున్న భక్తులు

పెద్దదోర్నాల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : శివకేశవులకు ప్రీతికరమైన కార్తీకమాసంలో శ్రీశైల భ్రమరాంబమల్లికార్జునస్వామి దర్శనానికి వెళ్లేందుకు భక్తులు సోమవారం దోర్నాలలో పోటెత్తారు. మాసాలన్నింటిలో కార్తీక మాసానికి అత్యంత విశిష్టత ఉందన్నారు. ఈ మాసంలో పూజలు ప్రత్యేకమని హిందువులు విశ్వశిస్తారు. ఈ నేపథ్యంలో నల్లమలలో కొలువైన పార్వతీ పరమేశ్వరుల దర్శనం కోసం దేశం నలుమూల ల నుంచి భక్తులు దోర్నాల వస్తారు. దీంతో రద్దీ ఏర్పడింది. భక్తుల సౌకర్యార్థం ఆర్‌టీసీ శాఖ ప్రత్యేకంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినా భక్తులు తమ సమయాభావంతో ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ శ్రీశైలానికి తరలి వెళ్తున్నారు. కార్తీకమాసం సందర్భంగా స్థానికంగా నటరాజ్ కూడలిలో, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయం, శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం, పట్టాభి సీతారామ స్వామి దేవాలయంలో కార్తీక దీపా లను వెలిగించి భక్తులు తమ భక్తి చాటుకున్నారు.

ప్రమాద బాధితుడికి పరామర్శ

పుల్లలచెరువు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):గత నెలలో రోడ్డు ప్రమాదంలో గాయపడి టీడీపీ సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం పొంది కొలుకోని ఇంటికి వచ్చి కార్యకర్త వేముల నాగరాజును వైపాలెం టీడీపీ ఇన్‌చార్జీ గుడూరి ఎరిక్షన్‌బాబు స్థానిక నాయకులతో కలిసి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నిర్ణయం మేరకు మంత్రి లోకేష్ కృషితో నాగరాజు చికిత్సకు అవసరమైన నిదులను అందించిందని అన్నారు. కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఇన్‌చార్జ్ ఎరిక్షన్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ నాయకులు కాకర్ల కోటయ్య, టీడీపీ నాయకులు వున్నారు.

మన్నే రవీంద్ర ఆర్థిక సాయం

పుల్లలచెరువు : కోమరోలులో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టరు మన్నె రవీంద్ర రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. సోమవారం పుల్లలచెరువు మండలం కోమరోలులో పిడికిటి వీరయ్య కుటుంబాన్ని పరామర్శించి ఇంటిని పరిశీలించారు. ఆయన వెంట కోమరోలు సర్పంచి కోల్లిపాటి శ్రీనివాసరావు, రమణయ్య గ్రామస్థులు వున్నారు.

రైతుబజారులో దుకాణాల కోసం దరఖాస్తుల స్వీకరణ

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు) నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం పట్టణంలోని పుల్లలచెరువు రోడ్డులోని మన రైతుబజారులో దుకాణాలు నిర్వహించుకోనేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. త్వరలోనే మన రైతు బజారు వినియోగంలోనికి రానుందన్నారు. మండల పరిధిలోని రైతులు పండ్లు, కూరగాయాలు అమ్ముకోనేందుకు 46 దుకాణాలను వారికి కేటాయించామన్నారు. వీటితో పాటు క్యాంటీన్, నిత్యవసర సరుకులు అమ్ముకోనేందుకు షెట్టర్ కలిగిన దుకాణాలు ఐదు నిర్వహించుకోవడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు వీటిని అద్దె ప్రాతిపదికన తీసుకొని వినియోగించుకోవచ్చున్నారు. ఆసక్తి గల వారు 9182361410, 9182361412 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా అబుల్‌కలాం ఆజాద్ జయంతి



తర్లుపాడులో ఆజాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆదర్శనీయుడని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక పాఠశాలలో ఆజాద్ 137వ జయంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు సమీవుల్లా ఆజాద్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు.

తర్లుపాడు : మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీలోని లింగారెడ్డి కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కె.మౌలాలి మాట్లాడుతూ.. భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి సుదీర్ఘకాలంగా పనిచేసి విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఈయన మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడిచారని విద్యార్థి దశ నుంచి అనేక సాదకబాదలు పడి విద్యలో ఉన్నత స్థాయికి ఎదిగి దేశానికి దిక్సూచిగా నిలిచాడన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అల్లాభక్షు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిద్దలూరు : స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు జేవీవీ రాష్ట్ర నాయకులు పి.స్వరూపారెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యకు ఊపిరి పోసిన మహనీయుడు ఆజాద్ అని పేర్కొన్నారు.

పెద్ద దోర్నాల : అబుల్‌కలాం ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకుని యువత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రదానోపాధ్యాయులు మాండ్ల శ్రీనివాసులు అన్నారు. మండలంలోని చిన్నదోర్నాలలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ విద్యాదినోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సుబ్బారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తాటిపర్తి చంద్రశేఖర్

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 11, (ఆంధ్రజ్యోతి) వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్‌ను పార్టీ అదిష్టానం నియమించింది. సోమవారం ఆ పార్టీ అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చంద్రశేఖర్‌కు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖర్ అధినాయకుడు జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు చంద్రశేఖరకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ పూజారికి ఘన సన్మానం

● బ్రాహ్మణరత్న బిరుదు ప్రదానం



ప్రసాదశర్మ దంపతులను సన్మానిస్తున్న బ్రాహ్మణ సంక్షేమ వేదిక ప్రతినిధులు

త్రిపురాంతకం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీబాలాత్రిపుర సుందరీ దేవి అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు దూపాటి పాలంక ప్రసాదశర్మను హైదరాబాదులో బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆద్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ ఎల్‌బీ.నగర్‌లోని సువర్ణ భారతి గోశాలలో జరిగిన కార్యక్రమం సందర్భంగా ప్రసాదశర్మ దంపతులను సన్మానించి, బ్రాహ్మణ రత్నబిరుదును ప్రదానం చేశారు. ఆలయంలో వేదపఠనం, నిర్వహణ, గోసంరక్షణ వంటి కార్యక్రమాలలో విశేష సేవలు చేసినందుకు గుర్తింపుగా సన్మానించి, బిరుదును ప్రదానం చేశారు.

వాసవీ విద్యానికేతన్ విద్యార్థికి బంగారు పతకం



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవి విద్యానికేతన్‌లో 8వ తరగతి చదువుతున్న వరుణ్ సౌత్‌జోన్ సిలంబమ్(కర్రసాము) ఛాంపియన్‌షిప్-2024లో బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం వరుణ్‌ను సన్మానించారు. ప్రిన్సిపాల్, డైరెక్టర్ కందెపు రంగయ్య మాట్లాడుతూ.. గుంటూరులో జరిగిన ఈ పోటీలు ఏపీ సిలంబమ్ అసోసియేషన్ వారు నిర్వహించారని ప్రకాశం జిల్లా నుంచి వరుణ్ పాల్గొని బంగారు పతకం సాధించాడన్నారు. ఇటువంటి కళలు కనుమరుగు కాకుండా నేర్చుకుని పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. ఏవో రంజిత్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ బాధితులకు ఉపకరణాల అందజేత



ఫ్లోరైడ్ బాధితులకు పరికారాలు అందజేస్తున్న వైద్యాధికారులు

పొదిలి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం గ్రామంలోని ఫ్లోరైడ్ బాధితులను ఉప్పలపాడు వైద్యాధికారి శరత్‌చంద్ర సందర్శించి అవసరమైన ఉపకరణాలు అందజేశారు. చేతికర్రలు, వీల్‌చైర్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్లోరైడ్ నివారణకు సి.విటమిన్ ఉండే ఆహారం ఎక్కువగా తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఆరోగ్యకరమైన ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన ఉపకరణాలు అందజేసినందుకు జిల్లా ఫ్లోరోసిస్ అధికారి అనిల్‌కుమార్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. గ్రామంలో మొత్తం 60 మందికి వివిధ రకాల పరికారాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో చౌడేశ్వరి, సూపర్‌వైజర్ మేరీనా, ఏఎన్ఎం మాధవి, ఆశాలు శ్యామల, జీవిత, నందిని, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

నిమ్మలో ఎండు పుల్లలు తీయకపోవడంతో చీడపీడలు



నిమ్మచెట్లను పరిశీలిస్తున్న ఉద్యాన ధికారి సంధ్య

పొదిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిమ్మలో ఎండు పుల్లలు తీయక పోవడంతో చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయని ఉద్యాన అధికారి సంధ్య అన్నారు. సోమవారం మండలంలోని కంభాలపాడు గ్రామంలో నిమ్మతోటలను పరిశీలించారు. చెట్లలో తప్పనిసరిగా ఎండుపుల్లను తీసివేయాల న్నారు. అక్టోబరులో అడ్డ దిడ్డంగా ఉన్న కొమ్మలను కత్తిరించాలన్నారు. తద్వారా తెగుళ్ల ఎక్కువగా ఆశించకుండా ఉంటాయన్నారు. చెట్టుతడిసే విధంగా బోర్డ్ మిశ్రమాన్ని పిచికారి చేసుకోవాలన్నారు. పాదులు గట్టిపడకుండా తేలికపాటి సేద్యం చేసుకోవడం మంచిదన్నారు. నిమ్మతోటల్లో ఆకుముడత, మంగు తెగుళ్లను గమనించామన్నారు. దీని నివారణకు వేపనూనె పిచికారి చేయాలని సూచించారు. తెగుళ్ల అధికంగా ఉన్నట్లైతే ప్రొఫినోఫాస్ లేదా ఇమిడాక్లోరైడ్ పిచికారి చేయాలన్నారు. మంగు, ఆకుమచ్చ, మంగునల్లి ఆశించడం వలన కాయ చిన్నదిగాను, ముదురు గోదుమరంగు మచ్చలు ఏర్పడుతాయన్నారు. కనుక రోజు పరిశీలిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నిత్య అన్నదానం ప్రారంభం

గిద్దలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో ఇంచుమించు రెండు నెలలపాటు సాగే నిత్య అన్నదాన కార్యక్రమాన్ని కటకం ట్రస్టు చైర్మన్ కటకం నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ రెండు నెలలపాటు మధ్యాహ్నం, రాత్రి వేళల్లో మాలదారులకు చద్ది, భిక్ష అందిస్తామన్నారు. అన్ని దేవతామూర్తుల మాలలు ధరించిన వారందరూ హాజరుకావచ్చని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ ప్రతినిధులు కమతం శ్రీనివాసులు, బాదం రమేష్, చిన్నపాండు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి ప్రత్యేక అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సంజీవరావు


సంజీవరావు

తాళ్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా కె.సంజీవరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కె.నాగలక్ష్మిని ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న కె.సంజీవరావును తాళ్లూరుకు బదిలీ అయ్యారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న నాగలక్ష్మి ఈ నెల 4న రిలీవై వెళ్లారు. దీంతో గత వారం రోజులుగా తహసీల్దార్ లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కాగా, తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సంజీవరావు మాట్లాడుతూ ప్రాధాన్యతాక్రమంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. రెవెన్యూ సంబంధ సమస్యలు ఉంటే కార్యాలయానికి వచ్చి పనులు చేయించుకోవాన్నారు. కార్యాలయ సిబ్బంది తహసీల్దార్‌కు బొకే అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేల్ రాజు, జూనియర్ అసిస్టెంట్ రియాజ్, వీఆర్వోలు పి.చంద్రశేఖర్‌రావు, షేక్ నాగూర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సిమెంట్ రోడ్ల నిర్మాణాలు

దొనకొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ముమ్మరంగా సిమెంట్ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు అన్నారు. దొనకొండలోని ఒబ్బాపురం ఎస్సీ కాలనీలో టీడీపీ నాయకులు కొమ్మతోటి సుబ్బారావు, కుందుర్తి లక్ష్మణ్ ఆధ్వర్యంలో చేపట్టే సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా శివకోటేశ్వరరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల గురించి పట్టించుకోకపోవడంతో దారుణంగా తయారయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మోడి వెంకటేశ్వర్లు, శృంగారపు నాగసుబ్బారెడ్డి, కె.సుబ్బారావు, కె.లక్ష్మణ్, షేక్ తోహీద్, పోతిపోగు చెన్నయ్య, అంకాల మల్లికార్జున, మోడి పెద్దఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు


ఎరువుల షాప్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ

దొనకొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్స్‌ల రద్దుకు సిఫార్స్ చేస్తామని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ హెచ్చరించారు. దొనకొండలోని ఎరువుల షాపులను సోమవారం అకస్మిక తనిఖీ చేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకొని అధిక ధరలకు ఎరువులు అమ్మరాదన్నారు. రైతు కొనుగోలు చేసిన వాటికి రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. నకిలీ ఎరువులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి జి.యోగేశ్వరరావు, గ్రామ రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణస్వామి దేవస్థాన ఆదాయం రూ.లక్షా 60 వేలు

సీఎస్‌పురం(పామూరు) నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం భక్తులు వివిధ కానుకల రూపంలో రూ.1,59,598 ఇచ్చారని ఈవో శ్రీగిరి నరసింహాబాబు తెలిపారు.

టిక్కెట్ల అమ్మకాలద్వారా రూ.87,710, లడ్డూ అమ్మకంద్వారా రూ.37,890, శాశ్వత అన్నదాన పథకానికి రూ.11,882, మహాప్రాకార నిర్మాణానికి రూ. 10,116, ఇతర విరాళాల ద్వారా రూ.1 2వేలు వచ్చాయని తెలిపారు.

అధ్వానంగా 'పల్లెవనం' నిర్వహణ

- సాయంత్రం పూట తెరచుకోని గేట్లు
- రెండేళ్లుగా జీతాలు లేక సిబ్బంది అవస్థలు
- ప్రజలకు ఆహ్లాదం కరువు

దర్శి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రజల ఆహ్లాదం కోసం ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ పల్లెవనం పార్క్ నిర్వాహణ అధ్వానంగా మారింది. సిబ్బందికి గత రెండు సంవత్సరాలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆకతాయిలు పార్క్‌లోని ఆట వస్తువులు, పరికరాలను విరగకొట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్టీఆర్ పల్లెవనం పార్క్ అభివృద్ధికి కేటాయించిన నిధులు దుర్వినియోగమయ్యాయి. నిధులు గోల్‌మాల్ విషయం బయట పడటంతో అటవీశాఖ అధికారులు తూతూమంత్రంగా పనులు చేశారు. నాసిరకం పరికరాలు ఏర్పాటుచేశారు. దీంతో పార్క్‌లో ఏడాది క్రితం ఏర్పాటుచేసిన టాయిలెట్స్ అప్పుడే విరిగిపోయాయి మరికొంత సామగ్రి కూడా దెబ్బతింది. ఆకతాయిలు అనేక ఆట వస్తువులను విరగకొట్టారు. చిన్నారులు ఆడుకునే ఊయల, మరికొన్ని వస్తువులను ఉద్దేశపూర్వకంగా పగులకొట్టారు. రెండేళ్లుగా సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవటంతో ఏమి చేయాలో పాలుపోక అల్లాడుతున్నారు. నిర్వాహణ చేయలేక సాయంత్రం పూట పార్క్‌ను తెరవటం లేదు. ఉదయం పూట కేవలం వాకర్స్‌కు మాత్రమే అనుమతిస్తున్నారు.

దర్శి పట్టణ ప్రజల ఆహ్లాదం కోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్వాంగ సుందరంగా నిర్మించిన పార్క్ గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో అస్తవ్యస్తంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అటవీ సిబ్బందిలో ఆశలు చిగురించాయి. త్వరలో పెండింగ్ జీతాలు ఇస్తారనే నమ్మకంతో కొనసాగుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సమస్యను గుర్తించి సిబ్బందికి జీతాలు మంజూరు చేయాలని కోరుతున్నారు. పార్క్ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు పరికరాలను విరగొట్టిన ఆకతాయిలపై గత ప్రభుత్వం హయాంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. పరికరాలు ధ్వంసం చేసిన వారిని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


దర్శిలోని ఎన్టీఆర్ పల్లెవనం పార్క్


విరిగిపోయిన ఊయల

ఆయుర్వేదం.. ఆమడదూరం

- డిప్యుటేషన్‌పై వెళ్లిన వైద్యుడు, సిబ్బంది
- ఏడాది నుంచి మూత
- ఇబ్బందులు పడుతున్న రోగులు

పామూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యం అందుబాటులో లేక గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అందుబాటులో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ఏడాదికాలంగా మూతపడింది. మండలంలో పామూరు మేజర్ పంచాయతీ తరువాత అతిపెద్ద గ్రామ పంచాయతీ అయిన కంభాలదిన్నె గ్రామంలో సుమారు 50 సంవత్సరాల క్రితం ఆయుర్వేద వైద్యశాలను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అప్పటినుంచి కంభాలదిన్నె, రేణిమడుగు, అక్కంపేట, రజాసాహెబ్‌పేట తదితర గ్రామాల్లోని ప్రజలు ఆయుర్వేద వైద్యసేవలు పొందుతున్నారు. ఏడాది క్రితం డాక్టర్ గద్దె ఏడుకొండలు, కాంపౌండర్ డిప్యుటేషన్‌పై మరో వైద్యశాలకు వెళ్లారు. దీంతో రెగ్యులర్ డాక్టర్, సిబ్బంది లేక వైద్యశాల మూతపడింది. విషయం తెలియని రోగులు వైద్యశాలకు రావడం, ఇరుగుపొరుగు వారిని అడిగి సమాచారం తెలుసుకొని ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు.

గతంలో వైద్యశాలకు రోజుకు 50 నుంచి 60 మంది రోగులు వచ్చి ఉచితంగా వైద్యసేవలు పొందేవారు. ఈ వైద్యశాలను గత ప్రభుత్వాలు నిర్లక్షం చేశాయి. దీంతో భవనం శిథిలావస్థకు చేరింది. ఈక్రమంలో ఇక్కడ పనిచేస్తున్న రెగ్యులర్ డాక్టర్‌ను మరోచోటికి డిప్యుటేషన్ వేశారు. ఏడాది కావస్తున్న మరో డాక్టర్‌ను నియమించకపోవడంతో రోగులకు వైద్యసేవలు అందడంలేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వైద్యులు, సిబ్బందిని నియమించి గ్రామీణప్రాంత ప్రజలకు ఆయుర్వేద వైద్య సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



కంభాలదిన్నెలో మూత పడిన ఆయుర్వేద వైద్యశాల

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- సీపీఎం నేత కేశవరావు డిమాండ్

కనిగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో సోమవారం జరిగిన జరిగిన సమావేశంలో ఆపార్టీ పట్టణ కార్యదర్శిగా కేశవరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కనిగిరి ప్రజల సమస్యల పరిష్కరిస్తామని ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలన్నారు. కనిగిరిలో ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని అందించాలన్నారు. కనిగిరి పెద్దచెరువు, నాగులచెరువులను సమ్మర్ స్టోరేజీ ట్యాంకులుగా నిర్మించాలన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూముల్లో వేసిన వెంచర్లు, అనుమతులు లేని లేఅవుట్లు, వాగులు అక్రమణపై సిట్‌ను వేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక అందించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. వెలిగొండ ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేసి కనిగిరి ప్రాంతానికి కూడా తాగు, సాగునీటిని అందించాలన్నారు. హామీల అమలుపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వై.కొండలరావు, బషీరా, శాంతకుమారి, ఏడుకొండలు, పిచ్చయ్య, నరేంద్ర, శ్రీనివాసులు, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశవరావు

బెల్టు షాపుపై పోలీసుల దాడి

హనుమంతునిపాడు (కనిగిరి), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బెల్టు షాపుపై సోమవారం రాత్రి ఎస్ఐ మాధవరావు సిబ్బందితో కలసి ఆకస్మిక దాడి చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమంతునిపాడు మండలం నందనవనం గ్రామంలో కొవూరి శంకర్ అనే వ్యక్తి బెల్టు షాపు నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేయగా అతని వద్ద 12 మద్యం బీరు బాటిళ్ళు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుచనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎస్ఐ మాధవరావు మాట్లాడుతూ బెల్టు షాపులు నిర్వహిస్తుంటే ప్రజలు తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పూజలు

పీసీపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని పెదయిర్లపాడు మల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పుణ్యస్నానాలు ఆచరించిన మహిళలు వేకువజామునే ఆలయానికి చేరుకున్నారు. మల్లేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఈసందర్భంగా అర్చకులు పలుకూరి సుబ్బారావు స్వామివారికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, పల్లకిసేవలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


ఆలయ ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రతిభచాటిన కేవీపల్లి విద్యార్థులు

కనిగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో సోమవారం పదో తరగతి, ఐదో తరగతి విద్యార్థులకు నియోజకర్గస్థాయి ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈపరీక్షలకు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని హైస్కూల్స్‌కు చెందిన 144 మంది విద్యార్థులు హాజరయ్యారు. కేవీపల్లి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న అక్కి నందిని ప్రథమ బహుమతి సాధించింది. కనిగిరి ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన ఎం.ఆనంద్ రెండవ బహుమతి, వెలిగండ్ల హైస్కూల్‌కు చెందిన ఆర్.కాశిజాహ్నవి, కె.అనూ, పాతపాడు హైస్కూల్‌కు చెందిన కె.ఓబుల్‌చందు తృతీయ బహుమతులు పొందారు.

ఐదో తరగతి విద్యార్థులకు జరిగిన ప్రతిభా పరీక్షలో కేవీపల్లి హైస్కూల్‌కు చెందిన కొట్టే హిమబిందు ప్రథమ బహుమతి, పాతూరు పాఠశాలకు చెందిన ఎస్.సుఫియా ద్వితీయ బహుమతి, చాకిరాల స్కూల్‌కు చెందిన ఎల్.ప్రజ్ఞ తృతీయ బహుమతి సాధించారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఎంఈవో ఉడుముల నారాయణరెడ్డి బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో కేవీపల్లి హైస్కూల్ హెచ్ఎం విజయభాస్కర్ రెడ్డి, వివిధ పాఠశాలలకు చెందిన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రశ్నపత్రాలను విడుదలచేస్తున్న ఎంఈవో నారాయణరెడ్డి

మౌలానా అబుల్ కలాం సేవలు చిరస్మరణీయం

పామూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తొలి విద్యాశాఖ మంత్రిగా సాహిత్యం, విద్యా వికాశానికి కృషి చేసిన భారతరత్న మౌలానా అబుల్ కలాం సేవలు చిరస్మరణీయమని ప్రధానోపాధ్యాయుడు షేక్ మహబూబ్‌బాషా అన్నారు. మండలంలోని నర్రమారెళ్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురష్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోట రమేష్, బి.కోటేశ్వరరావు, టి.వెంకటేశ్వరరావు, సుజాత పాల్గొన్నారు. స్థానిక స్వయంకృషి సేవా సంస్థ కార్యాలయంలో అబుల్ కలాం చిత్ర పటానికి టీడీపీ, జనసేన శ్రేణులు పూలమాలలువేసి నివాళు లర్పించారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్ఆర్ రఫి, షేక్ హాజీగౌస్, పత్తు మస్తాన్, చాంద్‌బాషా, మాచర్ల రహమాన్, వై.అస్లీం, సలాం ఖాజామోహిద్దీన్, జనసేన నాయకులు వై.రహీముల్లా, షేక్ సందానిబాషా తదితరులు పాల్గొన్నారు.


కలాం చిత్ర పటానికి నివాలర్పిస్తున్న టీడీపీ, జనసేన శ్రేణులు

దొనకొండలో..

దొనకొండ: మొదటి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎనలేని సేవలు చేశారని స్థానిక ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.ప్రభుదాస్ అన్నారు. సోమవారం ఆయన జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువుల షెడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

వెలిగండ్ల, నవంబరు 11: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న పశువుల షెడ్లు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ఎంపీడీవో అన్నమ్మ అన్నారు. మండలంలోని గన్నవరం పంచాయతీలో నిర్మిస్తున్న పశువుల షెడ్డను సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో రైతులకు రాయితీపై 30 షెడ్లు మంజూరుచేసినట్టు చెప్పారు. 17 షెడ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

కనిగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గార్లపేట రోడ్డులో ఉన్న మోడల్‌స్కూల్ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ మోహన్ కోరారు. ఈమేరకు సోమవారం ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డికి గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందచేశారు. ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు స్టడీ అవర్స్ ఉంటున్నాయని తెలిపారు. ఆతర్వాత కనిగిరికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈవిషయంపై ఆర్టీసీ డీఎంకు అర్జీ ఇచ్చినా ఫలితం రాలేదన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని మోడల్‌స్కూల్ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

గర్భిణులకు భోజన సదుపాయం

కురిచేడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 300 మంది గర్భిణులకు లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు. ప్రతినెలా గర్భిణులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ వైద్య పరీక్షలకు మండలంలోని అనేక గ్రామాల నుంచి గర్భిణులు వస్తుంటారు. గత రెండున్నర సంవత్సరాలుగా మధ్యాహ్న సమయంలో వీరికి లయన్స్ క్లబ్ భోజన సదుపాయం కల్పిస్తుంది. ఈక్రమంలో సోమవారం వారికి భోజనం పెట్టారు. లయన్స్ క్లబ్ సభ్యులు జేబీ రామారావు, వీవీ రమణారావు, దేవతి నాగేంద్రబాబు ఆర్థిక సహకారం చేశారు.

ఏఐఎస్‌టీఈయూ జిల్లా ప్రధానకార్యదర్శిగా నాగేశ్వరరావు


నాగేశ్వరరావు

కనిగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్‌టీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శిగా కనిగిరి ప్రాంతానికి చెందిన జగన్నాధం నాగేశ్వరరావు ఎంపికయ్యారు. ఆదివారం అమరావతిలో జరిగిన రాష్ట్రస్థాయి యూనియన్ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు ఆయనను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. ఎంపికైన నాగేశ్వరరావు వెలిగండ్ల మండలంలోని పెరుగుపల్లి గ్రామవాసి కాగా, ఆదే మండలంలో బొంతగుంట్లపల్లిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తన ఎంపికకు సిఫార్సు చేసిన రాష్ట్ర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధికి చిరునామా రహదారులు

పామూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి చిరునామా రహదారులని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక పువ్వాడి నగర్ ప్రాంతంలో సుమారు రూ.80 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను పువ్వాడి కుటుంబసభ్యులు సోమవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన రూ.5 కోట్ల ఉపాధి హామీ నిధులలో భాగంగా పువ్వాడి నగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరు చేసినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు.

కార్యక్రమంలో నాయకులు ఏలూరి వెంకటేశ్వర్లు, పువ్వాడి తిరుపతమ్మ, సయ్యద్ అమీర్‌బాబు, వీరభద్రాపురం సర్పంచ్ పువ్వాడి జయమ్మ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

కాలువలో కొట్టుకుపోతున్న వృద్ధుడిని రక్షించిన పోలీసులు

కురిచేడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాలువలో కొట్టుకుపోతున్న ఓ వృద్ధుడిని కురిచేడు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్ళు రక్షించారు. ఈఘటన సోమవారం సాయంత్రం కురిచేడు పక్కనే ఉన్న దర్శి బ్రాంచ్ కాలువ వద్ద చోటు చేసుకుంది. కురిచేడుకు చెందిన 65 సంవత్సరాల వృద్ధుడు మంచినీరు తాగేందుకు కాలువ వద్దకు వెళ్ళాడు. ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడిపోయాడు. అక్కడే ఉన్న స్థానికులు పెద్దగా కేకలు వేయడంతో అదే దారిన దర్శికి వెళుతున్న కానిస్టేబుళ్ళు విజయ్, ప్రసన్నలు వెంటనే ఇద్దరు యువకులను కాలువలోకి దింపి రక్షించారు. ఎస్ఐ శివ తమ సిబ్బందిని అభినందించారు.

సచివాలయ ఉద్యోగులకు మెమోలు

పీసీపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సమయపాలన పాటించకుండా విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతో పలువురు సచివాలయం ఉద్యోగులకు సోమవారం ఎంపీడీవో ప్రభాకరశర్మ మెమోలు జారీచేశారు. లక్ష్మక్కపల్లి సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు మధ్యాహ్నం తరువాత అందుబాటులో లేరని ఎంపీడీవోకు ఫిర్యాదు అందింది. అలాగే పీసీపల్లి సచివాలయం ఉదయం 10.30గంటలకు కూడా తలుపులు తెరవలేదని ఎంపీడీవో పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయా సచివాలయాల్లో పనిచేస్తున్న ఆరుగురు ఉద్యోగులకు ఎంపీడీవో మెమోలు జారీచేశారు.





అమరావతికి అందలం





అమరావతికి అందలం.. సంక్షేమానికి జవసత్వాలు.. వివిధ పథకాలకు పూర్వ వైభవం.. పడకేసిన సాగునీటి ప్రాజెక్టులకు పునరుజ్జీవం.. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన ప్రతి రంగాన్ని గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వం సోమవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. వివిధ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుతో పాటు ఆయా రంగాలపై బడ్జెట్‌లో ప్రత్యేకంగా ప్రాధాన్యం ఇవ్వడంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమరావతికి బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు జరగడంతో ఇక అభివృద్ధి పనులు పరుగులు తీయనున్నాయి. గత పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన సాగునీటి రంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఈ క్రమంలో కృష్ణా డెల్టా, పులిచింతలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. అదేవిధంగా భారీ వర్షాలతో తెగిపోయి రైతులను నిండా ముంచేస్తోన్న సాగునీటి కాల్వల బాగుకు కూడా నిధులు కేటాయింపులు జరిగాయి. ఇక విద్యా పరంగా స్కిల్ డెవలప్ మెంట్, విదేశీ విద్య కోసం గతంలో అమలు చేసిన అంబేడ్కర్ విదేశీ విద్యోన్నతి పథకం పునరుద్ధరణతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- రాష్ట్ర బడ్జెట్లో భారీగా కేటాయింపులు
- సంక్షేమానికి జవసత్వాలు.. పథకాలకు పూర్వవైభవం
- రాజధాని అభివృద్ధి ప్రాజెక్టులకు రూ.4 వేల కోట్లకు పైగా
- మెట్రో రైలుకు రూ.50 కోట్లు, హైకోర్టు భవనాలకి రూ.13.3 కోట్లు
- కృష్ణా డెల్టాకు రూ.138.76 కోట్లు.. భూసేకరణకు మరో రూ.50 కోట్లు
- పులిచింతల నిర్వహణకు రూ.29.45 కోట్లు.. గుండ్లకమ్మకు రూ.13 కోట్లు కేటాయింపు



సేతు బంధన్ కింద రూ.115.2 కోట్లు

కేంద్ర ప్రభుత్వ పథకమైన సేతబంధన్ కింద చేపట్టబోతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జీల నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.115.2 కోట్లను చూపించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాల్లో ఆర్‌వోబీలు మంజూరైనప్పటికీ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో గుంటూరులోని శంకర్‌విలాస్ ఆర్‌వోబీ విస్తరణకు వేగవంతంగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర బడ్జెట్‌లో సేతుబంధన్ కింద కేటాయించిన రూ.115.2 కోట్లలో సింహభాగం నిధులు శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి వస్తాయని అధికారులు చెబుతున్నారు.

గుంటూరు, బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా పడకేసిన రాజధాని అమరావతి అభివృద్ధితో పాటు నిర్వీర్యమైన వివిధ రంగాలు, ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రత్యేకంగా దృష్టి సారించింది. సోమవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో కూడా ఆయా అంశాలకు ప్రత్యేకంగా ప్రాధాన్యం ఇచ్చారు. ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరం మరో నాలుగు నెలల 20 రోజుల్లో ముగియనున్న దృష్ట్యా ఆ మేరకు ఆశాజనకంగానే కేటాయింపులు చేసింది. ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన ప్రతి రంగాన్ని గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతికి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై బడ్జెట్లో ప్రస్తావనకు కూడా నోచుకోని అమరావతికి కూటమి ప్రభుత్వ తొలి బడ్జెట్లో అత్యంత ప్రాధాన్య అంశంగా కనిపించింది. రాజధాని నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు కేటాయించింది. అమరావతి క్యాపిటల్ డెవలప్మెంట్ ప్రాజెక్టుల కోసం ప్రత్యేకంగా రూ.3 వేల కోట్లు కేటాయించింది. స్మార్ట్ సిటీల కార్యక్రమంలో భాగంగా అమరావతికి వేర్వేరుగా నిధుల కేటాయింపు జరిగింది. ఇందులో సీఐటీఐఐఎస్ చాలెంజ్ ప్రోగ్రామ్ కింద రూ.32 కోట్లు, మిషన్ డెవలప్‌మెంట్ స్మార్ట్‌సిటీలో అమరావతికి రూ.50 కోట్లు కేటాయించారు. ఏపీసీఆర్‌డీఏ సహాయ నిధి కింద బడ్జెట్‌లో రూ.1053.70 కోట్లు కేటాయించారు. ల్యాండ్ పూలింగ్ ఫర్ కేపిటల్ సిటీ కోసం రూ.400 కోట్లు కేటాయించారు. నవ్యాంధ్ర రాజధానిగా అమరావతిని నిర్ణయించిననాటి నుంచి మెట్రో రైలు ప్రాజెక్టు రాష్ట్ర ప్రజలను ఊరిస్తూనే ఉంది. 2014- 19ల మధ్య ప్రాధాన్యతను సంతరించుకున్న ఈ ప్రాజెక్టు 2019- 24 మధ్య వైసీపీ హయాంలో ప్రస్తావనకు కూడా నోచుకోలేదు. తాజా బడ్జెట్లో మెట్రో రైలు విభాగానికి రూ.50 కోట్లు కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం రాజధాని పట్ల తన చిత్తశుద్ధిని ప్రకటించింది. దీంతోపాటు హైకోర్టు భవనాల నిర్మాణాల కోసం రూ.13.3 కోట్లు, ఏపీ సైన్స్ సిటీ కోసం రూ.2.6 కోట్లు కేటాయించింది. అమరావతికి బడ్జెట్ కేటాయింపులు జరిగిన సోమవారం రోజే రాజధాని అమరావతి మరో మైలురాయిని అధిగమించింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి వస్తున్న నిధులకు సంబంధించి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులతో సీఆర్డీఏ కమిషనర్ సంతకాలతో రుణ ఒప్పందం పూర్తయి నిధులు మంజూరవనున్నాయి. ఇక మంగళగిరిలోని ఎయిమ్స్‌లో నీటి సరఫరా కోసం రూ.5 కోట్లు కేటాయించారు.

ఎన్జీ రంగా వర్సిటీకి.. రూ.507 కోట్లు


గుంటూరు సిటీ: గుంటూరు సమీపంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీకి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రభుత్వం పెద్దపీట వేసింది. వైసీపీ హయాంలో వర్సిటీ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఇటీవల రంగా జయంతి కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు వర్సిటీకి పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా బడ్జెట్‌లో రూ.507 కోట్లు కేటాయించారు. ఈ నిధుల కేటాయింపుతో వర్సిటీకి ప్రభుత్వం జీవం పోసినట్లైంది. భూసార పరీక్షలకు పెద్ద పీట వేయడంతో పాటు, రైతులకు అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ కృతనిశ్చయం ఈ నిధుల కేటాయింపుతో నెరవేరుతుందని వర్సిటీ వర్గాలు అంటున్నాయి. రైతులకు యంత్ర పరికరాలు, క్రమం తప్పకుండా భూసార పరీక్షలు, ఉద్యాన పంటలకు రాయితీలు, ఆక్వాసాగుకు ప్రోత్సాహకాలకు కూటమి ప్రభుత్వం సుముచిత ప్రాధాన్యం ఇచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా యంత్ర పరికరాలకు దాదాపు రూ.11 కోట్లు, భూసార పరీక్షలకు రూ.3 కోట్ల వరకు కేటాయింపు ఉండొచ్చని తెలుస్తోంది. ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్‌కు రూ.2.50 కోట్లు, ఉద్యాన పంటల రాయితీల కింద రూ.300 కోట్ల వరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల రైతులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. వడ్డీలేని రుణాలలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వాటా రూ.45 కోట్ల వరకు , రైతు సేవా కేంద్రాలకు సంబంధించి రూ.3 కోట్ల వరకు నిధుల కేటాయింపు దక్కే అవకాశం ఉంది.



ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ

సాగునీటి ప్రాజెక్టులకు పునరుజ్జీవం

పడకేసిన సాగునీటి ప్రాజెక్టుల పునరుజ్జీవానికి కూటమి ప్రభుత్వం భారీగా నిధుల కేటాయించింది. గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో కృష్ణా పశ్చిమ డెల్టా కింద 5.50 లక్షల ఎకరాలు సాగవుతుండగా రూ.138.76 కోట్లు కేటాయించారు. డెల్టా కింద



భూసేకరణ కోసం రూ.50 కోట్లను కేటాయించారు. ఇది గుంటూరు చానల్ పొడిగింపు ప్రాజెక్టు కోసమా.. గోదావరి - పెన్నా నదుల అనుసంధానం కోసమా అనేది తేలాల్సి ఉన్నది. డెల్టాలో పెండింగ్‌లో ఉన్న ఆధునికీకరణ పనుల పూర్తిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం ప్రత్యేకంగా రూ.37.53 కోట్లను కేటాయించింది. దీంతో ఆయా పనులు పూర్తి అవుతాయని అధికారవర్గాలు తెలిపాయి. పులిచింతల ప్రాజెక్టు నిర్వహణని కూడా గత ప్రభుత్వం మరిచింది. దాంతో ఒక దఫా భారీ వరద వచ్చినప్పుడు రేడియల్ క్రెస్టు గేటు కొట్టుకుపోయింది. దాని స్థానంలో స్టాప్‌లాక్ గేటు అమర్చేందుకు జలాశయంలోని నీటిని అప్పటి వైసీపీ ప్రభుత్వం ఖాళీ చేయించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పులిచింతల ప్రాజెక్టు నిర్వహణ కోసం రూ.29.45 కోట్లను కేటాయించింది. దీని వలన నిర్వహణ పనులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఉండవు. గత ప్రభుత్వ వైఫల్యంతో ఏకంగా గేట్లే కొట్టుకుపోయిన గుండ్లకమ్మ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.13 కోట్ల నిధుల కేటాయింపు జరిగింది. ప్రాజెక్టు ప్రకాశం జిల్లాలో పరిధిలో ఉన్నా బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గ ప్రజలకు సాగునీటి విషయంలో గుండ్లకమ్మ దోహదపడుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో కాల్వలు, వాగుల గట్లు తెగిపోయి పంటలు నీట మునిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వరద నియంత్రణ ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌లో రూ.19.55 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించింది.

ఎన్టీఆర్‌కు నివాళి..



ఆనవాయితీ ప్రకారం సీఎం చంద్రబాబునాయుడు సోమవారం అసెంబ్లీ సమావేశాలకు వెళ్తూ వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల దండలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆయన వెంట మంత్రులు నారాయణ, లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు విశాఖ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, నిమ్మకాయల చినరాజప్ప తదితరులు ఉన్నారు. -తుళ్లూరు

గోతుల్లేని రోడ్ల కోసం..



గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో రోడ్ల మరమ్మతుల కోసం దాదాపు వెయ్యి కోట్ల వరకు అవసరమవుతుందనే అంచనాలను రూపొందించారు. ప్రభుత్వం తాజాగా జరిపిన కేటాయింపుల్లో భాగంగా జిల్లాలకు ఇతోధికంగానే వాటా దక్కనున్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కింద రూ.800 కోట్లు, ఆర్‌అండ్‌బీ కింద వెయ్యి కోట్ల వరకు నిధులు మూడు జిల్లాల పరిధిలో దక్కనున్నాయి.

సంక్షేమం.. నైపుణ్యం



నామినేటెడ్ పదవుల కోసమే అన్నట్లుగా వెనకబడిన వర్గాల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటిని కుదేలు చేసిన ఘనత గత ప్రభుత్వానిది కాగా కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లు ఆయా వర్గాల సంక్షేమం కోసం బడ్జెట్‌లో ఇతోధికంగా నిధులు కేటాయించింది. ఎస్సీ సంక్షేమం కింద దాదాపు రూ.600 కోట్లు, ఎస్టీ వెల్ఫేర్ కింద రూ.200 కోట్లు, బీసీ సంక్షేమం కింద దాదాపుగా రెండు వేల కోట్లవరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. నైపుణ్యాభివృద్ధి కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల కేటాయించగా ఈ నిధుల వ్యయంలో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలకు అంకురార్పణ జరిగే అవకాశాలున్నాయి

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

1 అధికారులను ఆదేశించిన ఎస్పీ తుషార్‌డూడీ



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని ఎస్పీ తుషార్‌డూడీ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరుతూ 37 మంది అర్జీలు అందజేశారు. అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎస్పీ ఆయా పోలీసుస్టేషన్లకు వాటిని పంపించారు. చట్టపరిధిలో విచారించి నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే బాధితులకు భరోసాగా పోలీసుశాఖ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ విఠలేశ్వర్, పీజీఆర్‌ఎస్ ఇన్‌చార్జి సీఐ యు.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌ల్యాండ్‌కు రూ.లక్ష అడిగారు

1 వీఆర్వోపై ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన బాధితులు



ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

చీరాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వెబ్‌ల్యాండ్ కోసం తమను వీఆర్వో రూ.లక్ష డిమాండ్ చేశాడని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడుకు బల్లికురవ మండలం ముక్తేశ్వరం పంచాయతీ పరిధికి చెందిన ఇద్దరు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక ఆర్డీవో అధ్యక్షతన జరిగింది. వివిధ సమస్యలపై 12 అర్జీలు అందాయని, వాటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని ఆర్డీవో తెలిపారు. అందులో ఓ వృద్ధురాలు, అతనితో పాటు వచ్చిన వ్యక్తి వీఆర్వో లంచం డిమాండ్ చేశారని ఆరోపిస్తూ అర్జీ ఇచ్చారు. వెబ్ ల్యాండింగ్ కోసం తమను రూ.లక్ష డిమాండ్ చేయగా, రూ.20 వేలు ఇస్తామని చెప్పామని, అందుకు వీఆర్వో అంగీకరించలేదని తెలిపారు. దీనిపై స్పందించిన ఆర్డీవో బల్లికురవ తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తనకు అందిన అర్జీకి సంబంధించిన వివరాలు తెలుపుతూ వీఆర్వోపై గోప్యంగా విచారణ జరిపి వాస్తవాలను తెలుసుకుని నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

అర్జీదారులను కార్యాలయాల చుట్టూ
తిప్పుకోవద్దు : కలెక్టర్



అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవటం మంచి పద్ధతి కాదని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 150 మంది వచ్చి అర్జీలు అం దజేసి తమ సమస్యలను వివరించారు. అర్జీలు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్న కలెక్టర్ ఆయన పరిధిలో వాటిని తక్షణమే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించారు. అర్జీ లపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. సత్వరమే వారికి న్యాయం చేయాలన్నారు. అన్ని మండలాలలో ల్యాండ్‌బ్యాంక్, ఖాళీభూముల వివరాలు ఇవ్వాల ని అధికారులను ఆదేశించారు. ఆర్డీవోలు, తహసీల్దార్‌లు విచారించాలని ఆయన సూచించారు. గడువు తీరిన అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని తహసీల్దార్‌లను జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశించారు. అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లిప్తంగా ఉండరాదన్నారు. గడువుతీరినప్పటికి అర్జీలు పెండింగ్‌లు ఉంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీటి తీరువా వసూళ్ళ చేసే బాధ్యత తహసీల్దార్‌లపై ఉందని చెప్పారు. కొన్నిప్రాంతాలలో పన్నులు వసూళ్ళ చేయకపోవటంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసుకపై ఫీజులు రద్దుచేయాలని వినతి

ఇసుకపై అన్నిరకాల పన్నులు, ఫీజులు ఎత్తివేయాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో భవననిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట విలేకర్లతో మాట్లాడుతూ ఇసుకను ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం ఏదైతే వాగ్దానం ఇచ్చిందో ఆ వాగ్దానం నిలబెట్టుకోవాలని, సంక్షేమబోర్డు నుండి ప్రభుత్వం తీసుకున్న 1600 కోట్ల రూపాయలను సంక్షేమబోర్డు నందు వెంటనే జమచేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు జెబి.శ్రీధర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బక్కా వెంకటరామకృష్ణారెడ్డి, భవననిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ హేమ మాధురి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

అద్దంకిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాలలో, ఇళ్ల వద్ద వాతవరణం మార్పుల వలన వచ్చే రుగ్మతల పట్ల అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ఎం.హేమమాధురి అన్నారు. సోమవారం అద్దంకిలోని శ్రీ చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురుకి మందులను అందజేశారు. త్రాగునీరు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. ఎటువంటి ఆనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డాక్టర్ హేమమాధురి స్వీట్‌లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహకులు, ఉపాధ్యాయులు, ఆ రోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది కొరత ఉంది

చెత్తను తగులబెట్టడం లేదు

చీరాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం రామాపురం వద్ద ఉన్న సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ యూనిట్‌లో పనిచేసే సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవం. కొత్తగా సిబ్బందిని తీసుకుని టెండర్లు పిలిచి వర్మీ కంపోస్ట్ ప్రాసెస్ చేసేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో చె(చి)త్త శుద్ధి శూన్యం అన్న శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. చెత్తను వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ జిందాల్ గుంటూరుకు మున్సిపల్ హైడ్రాలిక్ కాంపాక్టర్ ద్వారా తరలిస్తున్నారని తెలిపారు. చెత్తను తగుల బెట్టటం లేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌లో ఎలాంటి ప్రక్రియ జరగటం లేదని, యంత్రాలు పనిచేస్తున్నాయా లేదా అన్న విషయంతో పాటు, అధికారులు క్షేత్రస్థాయిలో అక్కడకు వెళ్లి పరిశీలస్తే వాస్తవాలు వారికే తెలుస్తాయని అక్కడ పనిచేసేవారు చెప్పడం విశేషం.

భక్తిశ్రద్ధలతో పడిపూజ, భజన

అద్దంకి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ వద్ద ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం పడిపూజ, భజన కార్య క్రమాలు భక్తితో నిర్వహించారు. నాగేంద్ర భజన బృందంచే గీతాలాపన చేశారు. వాసు గురుస్వామి, తిరుపతిరెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప భజన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్పస్వామి దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, రామలింగేశ్వరరావు, బాపయ్య, వినయ్ గురుస్వామి, అంజయ్య, పూజారి సూర్య పాల్గొన్నారు.

అపరాల సాగుపై దృష్టి సారించాలి

అద్దంకిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలుగా అపరాలను సాగు చేసుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని నాగులపాడు, వెంకటాపురం గ్రామాలల్లో రైతులకు శిక్షణ కేంద్రాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వలన ఆరోగ్యం దెబ్బతింటుందని, ధరలు ఉన్నాయని అందరూ పొగాకు సాగుపై దృష్టి పెడుతున్నారని, దీని వలన ధరలు పతనమై నష్టాలు చవి చూడాల్సి వస్తుందన్నారు. రాయితీపై శనగలు అందిస్తున్నామని పొగాకు ప్రత్యామ్నయంగా శనగా, మినుము, మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. శనగలో తప్పనిసరిగా ట్రైకో డర్మా విరిడి ద్వారా కేజీ విత్తనానికి 5 గ్రాములు కలిపి విత్తన శుద్ధిని చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు, మినుములో రసం పీల్చు పురుగు, పల్లాకు తెలుగు నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీపీఏలు అనూష, సీత పాల్గొన్నారు.

15 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

అద్దంకిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో గంగాధరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. పేరు తప్పులు ఉంటే టీసీ, పుట్టిన తేదీ తప్పు ఉంటే డేట్‌ఆఫ్‌బర్త్ సర్టిఫికెట్ తీసుకుని వచ్చి మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ అ కాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ తమ పాఠశాలలో అపార్ ఐడీ పెండింగ్ ఉన్న విద్యార్థులకు తప్పులు సరి చేయించాలని సూచించారు.

సర్వసభ్య సమావేశం 17కి వాయిదా

మేదరమెట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసినట్లు ఎంపీడీవో రాజ్యలక్ష్మి సోమవారం ప్రకటన తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం సెలవు రోజులలో మాత్రమే సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని ఈ నెల 13 జరగాల్సిన సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

నేడు ప్రత్యేక గ్రీవెన్స్ డే

మేదరమెట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొరిశపాడు మండల పరిషత్ కార్యాయలంలో మంగళవారం చీరాల ఆర్డీవో ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రీవెన్స్ డే కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులందరూ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆ యన కోరారు. మండలంలోని ప్రజలందరు అన్ని రకాల సమస్యలపై అ ర్జీల రూపంలో ఈ కార్యక్రమంలో అందించవచ్చని ఈ అ వకాశాన్ని మండల ప్రజలందరు సద్వినియోపర్చుకోవాలని తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు రెండు గ్రామాలలో ఇద్దరు వ్యక్తుల వద్ద 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై సీఐ భవాని, ఎస్సై విష్ణువర్ధన్‌రెడి ఆధ్వర్యంలో సోమవారం పంగులూరు మండలం తక్కెళ్లపాడు, అద్దంకి మండలం నాగులపాడులో దాడులు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తక్కెళ్లపాడులో పాలపర్తి ఏడుకొండలు వద్ద 12, నాగులపాడులో ఆంజనేయులు వద్ద 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

112 మద్యం బాటిళ్ల పట్టివేత.. ఇద్దరిపై కేసు

పర్చూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ భుజంగరావు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం మెరుపు దాడులు నిర్వహించారు. మండలంలోని జేఎంపీ అగ్రహారంలో 48 మద్యం సీసాలను అక్రమంగా ఉంచిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతనిపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా మంగళగిరికి చెందిన ఎస్టీఎఫ్ టీమ్ సభ్యులు మార్టూరు జాతీయ రహదారిపై మద్యం అక్రమ సీసాలు కల్గిఉన్న మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొన్నట్లు సీఐ తెలిపారు. అతని వద్ద నుంచి 20 మద్యం సీసాలు, 44 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కార్మికులకు రెండు నెలల జీతాల చెల్లింపు

ఇంకొల్లు,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులకు గత నాలుగు నెలలుగా జీతాలు సక్రమంగా అందలేదు. ఈ నేపథ్యంలో గత నాలుగు రోజులుగా వీరు విధులకు హాజరు కాలేదు. దీంతో పారిశుధ్య పనులు నిలిచిపోయాయి. ఎక్కడ చెత్త అక్కడే తాండవిస్తూ కంపుకొడుతోంది. సోమవారం పంచాయితీ పారిశుధ్య కార్మికుల ఖాతాలకు రెండు నెలల జీతాలను జమ చేసినట్లు ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం నుంచి కార్మికులు విధులకు హాజరవుతారని చెప్పారు.



చీరపై రంగులతో డిజైన్లు వేస్తున్న బాలశంకర్ దంపతులు

ఆన్‌లైన్‌లో ఆదరణ ఎక్కువగా ఉంది



మేం వేసే డిజైన్లకు మంచి ఆదరణ లభిస్తోంది. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు ఎక్కువగా వస్తున్నాయి. ఒకప్పుడు సరదాగా నేర్చుకున్న కళ, ప్రస్తుతం మాకు, మాతో పాటు మరికొంత మందికి భృతి కల్పిస్తోంది. మన్ననలు పొందగలుగుతున్నాం. అదే మాకు తృప్తి.

- బూదాటి బాలశంకర్, తయారీదారుడు, తోటవారిపాలెం

రంగు రంగులో.. ఎన్ని హంగులో..!

- చీరలపై డిజైన్లు చీరాలకే సొంతం
- తోటవారిపాలెంలో దంపతుల హ్యాండ్ డిజైన్ వర్క్
- చేతి కుంచెలతో ఆకర్షణీయంగా తయారు
- వివిధ ప్రాంతాలకు పెరుగుతున్న ఆర్డర్లు

చీరాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సాదా చీరలపై రంగు, రంగుల డిజైన్లు, ఆకర్షణీయమైన హ్యాండ్ వర్క్. చీరాల ప్రత్యేకత. మండలంలోని తోటవారిపాలేనికి చెందిన ఇరువురు దంపతులు సాదా చీరలపై చేతి కుంచెలతో వివిధ రంగుల డిజైన్లు వేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. మొదట రోజుకు ఒకటి, రెండు చీరలపై డిజైన్ చేసే వీరు ప్రస్తుతం రోజుకు సుమారు 15 నుంచి 20 చీరలు తయారు చేసే స్థాయికి ఎదిగారు. చీరాల మండలం తోటవారిపాలేనికి చెందిన బూదాటి బాలశంకర్, భ్రమరాంబ దంపతులు సాదా చీరలపై రకరకాల డిజైన్లు వేస్తూ మన్ననలు పొందుతున్నారు. బాలశంకర్ తన 12వ ఏట నుంచే రంగులతో హ్యాండ్ వర్క్ చేస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఆకురాతి నాగేశ్వరరావు అనే పెయింటర్ ఈయనకు స్ఫూర్తి. గోడలపై రంగులు వేసే నాగేశ్వరరావు వద్ద ఈయన శిక్షణ పొందారు. సాదా వస్త్రాలపై రంగులతో డిజైన్లు వేస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో ముందడుగు వేశారు. చూసిన వారందరూ బాగున్నాయని మెచ్చుకునేవారు. దీంతో బాలశంకర్ అదే పనిని తన వృత్తిగా ఎంచుకున్నారు. వివాహం జరిగాక తన భార్య భ్రమరాంబకు ఆ కళను నేర్పారు. అప్పటి నుంచి దంపతులు ఇరువురు సాదా చీరలపై ఫెవికాల్ కలర్స్‌తో వివిధ రకాల డిజైన్లు వేస్తున్నారు. ఆర్డర్లపైనే వారు ఎక్కువగా డిజైన్లు చేస్తుంటారు. వారు చేసే డిజైన్లు వినియోగదారుల అభిరుచి మేరకు రూ.600 నుంచి రూ.3వేల వరకు తీసుకుంటున్నారు. ఈ చీరలపై వేసే రంగులు ఉతికినా చెడిపోకపోవడం ప్రత్యేకత. చేతి కళలు అంతరించిపోతున్న తరుణంలో ఈ దంపతులు సృజనకు మారుపేరుగా తమ వృత్తిలో రాణిస్తూ, మరికొందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ముఖాముఖి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

చంద్రశేఖర్‌నాయుడు, ఆర్డీవో, చీరాల



చీరాల రెవెన్యూ డివిజన్‌కు కొత్తగా వచ్చాను. అవగాహన కల్పించుకుంటున్నాను. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తా. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవంటూ పలు అంశాలకు సంబంధించి ఆంధ్రజ్యోతి ప్రతినిధి సూటిగా అడిగిన ప్రశ్నలకు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు స్పష్టంగా సమాధానం చెప్పారు.

- చీరాలతో గతంలో పరిచయం ఉందా .. స్థానిక స్థితిగతులపై అవగాహన వచ్చిందా?

ఆర్డీవో : చీరాలకు రావడం ఇదే మొదటిసారి. స్థానిక పరిస్థితులపై అవగాహన కల్పించుకుంటున్నాను. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తాను. అందుకు ప్రజలు సహకరించాలి

- అనధికారిక లేఅవుట్లకు సంబంధించి ఏం చర్యలు చేపడుతున్నారు?

ఆర్డీవో : డివిజన్ పరిధిలో మొత్తం అనధికారిక లేఅవుట్లకు సంబంధించి సమాచారం తీసుకుంటున్నాం. అందుకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. నిబంధనలు అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటాం. ఎవరినీ ఉపేక్షించం.

- కార్తీక పౌర్ణమి స్నానాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

తీర ప్రాంతానికి కార్తీక పౌర్ణమి స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను చేయాలని సంబంధీకులకు చెప్పాం. నేను కూడా అధికారులు, సిబ్బందితో కలసి ఆయా ప్రాంతాలను పరిశీలించాను. తాత్కాలిక స్నానపు గదులు, విద్యుత్ దీపాల ఏర్పాటు, పారిశుధ్యం తదితర ఏర్పాట్లలో ఏమాత్రం రాజీ పడొద్దని చెప్పాం. ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం.

- ఇసుక అక్రమ రవాణా మీ దృష్టికి వచ్చిందా .. ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతాం. ఉమ్మడి కార్యాచరణ కోసం మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి చర్యలు చేపడతాం. మైనింగ్ పాత్ర కీలకం. పట్టా భూములైనా ముందుగా మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతి పొందిన తరువాత మాత్రమే ఇసుక తవ్వకాలు, రవాణా జరపాలి.

- పీవోటీ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్)కి సంబంధించిన అంశాలు ఏమైనా మీ దృష్టికి వచ్చాయా?

ఆర్డీవో : : పీవోటీకి సంబంధించి ఒక కేసు నా దృష్టికి వచ్చింది. దానిపై విచారణ జరుగుతోంది. విచారణ పూర్తయ్యాక చర్యలు చేపడతాం. అంతిమంగా నిబంధనలు అతిక్రమించేవారు ఎవరైనా చర్యలు తప్పక ఉంటాయి.

40 మందికి సీఎం సహాయం అందజేత



సీఎం ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

మార్టూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గంలో నిరుపేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారికి అత్యుత్తమ వైద్య సేవలను అందించాలనే దృక్పథంతో 40 మందికి రూ.35,41,260 సీఎం సహాయ నిధి నుంచి నిధులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంజూరు చేయించారు. ఈ మేరకు సోమవారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులు చేతులమీదగా 40 మందికి చెక్కులను అందచేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలలోని గ్రామాలకు చెందిన పేద కుటుంబాలకు చెందిన వారు వైద్య సహాయం పొందేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో వారంతా తమ గ్రామానికి చెందిన నాయకుల ద్వారా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కలిశారు. ఈ నేపథ్యంలో ఏలూరి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి బాధితుల వివరాలను తీసుకువెళ్లారు. దాంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి బాధితులకు మంజూరైన చెక్కులను టీడీపీ నాయకులు స్వయంగా బాదితులకు క్యాంపు కార్యాలయంలో అందచేశారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, హరిబాబు, నాగార్జున, రంగయ్య చౌదరి, శ్రీను, వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన పెదగంజాం విద్యార్థులు

చినగంజాం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రకాశం జిల్లా అండర్-17 క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఎం.దేవదత్తం తెలిపారు. పెదగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన అభినందన సభలో క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఇటీవల కనపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన అండర్ -17 క్రికెట్ పోటీలలో ప్రతిభ చాటి జిల్లా క్రికెట్ జట్టుకు ఆసోది బాలాజీరెడ్డి, అదనపు క్రీడాకారుడుగా మాచవరపు అభిరామ్ ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. ఇద్దరు విద్యార్థులు పదో తరగతి చదువుతున్నట్లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం దేవదత్తం, ఇన్‌చార్జి డి.నారాయణరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ సుదర్శనరెడ్డి, ఉపాధ్యాయులు ఎ.వీరాచారి, బి.చెంచురెడ్డి, కే.నాగరాజు, శ్రీరమణ, పీడీ ఎం.అనిల్‌కుమార్ అభినందించారు

నిధుల ఊరట

- వెలిగొండకు రూ.393.50కోట్లు
- గుండ్లకమ్మకు రూ.13కోట్లు
- రానున్న నాలుగు నెలల్లో చేపట్టే పనులకు వీలుగా కేటాయింపు
- అన్నదాత సుఖీభవకు గ్రీన్‌సిగ్నల్
- కేంద్రం ఇచ్చే రూ.6వేలకు మరో రూ.14వేలు అదనం
- 2.45లక్షల మంది రైతులకు లబ్ధి

ఒంగోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి రంగానికి నిధులు ఊరట కలిగింది. కీలకమైన వెలిగొండ ప్రాజెక్టుకు రూ.393.50 కోట్లు కేటాయింపు జరగ్గా గుండ్లకమ్మకు రూ.13 కోట్లు కేటాయించారు. ఆ మేరకు రాష్ట్రప్రభుత్వం బడ్జెట్ ప్రతిపాదనల్లో కేటాయింపులు జరిగాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు సార్లు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లు ప్రవేశపెట్టగా పూర్తిస్థాయి వార్షిక (2024-25) బడ్జెట్‌ను సోమవారం శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రతిపాదించారు. మొత్తం రూ.2.94 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన కేశవ్ ఆయా రంగాలకు ప్రాధాన్యతలకు అనుగుణంగా కేటాయింపులు చేశారు. మొత్తం బడ్జెట్‌లో సుమారు రూ.43వేల కోట్లకుపైగా వ్యవసాయానికి కేటాయించగా మరో ప్రాధాన్యత రంగంగా ఉన్న నీటి పారుదల శాఖకు రూ.16,705కోట్లు కేటాయించారు. అలాగే వివిధ రంగాలకు అవసరాలను బడ్జెట్ కేటాయించారు.

రెండు కీలక ప్రాజెక్టులకు మంచిరోజులు

జిల్లాలో నిర్మాణంలో ఉన్న వెలిగొండ, ఉపయోగంలో ఉన్న గుండ్లకమ్మ ప్రాజెక్టులను గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిన విషయం విదితమే. కీలకమైన 2023-24లో వెలిగొండకు రూ.101.4 కోట్లు మాత్రమే వైసీపీ ప్రభుత్వం కేటాయించగా అందులో కేవలం రూ.26.34కోట్ల మాత్రమే ఖర్చుచేశారు. ఇక గుండ్లకమ్మ ప్రాజెక్టుకు రూ.30కోట్లు కేటాయింపు చేయగా రూ.3.87 కోట్లు ఖర్చుచేశారు. దాంతో వెలిగొండ పనులు ముందుకు సాగకపోగా గుండ్లకమ్మ గేట్లు మరమ్మతులకు కూడా నిధులు లేక రెండేళ్లుగా ఆయకట్టుకు నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ రెండింటిపై దృష్టిసారించింది. వెలిగొండలో రూ.100 కోట్లకుపైగా పనులు ఇప్పటికే చేయగా రూ.80 కోట్ల చెల్లింపులు కూడా జరిగాయి. అందుకు సంబంధించిన నిధులను ఓటాన్ అకౌంట్ బడ్జెట్ నుంచి ఇచ్చారు. మరో రూ.23 కోట్లు చెల్లించాల్సి ఉంది. కాగా ఇటీవల ప్రాజెక్టును ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు సందర్శించి సమీక్ష చేశారు. ఈ ఏడాది రానున్న నాలుగు నెలల్లో అవకాశం ఉన్న మేర పనులు చేస్తామని వాటికి అవసరమైన నిధులు ఇస్తామని చెప్పారు. అలాగే రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామన్నారు. దానికి అనుగుణంగా ప్రస్తుతం బడ్జెట్‌లో కేటాయింపు కనిపించింది.

తక్షణ అవసరాల కోసం

ఔటాన్ బడ్జెట్‌లో ఇచ్చిన నిధులను కూడా కలిపి ఈ ఏడాదికి వెలిగొండకు రూ.393.50 కోట్లు కేటాయింపు చేశారు. అంటే ఇప్పటికే ఖర్చుచేసిన రూ.100 కోట్లు పోను రానున్న నాలుగు నెలలకు మరో రూ.200 కోట్లు ఖర్చు చేసేలా నిధులు అందుబాటులో ఉన్నాయి. మొత్తం రూ.393.50 కోట్లలో ప్రాజెక్టు పనులకు రూ.248 కోట్లు కేటాయించగా నిర్వాసితులకు పరిహారం చెల్లింపునకు రూ.80కోట్లు, భూసేకరణకు రూ.48కోట్లు, ఆర్‌అండ్‌ఆర్‌కు రూ.16.42 కోట్లు కేటాయించారు. నిర్వాసితుల పునరావాసానికి ఇంకా భారీగా నిధులు అవసరం ఉండగా తక్షణం ప్రాజెక్టుకు నీరిచ్చే పరిస్థితి లేదు కనుక వచ్చే ఏడాది బడ్జెట్‌లో అందుకు కేటాయింపులు ఉంటాయని అధికారవర్గాల సమాచారం. ఇక గుండ్లకమ్మ ప్రాజెక్టుకు గత వైసీపీ ప్రభుత్వం రూ.30కోట్లు కేటాయింపు చేసి రూ.3.87 కోట్లు మాత్రమే ఇవ్వగా ప్రస్తుత బడెట్‌లో తక్షణ అవసరాలకు అనుగుణంగా రూ.13కోట్లు కేటాయించారు. గేట్ల మరమ్మతుల కోసం రూ.6.50 కోట్లు ఇంకా అవసరం కాగా అవి పోను మిగిలిన ఈ నాలుగు నెలల నిర్వహణ ఖర్చులకు ఇబ్బంది లేకుండా చేశారు.

నీటివనరుల అభివృద్ధికి నిధులు

ఇదిలా ఉండగా ఒంగోలులోని ప్రాజెక్టుల సీఈ పరిధిలో రాష్ట్రంలో ఎన్ఎస్‌పీ కాలువల నిర్వహణ మొత్తం ఉండగా వాటి కోసం రూ.128.62 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని ఎన్ఎస్‌పీ కాలువల నిర్వహణ సాగనుంది. ఇక ఈసీఈ పరిధిలో మొత్తం జలవనరుల శాఖ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర నిర్వహణ ఖర్చులకు రూ.31.44కోట్లు, మీడియం ఇరిగేషన్, ఇతర పనులకు మరో రూ 6.20 కోట్లు కేటాయించారు. అలా మొత్తంగా ఒంగోలు కేంద్రంగా ఉన్న సీఈ పరిధిలో ఈ బడ్జెట్‌లో రూ.581.76 కోట్లు కేటాయింపు జరిగింది. అదే వైసీపీ ప్రభుత్వంలోని 2023-24లో ఈసీఈ పరిధిలోనూ రూ.301 కోట్లు కేటాయించి రూ.217.39 కోట్లు మాత్రమే ఖర్చుచేశారు.

రైతులకు భారీ మేలు

ఆయా సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకంలో జిల్లా రైతాంగానికి భారీగా మేలు జరగనుంది. గతంలో కేంద్రం ఇచ్చే రూ.6వేలకు మరో రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13500లను రైతుభరోసా పేరుతో వైసీపీ ప్రభుత్వం ఇచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం రూ.20వేలకు పెంచనున్నట్లు ప్రకటించగా బడ్జెట్‌లో ఆమేరకు ఇవ్వనున్నట్లు వ్యవయాశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. దాంతో ఒక్కొక్క రైతుకు అదనంగా ఏడాదికి రూ.6,500 రానుంది. జిల్లాలో మొత్తం 2.45 లక్షలమంది రైతులకు మేలు జరగనుంది. అయితే బడ్జెట్ కేటాయింపులపై విభిన్న రాజకీయ పార్టీలు విభిన్న రీతిలలో స్పందిస్తున్నాయి. ప్రజారంజకమైన బడ్జెట్‌గా అధికార టీడీపీ అభివర్ణిస్తుండగా అంకెల గారడీగా వైసీపీ విమర్శిస్తోంది. ఇతర వామపక్షాలు అసంతృప్తిని వ్యక్తం చేశాయి.

ఏపీవోపై టెక్నికల్ అసిస్టెంట్ కత్తితో దాడి

దాడిని అడ్డుకున్న కంప్యూటర్ ఆపరేటర్‌కు గాయాలు

పర్చూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీవోపై టెక్నికల్ అసిస్టెంట్ కత్తితో దాడికి పాల్పడిన సంఘటన పర్చూరులోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కార్యాలయంలో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఏపీవోకు స్వల్ప గాయాలు కాగా, అడ్డుకున్న కంప్యూటర్ ఆపరేటర్ ముఖంపై గాయాలయ్యాయి. కత్తితో దాడి జరుగుతున్న సమయంలో పెద్దగా కేకలు వినిపించడంతో సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. మధ్యాహ్నం ఏపీవో బుల్లియ్య కంప్యూటర్ ఆపరేటర్ ఖాదర్ మొహిద్దీన్‌తో కలసి కార్యాలయంలోని అఫీసు రూంలో భోజనం చేస్తున్న తరుణంలో టెక్నికల్ అసిస్టెంట్ రాజేంద్ర కత్తితో దాడికి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. అనంతరం కత్తిని అక్కడే వదిలేసి పోలీస్ స్టేషన్‌లో నిందితుడు లొంగిపోయినట్లు తెలిసింది. జీతాల బిల్లుల విషయంలో నెలకొన్న వివాదం ఘర్షణకు దారితీసిందని సిబ్బంది అంటున్నారు. పూర్తి విషయాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

ధ్యాన మందిర్‌లో చోరీ

పర్చూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : పర్చూరు పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని ఓం శాంతి ధ్యాన మందిరంలో రూ.30వేల నగదు, అరకేజీ వెండివస్తువులు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆశ్రమ నిర్వహకులు భద్రాచలంలో ఓం శాంతి కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఇక్కడ చోరీ జరిగినట్లు వారు తెలిపారు. సోమవారం ఆశ్రమానికి రాగా తాళాలు పగులకొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మృతదేహానికి పోస్టుమార్టం

మార్టూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు సెంటర్లో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆదివారం రాత్రి మృతిచెందిన ద్విచక్రవాహనదారుడు తమ్మిలూరి నాగేశ్వరరావు మృతదేహానికి సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టమ్ నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులు మండలంలోని రాజుపాలెంలోని స్వగృహానికి తీసుకువెళ్లారు. కుమారుడు పెద్దబ్బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అదేవిధంగా ప్రమాదానికి కారణమైన కారును గుర్తించామన్నారు. పోలీసులు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సైదా తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

చినగంజాం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చినగంజాం సమీపంలోని జాతీయ రహదారి రొంపేరు బ్రిడ్జి వద్ద సోమవారం వెలుగు చూసింది. ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపిన కథనం మేరకు పురుగు మందు తాగి గుర్తు తెలియని 60 సంవత్సరాల వ్యక్తి మృతి చెందారు. మృతదేహం వద్ద నవక్రాన్ పురుగుల మందు డబ్బా, థమ్స్ అప్ బాటిల్ ఉన్నాయి. రెండు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించిరట్లు ఎస్.ఐ తెలిపారు.

దాతల సాయం మరువలేనిది



రాత పుస్తకాలను పంపిణీ చేస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

చినగంజాం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులకు దాతలు అందిస్తున్న సాయం మరువలేనిదని పాఠశాల హెచ్‌ఎం టీవీఎస్ శైలజకుమారి అన్నారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉప్పుగుండూరు వివేకానంద సేవా సమితి వారు సోమవారం రాత పుస్తకాలను పంపిణీ చేశారు. దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం సూచించారు. గత పది సంవత్సరాల నుంచి వివేకానంద సమితి సభ్యులు సంవత్సరానికి రెండు సార్లు విద్యార్థులకు రాత పుస్తరాలను అందజేస్తున్నట్లు తెలిపారు. వివేకానంద సేవా సమితి సభ్యుడు పావులూరి శివాజీ పాఠశాలలోని విద్యార్థులకు రాత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిరంజీవి, పాఠశాల ఉపాధ్యాయరాలు బి.సుకన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడిన వ్యక్తి

విషమంగా పరిస్థితి

చీరాలటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారిపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. చెన్నై నుంచి విజయవాడ వైపు వెళ్లే రైలు నుంచి చీరాలలో దిగుతూ ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో అతని శరీర భాగాలు తెగిపడ్డాయి.సమాచారం అందుకున్న 108 సిబ్బంది చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పేరు గిరి, తనది ఒంగోలు, అత్తవారి ఊరు రామకృష్ణాపురంగా గుర్తించారు. చీరాల ఏరియా వైద్యశాలలో అతనికి చికిత్స అందిస్తున్నారు.

గాడిన పడని అన్నగారి సంత

- వైసీపీ రాకతో అస్తవ్యస్తం
- రాజన్నగా పేరు మార్పు
- నాడు దళారులు లేకుండా నేరుగా రైతులు అమ్ముకునే అవకాశం
- తక్కువ ధరకే కూరగాయలు
- వ్యాపారంలోకి ప్రైవేటు వ్యాపారులు
- సమస్యలు పరిష్కరించాలని పాలకులు, అధికారులకు విజ్ఞప్తి


అద్దంకి మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న సంత


సంతలో పలుచగా ఉన్న కొనుగోలుదారులు


నామ్ రోడ్డుపై నిర్వహిస్తున్న దుకాణాలు

అద్దంకి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మార్కెట్ యార్డ్ ఆవరణలలో నిర్వహించే సంతలు ఇంకా గాడిన పడలేదు. దశాబ్ద కాలం కిందట తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అప్పటి అద్దంకి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో వినూత్నంగా అన్నగారి సంత నిర్వహణ ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వచ్చింది. రైతులే స్వయంగా తమ ఉత్పత్తులను తెచ్చుకొని అమ్మకాలు చేసుకునేలా ఎన్టీఆర్ పేరుతో అన్నగారి సంతగా నామకరణం చేసి ప్రారంభించారు. కొనుగోలుదారులకు తక్కువ ధరకే తాజా కూరగాయలు అందుబాటులోకి రాగా, రైతులకు కూడా ఉపయోగకరంగా దళారులు లేకుండా తాము పండించిన కూరగాయలను నేరుగా అమ్ముకునే అవకాశం రావడంతో రైతులకు కూడా లాభదాయకంగా మారింది. అద్దంకి మార్కెట్ యార్డు పరిధిలోని అద్దంకి, మేదరమెట్ల, పంగులూరులో ఉన్న యార్డులలో నిర్వహించారు. కొంత కాలం తరువాత పంగులూరులో నిలిపివేశారు. ఆదివారం అద్దంకిలో, బుధవారం మేదరమెట్లలో నిర్వహిస్తున్నారు. ముందురోజే ఆయా కూరగాయల ధరలను నిర్ధారించి, కచ్చితంగా ఆయా ధరలకే అన్ని దుకాణాలలో నిర్వహించేలా చేశారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్నగారిసంత పేరును రాజన్న సంతగా మార్పు చేశారు. నిర్వహణపై మార్కెట్ కమిటీలు ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సంతలో రైతుల స్థానంలో కొంత మంది వ్యాపారులు రంగ ప్రవేశం చేయడంతో సంత నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ధరలపై నియంత్రణ లేకుండా పోయింది. దీంతో ఎవరి ఇష్టం వచ్చిన ధరలకే వారు అమ్మకాలు చేయడం ప్రారంభించారు. దీంతో సంత పట్ల ప్రజలలో ఆసక్తి తగ్గింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్నగారి సంతకు పూర్వ వైభవం వస్తుందని ప్రజలు భావించారు. అయితే ఇంకా మార్కెట్ కమిటీ నియామకం జరగకపోవడంతో సంత నిర్వహణను కొంత మంది టీడీపీ నేతలు అనధికారికంగా నిర్వహిస్తున్నా ఇంకా గాడిన పడలేదన్న విమర్శలు వస్తున్నాయి. ధరలపై నియంత్రణ లేకపోవడంతో నిర్ధిష్టమైన ధరలు లేకుండా పోయాయి. అదే సమయంలో ఎవరికి వారే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు కూడా అమ్మకాలు చేస్తున్నారు. మార్కెట్ కమిటీ ఏర్పడే వరకు కనీసం మార్కెట్ యార్డులో పని చేసే సిబ్బంది ద్వారా అయినా పర్యవేక్షణ చేసేలా చర్యలు చేపట్టి అన్నగారి సంత పూర్వవైభవం చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. రైతులు పండించిన కూరగాయలను రైతులే స్వయంగా వచ్చి అమ్మకాలు చేసుకునే విధంగా రూపకల్పన చేసి మార్కెట్ యార్డు ఆధ్వర్యంలోనే నిర్వహించే విధంగా అన్ని అనుమతులు తీసుకుంటే మార్కెట్ యార్డు కమిటీలు లేనప్పుడు కూడా స క్రమంగా నిర్వహించే వీలుంటుందని పలువురు అభి ప్రాయపడుతున్నారు. ప్రస్తు తం అలా కాకుండా మార్కెట్ యార్డు పర్యవేక్షణ లేకుం డా అనధికారికంగా నిర్వహిస్తుండడంతో అజమాయిషీ లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కచ్చితంగా మార్కెట్ యార్డు ఆధ్వర్యంలోనే అద్దంకి, మేదరమెట్లలో సంతలు నిర్వహణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అప్పుడు మాత్రమే ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా సవ్యంగా జరిగే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.


హనుమంతరావు మృతదేహానికి నివాళి అర్పిస్తున్న బలరాం

హనుమంతరావుకు నివాళి

కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బలరాం

మార్టూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఆదివారం మార్టూరులో మృతిచెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు అమర్నేని హనుమంతరావు మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం నివాళులర్పించారు. అనంతరం అతని కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ కోసం హనుమంతరావు చేసిన సేవలను బలరాం గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు తొండెపు ఆదినారాయణ, ఆళ్ల సాంబయ్య, ఎరువులు పురుగుమందులు విత్తనాలు అసోసియేషన్ అధ్యక్షుడు కిలారు లక్ష్మీ నారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులకు పరామర్శ

బల్లికురవ : మండలంలోని కె.రాజుపాలెం గ్రామ మాజీ సర్పంచ్ చెరుకూరి వెంకయ్య రెండు రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి కె.రాజుపాలెంలో చెరుకూరి వెంకయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు అమరనేని హనుమంతురావు అనారోగ్యంతో మార్టూరు గ్రామంలో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను బలరాం పరామర్శించి హనుమంతురావు మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో పలు గ్రామాలకు చెందిన వైసీపీ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

గుండెపోటుతో పశువైద్యాధికారి మృతి



యద్దనపూడి (మార్టూరు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి పశువైద్యాధికారి బట్టా సురేష్‌బాబు (42) గుండెపోటు కారణంగా ఆదివారం సాయంత్రం గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అతని భార్య శారద మండలంలోని పూనూరు పశు వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. గత పదేళ్లుగా మార్టూరు మండలంలో ద్రోణాదుల, బొబ్బేపల్లి, బల్లికురవ మండలంలో సురేష్ బాబు పశువైద్యాధికారిగా పనిచేశారు. ప్రస్తుతం యద్దనపూడి పశువైద్యాధికారిగా పనిచేస్తూ ఆదివారం ఉదయం మార్టూరులోని స్వగృహంలో గుండెపోటుకు గురయ్యారు. దాంతో కుటుంబసభ్యులు అతనిని చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో మరలా అతనిని మెరుగైన వైద్యం నిమిత్తం గుం టూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. అనంతరం మృతదేహాన్ని అతని స్వగ్రామమైన జాండ్రపేటలోని ఇంటికి తీసుకువెళ్లారు. అతనికి 13 ఏళ్ల కుమార్తె, రెండేళ్ల బాబు ఉన్నారు. సోమవారం ఉదయం జాండ్రపేటలో జరిగిన అంత్యక్రియలు కార్యక్రమానికి మండలంలోని పశువైద్యాధికారులు మాధవీలత, క్రాంతికిరణ్, మహేష్‌తో పాటు పలువురు సిబ్బంది వెళ్లి నివాళులర్పించారు. మార్టూరు, యద్దనపూడి మండలాల్లో పశుపోషకులకు, రైతులకు సుపరిచితులైన సురేష్‌బాబు మృతి కలిచివేసింది.

తొలగించిన వీవోఏలను కొనసాగించాలి

వెలుగు కార్యాలయం ముందు మహిళల ధర్నా


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న డ్వాక్రా మహిళలు

పంగులూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విధుల నుంచి తొలగించిన వీవోఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ డ్వాక్రా మహిళలు, తొలగించబడిన వీఓఏలు కొందరు వెలుగు కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు రాయిణి వినోద్‌బాబు మాట్లాడుతూ కారణం లేకుండా మండలంలో 18 మంది వీవోఏలను, మండల సమాఖ్య అధ్యక్షురాలిని తొలగించడం అన్యాయమన్నారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ పీ సింగారావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వీవోఏల సంఘ అధ్యక్షులు సావిత్రి, మండల సమాఖ్య ప్రతినిధి నాగలక్ష్మి, మండల కార్యదర్శి తలపనేని రామారావు, జిల్లా మహిళా కార్యదర్శి కృష్ణకుమారి, సీఐటీయూ ప్రతినిధి మల్లారెడ్డి, గోనుగుంట్ల అంజలి, ఆదుంసాహెబ్, ప్రజా కళాకారుడు నందవరపు జాన్, హేమలత, మీరాబి పాల్గొన్నారు.

డెలివరీ బాయ్‌పై దాడి

తీవ్ర గాయలతో ఏరియా హాస్పిటల్‌కు తరలింపు

చీరాలటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : డెలివరీ ఇవ్వడానికి వెళ్లిన బాయ్‌ను ముగ్గురు వ్యక్తులు విచక్షణా రహితంగా దాడిచేసి గాయపరచారు. దీంతో బాధితుడిని కుటుంబ సభ్యులు ఏరియా హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే స్థానిక పేరాలకు చెందిన నక్కల చిన్ను అమెజాన్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో సోమవారం స్వర్ణలో డెలివరీ ఇచ్చేందుకు ఓ ఇంటికి వెళ్లాడు. ఈక్రమంలో ఆర్డర్ చేసిన ప్రభుజీతో వివాదం తలెత్తిందింది. వెంటనే మరో ఇద్దరి యువకులతో కలిసి చిన్నును తీవ్రంగా చెక్కతో దాడిచేశారు. చెక్కకు ఉన్న మేకులు తలలో దిగబడ్డాయి. ఈక్రమంలో స్పృహ కోల్పోయిన బాధితుడిని స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

హాస్పిటల్ వైద్యులు చులకనగా చూస్తున్నారు

- ఆంజనేయులు, బాధితుడి తండ్రి

తీవ్రంగా గాయపడి బెడ్‌పై ఉన్న కొడుకుని చూడాలని మేము రోదిస్తున్నాము. గంట దాటినా చికిత్స ప్రారంభించలేదు. పైగా గదిలో ఎక్కువ మంది రోగులు కూడా లేరు. అయినా కూడా మా బిడ్డను చూడడానికి అవకాశం కల్పించలేదు. వేడుకున్నా పట్టించుకోలేదు. చాలా చులకనగా చూస్తున్నారు. అధికారులు హాస్పిటల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.

సంఘటితతంతోనే సమస్యలకు పరిష్కారం

చీరాలటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కార్మికులు సంఘటితంతోనే సమస్యలకు పరిష్కారం ఉంటుందని ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-1104 విద్యుత్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్‌రావు అన్నారు. సోమవారం బాపనమ్మ కల్యాణ మండపంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈక్రమంలో సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. చీరాల డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, మనోహర్, శివకుమార్, రవిబాబు, సురేష్, శర్మ, సంజీవరావు, ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్నికైన నూతన కమిటీ


అబుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

అద్దంకిటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కట్టారామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు సోమవారం జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలాం సేవలను అధ్యాపకులు కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ వి.మోహన రావు, డాక్టర్ షర్మిలా రాణి, ఎంవీ సత్యనారాయణ, డాక్టర్ చిలకా అనితతో పాటు ఇతర అధ్యాపకులు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

బల్లికురవ : బల్లికురవ ప్రాథమిక పాఠశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవం రోటరీ క్లబ్ అఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అఫ్ మార్టూరు శాఖ అధ్యక్ష కార్యదర్శులు మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, టీవీ ఆర్టిస్ట్ డి.మహేంద్ర, పాఠశాల ప్రధానోపధ్యాయిని కోమలి, నజీమ్, స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ సభ్యులు సుకన్య, మల్లేశ్వరి, సీహెచ్ రాంబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరికి ఘన స్వాగతం

మార్టూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : న్యూజిలాండ్ పర్యటన ముగించుకొని వచ్చిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు సోమవారం ఉదయం విజయవాడలో టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. విజయవాడలోని ఏలూరి నివాస గృహంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి, స్వాగతం పలికారు. అనంతరం మండలంలో ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మార్టూరు పట్టణ అధ్యక్షుడు కామినేని జనార్దన్, జిల్లా మైనార్టీ నాయకులు షేక్ అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

అక్కయ్య మృతి పార్టీకి తీరని లోటు

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


అక్కయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

కారంచేడు(పర్చూరు) నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యార్లగడ్డ అక్కయ్య చౌదరి మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరాలు అన్నారు. సోమవారం కారంచేడులోని అక్కయ్య చౌదరి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలపారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమల శ్రీహరి, మానం హరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజారంజక బడ్జెట్ : ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రజారంజక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందని సోమవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ఉందన్నారు. వైసీపీ అధికార దుర్వినియోగంతో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తమయ్యాయన్నారు. వైసీపీ ప్రభుత్వం రూ.1.35 లక్షల కోట్ల బకాయిలు పెట్టిందని చెప్పారు. వ్యవస్థలను గాడిన పెట్టే అనుభవం ముఖ్యమంత్రి చంద్రబాబుకే ఉందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఎన్నికల హామీల అమలుకు ఈబడ్జెట్ అద్దం పడుతుందన్నారు. అభివృద్ధి సంక్షేమానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వ బడ్జెట్ ఉందన్నారు. పంటల సాగులో అధునాతన టెక్నాలజీపై రైతులకు పోత్సాహం విత్తనాలు, సూక్ష్మ పోషక ఎరువులు సబ్సీడీలపై ఇస్తున్నట్లు తెలిపారు.

సీఎం చేతులమీదుగా అవార్డునందుకున్న హెచ్‌ఎం

అద్దంకిటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయుల అవార్డుల కార్యక్రమం సోమవారం విజయవాడలో జరిగింది. బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని చక్రాయపాలెం జిల్లా ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు, స్నేహితులు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.


హెచ్‌ఎం శ్రీనివాసరావుకు అవార్డును అందిస్తున్న సీఎం చంద్రబాబు

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు

అద్దంకి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని మణికేశ్వరంలో మల్లేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అద్దంకి పట్టణంలోని పాత శివాలయం, వేయి స్తంభాల గుడి, కమటేశ్వరాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు.


మణికేశ్వరంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


అతిథులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కాకతీయ కార్తీక వనభోజనాలు

వేటపాలెం(చీరాల) : మండల పరిధిలోని రామాపురంలో కాకతీయ సేవా సమితి వారి ఆధ్వర్యంలో కాకతీయ కార్తీక వనభోజనాల కార్యక్రమం అత్యంత వేడుకగా జరిగింది. కాకతీయ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు, విశిష్ట అతిధిగా అడుసుమల్లి వెంకటసుబ్బయ్య హాజరయ్యారు. నిర్వాహక ప్రతినిధులు వారిని ఘనంగా సన్మానించారు. ఆత్మీయ పలకరింపులు, కుశల ప్రశ్నలతో అక్కడ ఆహ్లాదకర వాతావరణం కార్యక్రమం సాగింది.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రతినిధులు

ఆహార నియమాలపై దృష్టి సారించాలి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలోనే చదువుతో పాటు ఆహార నియమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో-2 సుధారాణి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం బాయ్స్ హైస్కూల్‌లో అయోడిన్‌తో ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఐటీసీ, ఐజీడీ వారు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆహార నియమాలను వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుధారాణి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చీరాల డీఎస్పీగా మొయిన్ బాధ్యతలు



చీరాలటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చీరాల డీఎస్పీగా మహ్మద్ మొయిన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చీరాల ప్రాం తంపై పట్టు ఉందన్నారు. నేర నియంత్రణకు అందరూ సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు తనవంతు కృషి చేయనున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై ఆరా తీశారు.

నిరుద్యోగుల వివరాలపై సర్వే

బల్లికురవ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో నిరుద్యోగుల వివరాలను సేకరించాలని ఎంపీడీవో కే కుసుమకుమారి కోరారు. సోమవారం బల్లికురవ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్కిల్ సెన్సెస్ సర్వే కార్యక్రమంపై పంచాయతీ కార్యదరులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళ పోలీసులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో చదువు పూర్తి అయి ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువత వివరాలను సేకరించాలని సర్వే వివరాలను పూర్తిగా నివేదిస్తామని తెలిపారు. సమావేశంలో సర్వే మండల కోఆర్డినేటర్ ఉమమహేశ్వరరావు పాల్గొన్నారు.


రామస్థూపం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న భక్తులు

రామస్థూపం నిర్మాణానికి భూమిపూజ

వేటపాలెం(చీరాల), నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : దత్తక్షేత్రం ప్రాంగణంలో సోమవారం రామ స్థూపం నిర్మాణానికి భక్తురాలు ఆదిలక్ష్మి చేతులమీదుగా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ ప్రతినిధులు మాట్లాడుతూ భక్తులు రాసిన రామకోటి పుస్తకాలను నిక్షిప్తం చేసేందుకు ఈ రామ స్థూపాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వహకులు ప్రమీలదేవి, ప్రత్తి వెంకటసుబ్బారావు, నున్నా శివప్రసాదరావు, మురళీకృష్ణ, వెంకటప్పయ్య, రాంబాబు, శ్రీనివాసరావు, రాజేశ్వరి, చంద్ర పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

బల్లికురవ. నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు పొగాకు సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, అపరాలను పండించాలని బాపట్ల వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త కామాక్షి పేర్కొన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో సోమవారం రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై శిక్షణ జరిగింది. ఈసందర్భంగా శాస్త్ర వేత్త మాట్లాడుతూ పొగాకు వలన అరోగ్యం కూడా పాడవుతుందని రైతులు మెట్ట పంటలను తక్కువ ఖర్చుతో సాగు చేసుకోవాలన్నారు. మార్టూరు వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు, హేంవాక శాస్త్రవేత్త ఉష, రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ రత్నకుమారి, ఏవో కుమారి పత్తి పంటలో గులాబీ రంగు పురుగు, పంటల సాగుపై రైతులకు అవసరమైన సలహాలను అందించారు. కార్యక్రమంలో వీఏఏ వెంకటేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్త కామాక్షి

కారు ఢీకొని పలువురికి తీవ్ర గాయాలు

- గంట అచిపా రాని అంబులెన్స్
- మరో శవం బండిలో హాస్పిటల్‌కు చేరిన బాధితులు

చీరాలటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. రక్త గాయాలతో అంబులెన్స్‌కు ఫోన్ చేసి గంటయినా వాహనం రాలేదు. దీంతో మానవత్వం చాటుకున్న మరో ప్రైవేటు అంబులెన్స్ వ్యక్తి శవం బండిలో ఉన్నా కూడా వీరిని కూడా చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈఘటన సోమవారం పందిళ్లపల్లి రైలు గేటు సమీపంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఆదినారాయణపురానికి


చికిత్స పొందుతున్న ప్రభంజని

చెందిన బలసాని ప్రభంజని, ఆంబోతుల లీల, సాయి మరికొందరు ఒంగోలులోని హాస్పిటల్లో ఉన్న బంధువులను పరామర్శించేందుకు ఆటోలో వెళుతున్నారు. అయితే పందిళ్లపల్లి రైలు గేటు సమీపానికి వెళ్లగానే ఎదురుగా వస్తున్న కారు వీరిని వేగంగా ఢీకొంది. ప్రమాదంలో పై ముగ్గురితో పాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈక్రమంలో క్షతగాత్రులు 108కు ఫోన్ చేశారు. అయితే దాదాపుగా గంటైనా వాహనంరాలేదు. చివరకు అటుగా చీరాలకు ఓ మృతదేహంతో వస్తున్న ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ మానవత్వంతో వీరిని క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు.

నరకం అనుభవించాం

ప్రమాదం కారణంగా గాయపడ్డాం. నా కాలికి గాయమైంది. మా బంధువు ప్రభంజనీ తల నుంచి రక్తస్రావమైంది. అందరం భయపడ్డాం. 108కు సమాచారమిచ్చినా గంటైనా రాలేదు. దీంతో ప్రైవేటు వాహనంలో ఆసుపత్రికి వెళ్లాం.

- సాయి, క్షతగాత్రుడు

బాప్‌రే.. ఏం ధర!



● టన్ను జామాయిల్ రూ.8100

జిల్లా అటవీ శాఖకు జామాయిల్ తోటలు సిరులు కురిపిస్తున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టన్ను జామాయిల్ ధర రూ.8100 పలికింది. మొదటి విడతలో గత సంవత్సరం రూ.3,460 పలగ్గా ప్రస్తుతం ఆన్‌లైన్ టెండర్ల ద్వారా రూ.8100లకు కోడ్ చేశారు. జిల్లాలోని 3,500 హెక్టార్లలోని జామాయిల్‌కు అటవీ శాఖ టెండర్లు ఆహ్వానించింది. దాదాపు 1,02,000 మెట్రిక్ టన్నుల కర్ర రానున్నట్లు అంచానాలు వేశారు. సోమవారం జరిగిన ఆన్‌లైన్ టెండర్లలో 8 సంస్థలు పాల్గొనగా, నాలుగు సంస్థలు మాత్రమే అర్హత సాధించాయి. గ్లోబల్ టెండర్లలో పోటీపడ్డ నాలుగింటిలో నెల్లూరుకు చెందిన ప్రతిష్టా ట్రేడర్స్ రూ.8,100లకు టెండర్ దక్కించుకుంది. దీంతో అటవీ శాఖకు మొదటి విడత కంటే దాదాపు రెట్టింపు ఆదాయం రానున్నది. 1,02,000 టన్నులకు గాను రూ.82 కోట్ల మేర తమ శాఖకు రాబడి రానున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి)



నువ్వెంత.. ఆ నువ్వెంత!?

- నాలుగు రోజుల్లో నీ సంగతి తేలుస్తా!
- తలపడేంతస్థాయిలో ఇద్దరు అధికారుల ఘర్షణ
- రైతులు, ప్రజల ముందే వాగ్వాదం
- సిబ్బంది చొరవతో సద్దుమణిగిన వ్యవహారం
- వెంకటాచలంలో ఆలస్యంగా వెలుగులోకి..

- వివరాలు 6లో..

భజే పార్వతీ వల్లభం నీలకంఠం

కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉపవాస దీక్షలతో భక్తులు తెల్లవారుజాము నుంచి ఆలయాల వద్ద బారులుతీరి పాలభిషేకాలు, మహాన్యాస రుద్రాభిషేకాలు నిర్వహించారు. స్వామివార్లకు విశేష పూజలు, పూలంగిసేవలు జరిగాయి. సాయంత్రం ఆకాశ దీపాలు వెలిగించడంతోపాటు కార్తీక దీపారాధనకు భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. రాత్రి ప్రాకారోత్సవాలు, పేట ఉత్సవాలు జరిగాయి.

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



23న జడ్పీ సమావేశం

నెల్లూరు జడ్పీ, ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, నెడ్ క్యాప్, వ్యవసాయం, నీటి పారుదల, వైద్య ఆరోగ్య శాఖలపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.



● యూజీడీకి మోక్షం


నెల్లూరు నగరాభివృద్ధిలో భూగర్భ డ్రైనేజీ(యూజీడీ) పథకం, తాగునీటి పథకాలు కీలకమైనవి. 2014-19 మధ్యన అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో ఈ రెండు ప్రాజెక్టులను సుమారు రూ.1100 కోట్లతో ప్రారంభించారు. 2019 ఎన్నికల నాటికే ఈ పథకాల పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ కక్ష పూరితంగా వ్యవహరించింది. మరో రూ.100 కోట్లు ఖర్చు చేసి ఉంటే ఈ ప్రాజెక్టులు పూర్తయ్యేవి. కానీ గత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మళ్లీ యూజీడీ, తాగునీటి పథకాల పనులకు మోక్షం లభించింది. ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో పనులను పరిశీలించిన నిపుణులు ఆ మేరకు నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈ క్రమంలోనే యూజీడీ, తాగునీటి పథకాలను పూర్తి చేసేందుకు తాజా బడ్జెట్‌లో రూ.126.53 కోట్లు కేటాయించడం విశేషం. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

కూటమి ప్రభుత్వ బడ్జెట్‌లో సింహపురికి సముచిత స్థానం దక్కింది. అసెంబ్లీలో సోమవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు సముచిత స్థానం లభించింది. పలు కీలక ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంతో పెండింగ్ ప్రాజెక్టులు పట్టాలెక్కనున్నాయి. ఐదేళ్ల క్రితమే ఆగిపోయిన నెల్లూరులో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పథకాలతోపాటు కీలక ప్రాజెక్టులకు నిధులు కేటాయించారు. అలానే రాష్ట్ర యూనిట్‌గా ప్రధాన శాఖలకు నిధులు కేటాయించగా, వాటిలో జిల్లావాటాగా ఆ నిధులను ఆయా శాఖలు విభజించనున్నాయి.

● సోమశిలకు మహర్దశ



2021లో సంభవించిన వరదలకు జిల్లాజలప్రసాది సోమశిల జలాశయం అతలాకుతలైంది. పోటెత్తిన వరదకు డ్యాం ముందుభాగం దెబ్బతిన్నది. పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.99.11 కోట్లు ఖర్చు అవుతుందని ఇంజనీర్లు ప్రతిపాదించగా, టెండర్లు ఆహ్వానించారు. ఆ తర్వాత 20 శాతం వరకు పనులు చేసిన కాంట్రాక్టర్ బిల్లులు మంజూరుచేయకపోవడంతో చేతులెత్తేశాడు. రోజులు గడుస్తున్నా అప్పటి ప్రభుత్వం నిధులు మాత్రం మంజూరు చేయలేదు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో రూ.208.25 కోట్లు కేటాయించింది.



పయ్యావుల.. కాసుల గలగల

రాష్ట్ర బడ్జెట్‌లో భారీగా నిధుల కేటాయింపు

పెండింగ్ ప్రాజెక్టులకూ భారీ ఊరట ● తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ.879.24 కోట్లు

యూజీడీ పూర్తికి రూ.126 కోట్లు ● రామాయపట్నం పోర్టుకు రూ.100 కోట్లు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులకు కూడా బడ్జెట్‌లో భారీగా నిధులు దక్కాయి. కొన్ని ప్రాజెక్టులకు గతేడాదితో పోలిస్తే ఎక్కువ నిధులను ప్రభుత్వం కేటాయించింది. తద్వారా బిల్లుల సమస్యతో అర్థాంతరంగా ఆగిపోయి ఉన్న పనుల్లో కదలిక రానుంది. సోమశిల ప్రాజెక్టుకు రూ.208.25 కోట్లు కేటాయింపులు జరిపారు. దీంతో ఆప్రాన్ పనులు వేగం పుంజుకోనున్నాయి. అదే సమయంలో ఇతరత్రా ఎమర్జన్సీ పనులను కూడా చేపట్టేందుకు అవకాశం ఏర్పడింది. అలానే పెన్నార్ డెల్టా కెనాల్ సిస్టమ్‌కు రూ.33.42 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో కాలువలను అభివృద్ధి చేయనున్నారు. కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రూ.11 కోట్లు కేటాయించారు. గతేడాది కూడా రూ.11.54 కోట్లు బడ్జెట్‌లో కేటాయించినప్పటికీ ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. పొదలకూరు, చేజర్ల మండలాల ప్రజలకు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం చాలా ముఖ్యమైనది. సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్‌కు బడ్జెట్‌లో రూ.66 కోట్లు కేటాయించారు. కనుపూరు కాలువ ఆధునికీకరణకు రూ.7 కోట్లు బడ్జెట్‌లో కేటాయింపులు జరిపారు.

● పారిశ్రామికాభివృద్ధికి ఊతం

వ్యవసాయం తర్వాత జిల్లాలో ప్రధానమైన రంగం పారిశ్రామిక రంగం. ఈ రంగానికి కూడా కూటమి ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఆశించిన

- మిగతా 6లో..

ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు (టీజీపీ)కు రూ.879.24 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. అందులో నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని ఈ ప్రాజెక్టుకు రూ.453.17 కోట్లు దక్కనున్నాయి. గత ఏడాది



కేటాయింపులతో పోలిస్తే ఇది సుమారు రూ.200 కోట్లు అధికం కావడం గమనార్హం. ఈ కేటాయింపులతో ఇప్పటి వరకూ బిల్లుల పెండింగ్‌తో ఆగిపోయిన సోమశిల-కండలేరు వరద కాలువ విస్తరణ వంటి కీలక పనులు ఊపందుకోనున్నాయి.

ప్రకృతి అందం..
చరితకు అద్దం

ఉదయగిరి.. జిల్లాలో పడమర దిక్కున ఆ మూలకు విసిరేసినట్లు ఉన్నా మనమైన చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం. శతాబ్దాల క్రితం సామ్రాజ్యాధినేతలు నిర్మించిన దుర్భేద్య దుర్గం, అందులోని అద్భుత కట్టడాలు, శిల్పకళా చాతుర్యం చారిత్రక వైభవానికి చిహ్నాలు. వీటికితోడు చుట్టూ చిక్కటి అడవి, జలజలపారే జలపాతాలు పర్యాటకులను, చరిత్రకారులను తరచూ ఆహ్వానిస్తూనే ఉంటాయి.

6



ఫైళ్లు దొరికాయ్ : కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఆర్డీవో, రూరల్ తహసీల్దారు కార్యాలయాల్లో ఇప్పటి వరకు కనిపించని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుటుంబం భూ వివాదానికి సంబంధించిన ఫైళ్లు దొరికాయని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'నెల్లూరులోనూ మదనపల్లె' శీర్షిక సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమవడంతో కలెక్టర్ స్పందించారు. కనిపించలేదని ఆర్డీవో లేఖ రూపంలో తెలియజేసిన ఫైళ్లు.. ఎక్కడు న్నాయో వెతికి తనకు తెలిజేయాలని ఆర్డీవో, రూరల్ తహసీల్దారు కార్యాలయ అధికారులను ఆదేశించారు. దీంతో ఈ రెండు కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు విస్తృతంగా వెతికారు. ఎట్టకేలకు 596 పేజీలు కలిగిన ఫైల్ నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలోనూ, 162 పేజీలు కలిగిన ఫైల్ నెల్లూరు రూరల్ తహసీల్దారు కార్యాలయంలోనూ లభ్యమైంది. ఈ విషయాలను సంబంధిత అధికారులు కలెక్టర్ ఆనంద్‌కు నివేదిక అందజేశారు. దీంతో ఈ రెండు ఫైళ్లు ఆయా కార్యాలయాల్లో లభ్యమయ్యాయని, ఆ ఫైల్స్‌లో ఉన్న ఆధారాలను కోర్టుకు సమర్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రజాధనాన్ని జీతంగా తీసుకుంటున్న ఆర్అండ్‌బీ అధికారులు రోడ్లు బాగు చేసి ప్రజల కష్టాలు తీర్చాల్సిందిపోయి ఓ కాంట్రాక్టర్‌కు కొమ్ము కాస్తున్నారు. అత్యంత నాసిరకంగా రోడ్డు నిర్మించారని స్వయంగా క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ తేల్చారు. మరోసారి రోడ్డు వేయాల్సిందేనని, కాబట్టి కాంట్రాక్టర్ నుంచి పూర్తి బిల్లులు రికవరీ చేయాలని ఆదేశించారు. చీఫ్ ఇంజనీర్ చెప్పినట్టుగానే ఆత్మకూరు-సోమశిల రోడ్డు వేసిన ఆరు నెలలకే దారుణంగా మారిపోయింది. గడిచిన ఎనిమిదేళ్లలో మరింత గుంతలమయంగా తయారైంది. కానీ ఇంతవరకూ కాంట్రాక్టర్ నుంచి పైసా రికవరీ చేయలేదు. పైగా ప్యాచ్ వర్కులతో సరిపెడుతున్నారు. తాజాగా మరో రూ.40 లక్షల ప్రజాధనాన్ని ప్యాచ్ వర్కులకు ఖర్చు చేస్తున్నారు తప్ప సదరు కాంట్రాక్టర్ నుంచి మాత్రం ప్రజాధనాన్ని రికవరీ చేయడం లేదు.



భారీ గుంతలతో దారుణంగా మారిపోయిన ఆత్మకూరు-సోమశిల రోడ్డు

ఎనిమిదేళ్ల క్రితం ఆత్మకూరు-సోమశిల రోడ్డు వర్కు రిజెక్ట్

ఫైలు తొక్కిపెట్టి.. రూ.కోట్లు కొల్లగొట్టి!

- రూ.8 కోట్ల రికవరీలో తీవ్ర నిర్లక్ష్యం
- సీఈ ఆదేశించినా బేఖాతర్
- బీజీ రెన్యూవల్ చేస్తూనే ఉన్న ఆర్అండ్‌బీ అధికారులు
- తాజాగా రూ.40 లక్షలతో ప్యాచ్‌వర్కులు?

నెల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు-సోమశిల రోడ్డు అభివృద్ధికి తొమ్మిదేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. కిలోమీటర్ 17 నుంచి 40 వరకు రెండు వరుసల రోడ్డు విస్తరణకు సుమారు రూ.25 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఓ కాంట్రాక్టర్ ఈ వర్కును 16 శాతం లెస్‌కు దక్కించుకున్నారు. 2015లో నిర్మాణ పనులు జరగ్గా కొందరు స్థానికులు నాణ్యత లోపంగా పనులు జరుగుతున్నాయని జిల్లా, రాష్ట్ర అధికారులకు కూడా ఫిర్యాదులు అందాయి. దీంతో అప్పటి క్వాలిటీ కంట్రోల్ సీఈనే విచారణకు వచ్చారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత లేదని నిర్ధారించారు. దీంతో వర్కునే రిజెక్ట్ చేశారు. అప్పటికే సదరు కాంట్రాక్టర్‌కు సుమారు రూ.8 కోట్ల బిల్లులు చెల్లించారు. దీంతో ఆ బిల్లులను రికవరీ చేయాలని క్వాలిటీ కంట్రోల్ సీఈ ఆదేశించారు. ఇదే సమయంలో నాణ్యతను పరిశీలించని సంబంధిత అధికారులపైనా చర్యలకు సిఫారసు చేశారు. ఇదంతా జరిగి ఎనిమిదేళ్లు కావస్తోంది. కానీ ఆ ఫైల్ ఇప్పటికీ బయటకు రాకుండా తొక్కి పెట్టారు.

● కాగ్ అక్షింతలు వేసినా!?

గతేడాది కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) అధికారులు ఆర్అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో ఆడిటింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఆత్మకూరు-సోమశిల రోడ్డు రిజెక్ట్ వర్కును కూడా ఆడిటింగ్ చేశారు. దీనిపై సదరు అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ నుంచి ఎందుకు రికవరీ చేయలేదు? వర్కును ఎందుకు క్లోజ్ చేయలేదు? క్లోజ్ చేయకుండానే మళ్లీ టెండర్లు పిలుస్తూ ఎలా ప్యాచ్‌లు వేస్తున్నారు? వంటి అనేక ప్రశ్నలు వేయగా అధికారుల నుంచి సమాధానాలు లేవు. ఈ వ్యవహారంపై ఆర్అండ్‌బీ అధికారుల నుంచి వివరణ కూడా తీసుకున్నట్లు తెలిసింది. కాగ్ అక్షింతలు వేసి ఏడాది దాటినా ఆర్అండ్‌బీ ఉన్నతాధికారుల్లో చలనం లేదు.

● విరుద్ధంగా బీజీ రెన్యూవల్

సాధారణంగా ఒక వర్కుకు టెండర్ వేసేటప్పుడు బ్యాంకు గ్యారెంటీ(బీజీ)ను అందజేయాలి. సదరు కాంట్రాక్టర్ వర్కును పూర్తి

- మిగతా 6లో..



సోలార్ విద్యుత్‌తో బంతి సాగు

అంతా పసుపువర్ణంలో కనిపిస్తున్న ఇది బంతితోట. అయితే విశేషం ఏమంటారా..? ఈ చిత్రంలో సోలార్ ప్యానెల్ ఉంది గమనించారా..? సోలార్ విద్యుత్‌తో మనుబోలు మండలం కుడితిపల్లికి చెందిన గుండె బోయిన ప్రసాద్ అనే రైతు ఇలా బంతిపూల సాగు చేపట్టాడు. ఉద్యాన, వ్యవసాయ, విద్యుత్ శాఖల పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆయన సాగులో ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

పరమేష్టికి పారిజాత శోభ

చిట్టగుంట (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం గంగ తిప్పపై వెలసిన పురాతన శివలింగానికి సోమవారం భక్తులు పారిజాత పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. కార్తీకమాస పర్వదినం సందర్భంగా ఈ అలంకరణ చేపట్టినట్లు భక్తులు తెలిపారు.



బస్టాండే బారు!

బుచ్చి మండలం పెనుబల్లి జెండా సెంటర్‌లో బస్ షెల్టర్ ఉంది. దాన్ని ఓ దుకాణం నిర్వాహకుడు సగం ఆక్రమించగా, కొంతమంది మందుబాబులు పట్టపగలే అక్కడ మద్యం సేవిస్తున్నారు. దీంతో ప్రయాణికులు బస్‌షెల్టర్‌లోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పగలే ఇలా ఉంటే రాత్రయితే పరిస్థితి చెప్పనక్కరలేదని గ్రామస్థులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)



అలనాటి వైభవం

ప్రకృతి అందం చరితకు అద్దం



శత్రు దుర్భేద్యమైన కోటలు, అబ్బురపరిచే రాజ ప్రాసాదాలు, రాణి వాసాలు, ఆకాశాన్నంటే వందలాది బురుజులు, ఎత్తయిన ప్రాకారాలు, కళానైపుణ్యాన్ని చాటే ప్రార్థనా మందిరాలు, అద్దాల మేడలు, ఆధ్యాత్మికత నింపే ఆలయాలు, వేద పాఠశాలలు, విస్మయపరిచే యుద్ధశిక్షణ కేంద్రాలు, ధాన్యాగారాలు, అశ్వగజశాలలు, గోషా మహల్, సొరంగ మార్గాలు .... వెరసి చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచిన ఉదయగిరి దుర్గం. సముద్ర మట్టానికి 3079 అడుగుల ఎత్తులో తిరుమల గిరులను పోలిన కొండలు, దట్టమైన అడవులు, ప్రవహించే సెలయేళ్లు, ప్రకృతి రమణీయత నిండిన పర్యాటక ప్రాంతం. ఎందరో రాజులు, నవాబులు, ఆంగ్లేయుల పాలనకు కేంద్రంగా విరాజిల్లిన చారిత్రక ప్రదేశం.

● రాజరికపు చిహ్నం.. ఉదయగిరి దుర్గం | ● శతాబ్దాలనాటి కట్టడాలు | ● పచ్చని వనాలు, పారే సెలయేళ్లు | ● పర్యాటకులకు ఆహ్లాదం | ● చరిత్ర శోధకులకు విజ్ఞానం



ఉదయగిరిలో క్రీ:శ 10వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు చోళులు, పల్లవులు, ఆనక రెడ్డిరాజులు, గజపతులు, విజయనగర రాజులు, గోల్కొండ నవాబుల పాలన సాగినట్లు చారిత్రక ఆధారాలు వెల్లడిస్తున్నాయి. విజయనగరాధీశుల ఏలుబడిలో 365 ఆలయాలు, వాటి ముంగిట కోనేర్లతో ఉదయగిరి దేదీప్యమానంగా వెలుగొందింది. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో ఆ 365 ఆలయాల్లో రోజూ దేవుడి పెళ్లితో నిత్య కల్యాణం.. పచ్చ తోరణంగా బాసినట్లు చరిత్ర చెబుతోంది. బ్రిటీషు వారి హయాంలో ఏర్పాటైన సబ్‌జైలు ప్రాంగణంలోని భవనాల్లో ప్రస్తుతం తహసీల్దారు, ఉప ఖజానా, సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు కొనసాగుతూ ఆంగ్లేయుల నిర్మాణ శైలిని చాటుతున్నాయి. ఉదయగిరి దుర్గాన్ని సంజీవని గిరి అంటారు. మనుసును రంజింపచేసే కొండలు, లోయలు, పచ్చనిచెట్లు, పక్షుల కిలకిలరావాలు, దుమికే జలపాతాలతోపాటు మనిషికి ప్రాణం పోసే సంజీవని వంటి వనమూలికలు ఇక్కడున్నాయి. మసీదులకు వెళ్లే మెట్ల దారి, టప్పా, హను మాన్ నాలా, లొద్ది, తొట్టి ప్రాంతాలు పర్యాటకుల మనుసును దోచుకొంటా యి. ఎన్నో ఫిరంగి గుళ్ల చప్పుళ్లను, అలనాటి ప్రాభవాలను కాలగర్భంలో దాచుకొన్న ఉదయగిరి చరిత్ర శోధకుల కు విజ్ఞాన ఖనిగా పేరు సంపాదించుకొంది.

- ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి)



ఉదయగిరి దుర్గంపై నీటి తొట్టి (టప్పా).



రంగనాయకులస్వామి ఆలయం



శతాబ్దాల నాటి నిర్మాణ శైలికి నిదర్శనంగా కొండమీదున్న చిన్నమసీదు

నువ్వెంతంటే నువ్వెంత!

● ఇద్దరు అధికారుల ఘర్షణ

● వెంకటాచలంలో ఆలస్యంగా వెలుగులోకి..

వెంకటాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం తహసీల్దారు కార్యాలయంలో రెండు రోజుల క్రితం ఇద్దరి అధికారుల మధ్య నువ్వెంత అంటే నువ్వెంత అన్నస్థాయిలో తీవ్రవాగ్వాదం చోటు చేసుకుంది. రైతులు, ప్రజలు, రెవెన్యూ సిబ్బంది అందరూ చూస్తుండగానే వారి మధ్య కలబడేంత స్థాయిలో వివాదం సాగింది. ఒకానొకదశలో 'నీ సంగతి నాలుగు రోజుల్లో తేల్చేస్తా'నంటూ సవాళ్లు విసురుకున్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకుల అండతో వచ్చిన మండల స్థాయి రెవెన్యూ అధికారి తహసీల్దారు కార్యాలయంలో అంతా తానై చక్రం తిప్పుతున్నారు. మూడు నెలల క్రితం మండల ఉన్నతాధికారిగా మరొకరు బాధ్యతలు చెప్పారు. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడినా గత ప్రభుత్వ హయాంలో పని చేసినట్టే ఆ అధికారి చేస్తున్నారు. అంతేగాక పలు ఆరోపణలు వెల్లువత్తాయి. రెండు రోజుల క్రితం కంటేపల్లిలో ఒక రైతు తన పొలం విషయమై ఓ మహిళా అధికారిని సంప్రదించగా ఆమె నుంచి రైతుకు చెందిన ఫైలు మండలస్థాయి అధికారి వద్దకు చేరింది. దీంతో తనపై సదరు అధికారి దురుసుగా ప్రవర్తించాడంటూ ఆమె ఉన్నతాధికారికి విషయం చెప్పింది. దీంతో ఇద్దరు అధికారుల మధ్య పెద్దఎత్తున వివాదం తలెత్తింది. అందరూ చూస్తుండగానే ఒకరిపై ఒకరు మాటల యుద్ధానికి దిగారు. వివాదం పెద్దదవుతున్న తరుణంలో అక్కడే ఉన్న సిబ్బంది సర్దిచెప్పడంతో ఇద్దరూ శాంతించారు. ఈ వివాదం కాస్త మండలవ్యాప్తంగా చర్చకు దారితీసింది. దీనిపై తహసీల్దారు శ్రీనివాసులును అడగగా అదంతా ఏమీ లేదంటూ చెప్పడం విశేషం.

జర్మనీ భాషపై శిక్షణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన విద్యార్థులకు ఎస్ఎం కేర్ సొల్యూషన్స్ జీఎంబీహెచ్ వారు జర్మనీ భాష నేర్పించి ఆ దేశంలో ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి, జర్మనీ భాష నేర్చుకునేందుకు ఆసక్తి ఉన్న వారికి తిరుపతిలో ఆరు నెలల పాటు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. అందుకు ఈనెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల ని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9988853335కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రూ.కోట్లు కొల్లగొట్టి

(5వ పేజీ తరువాయి)

చేసి నిర్వహణ పీరియడ్ కూడా ముగిశాక సదరు బీజీని అధికారులు తిరిగి ఇచ్చేస్తారు. నిర్వహణ పీరియడ్ రెండేళ్లు ఉంటుంది. అప్పటితో ఆ వర్కు ముగిసినట్లవుతుంది. కానీ ఆత్మకూరు-సోమశిల రోడ్డు వర్కు విషయంలో ఇప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు నాణ్యత లోపంగా పనులు చేసిన కాంట్రాక్టర్ బీజీను ఏటా రెన్యువల్ చేస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ కూడా సుమారు రూ.55 లక్షల బీజీలను రంచ నుగా రెన్యువల్ చేసి ఇస్తున్నారు. ఈ వ్యవహా రంలో పైనుంచి కింది స్థాయి వరకు భారీగానే చేతులు తడిచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది కూడా బీజీను రెన్యువల్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

● ప్యాచ్‌లతో సరి

ఒక వర్కు బీజీను రెన్యువల్ చేస్తున్నారంటే ఆ వర్కు ఇంకా ఫోర్స్‌లో ఉన్నట్లు అర్థం. కానీ ఇక్కడ వర్కు మాత్రం రిజెక్ట్ అయ్యింది.. బీజీలు మాత్రం రెన్యువల్ అవుతున్నాయి. ఈ కారణంగానే మళ్లీ కొత్తగా వర్కు మంజూరు చేసి రోడ్డును పూర్తిగా అభివృద్ధి చేసేందుకు సాధ్యపడటం లేదని ఆర్‌అండ్‌బీ వర్గాలు చెబుతున్నాయి. అయితే నిబంధనలకు విరుద్ధంగా పలుమార్లు టెండర్లు పిలిచి ప్యాచ్ వర్కులు మాత్రం చేశారు. ఇప్పుడు కూడా మరో రూ.40 లక్షలతో ప్యాచ్‌లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. కాగా ఈ రికవరీ ఫైల్‌ను ఇప్పటివరకూ ఉన్నతస్థాయిలో పనిచేసిన కొందరు అధికారులు తొక్కిపెడుతూ వస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రజలు మాత్రం గుంతల రోడ్లపై నరకం అనుభవిస్తుంటే.. అధికారుల తీరుతో కాంట్రాక్టర్ మాత్రం ప్రజాధనంతో దర్జాగా తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా ఈ వ్యవహారంపై దృష్టి పెట్టి ఆత్మకూరు - సోమశిల రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకోవాలి

ఆత్మకూరు-సోమశిల రోడ్డు నాణ్యతగా లేదని గతంలో సీఈ రిజెక్ట్ చేసిన ఫైల్ రాష్ట్ర స్థాయిలో ఉంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నిబంధనల ప్రకారం బీజీలు రెన్యువల్ చేస్తున్నాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్యాచ్‌లు వేస్తున్నాం.

- ఎం గంగాధర, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ

ట్రూ అప్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



నెల్లూరు (వైద్యం) నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగంలో ట్రూ అప్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం నెల్లూరు నగరంలోని జరిగిన సీపీఎం ప్రజాపోరు ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం వదిలిన చెప్పుల్లోనే కాళ్లుపెట్టి కూటమి ప్రభుత్వం పరిపాలిస్తున్నదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ట్రూ అప్ చార్జీలు విధించినప్పుడు బాదుడే బాదుడు అని కూటమి నాయకులు ఆందోళనలు చేపట్టారన్నారు. మరి ఇప్పుడేమే ప్రజలపై రూ. 17వేల కోట్ల భారం మోపడం సరికాదన్నారు. తక్షణమే ట్రూ అప్ చార్జీల భారాన్ని విధించే చర్యలను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే అడ్డుకుంటామని గత ప్రభుత్వ హయంలో చెప్పిన టీడీపీ నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్‌మీటర్లు వేగవంతంగా బిగిస్తున్నారని ఆయన విమర్శించారు. చెప్పేదొకటి... చేసేదొకటిగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నారు. తక్షణమే ఈ చర్యలు ఉపసంహరించుకోవాలని, లేదంటే ఈనెల మూడవ వారంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరించాలని కోరారు. నెల్లూరులో ప్రజాపోరుకు విశేష స్పందన వస్తున్నదని పేర్కొన్నారు. 70శాతం మంది పేదలు నివసించే ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ పట్టాలు లేవని, ఇంకా ఉచిత ఇసుక అందుబాటులోకి రాలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న కలెక్టరేట్ల వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు తెలియచేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు నాగేశ్వరరావు, కాయం శ్రీనివాసులు, సూర్యనారాయణ, బీపీ నరసింహ, కత్తి పద్మ, మూలం ప్రసాద్, అత్తిమూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాసుల గలగల

(5వ పేజీ తరువాయి)

మేర నిధులను కేటాయించింది. కీలకమైన రామాయపట్నం పోర్టు నిర్మాణానికి సంబంధించి తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది. అలానే కృష్ణపట్నం పోర్టు ప్రభావిత ప్రాంతాల్లో పరిహారం కోసం రూ.37.98 కోట్లు కేటా యింపులు జరిపింది. పారిశ్రామిక అభి వృద్ధిలో కీలకమైన విశాఖ-చెన్నై ఇండస్ట్రి యల్ కారిడార్‌కు కూడా ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. ఈ కారిడార్ పరిధిలో భూములు కొనుగోలు చేసి ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసేందుకు గానూ ఏపీఐఐసీకు రూ.210.91 కోట్లు కేటా యింపులు జరిపింది. అలానే రోడ్ల అభి వృద్ధికి గానూ ఏపీఆర్‌డీసీకు రూ.66.97 కోట్లు, విద్యుత్ వసతి కల్పనకై ఏపీ ట్రాన్స్‌కోకు రూ.104.09 కోట్లు కేటాయించింది. ఈ కేటాయింపులతో ఇండస్ట్రియల్ కారిడార్ పనుల్లో మళ్లీ వేగం పుంజుకోనుంది. ఇక విక్రమ సింహపురి యూనివర్సిటీ అభివృద్ధికి రూ.20.69 కోట్లను వెచ్చించేలా ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. గతేడాది రూ.13.90 కోట్లు కేటాయించగా ఈ దఫా కేటాయింపులు పెరిగాయి. ఇవే గాక ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు కూడా భారీగానే నిధులు కేటాయించారు. దీని ఫలితంగా పెండింగ్ బిల్లులు చెల్లిస్తే అసంపూర్తిగా ఆగిపోయిన రోడ్లు, భవనాల పనులు మొదలుకానున్నాయి.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)



మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆనంద్

కుటుంబం ఉన్నతికి విద్యే మూలం

● మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు కలెక్టర్ ఘన నివాళి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కుటుంబం ఉన్నతంగా ఎదగాలంటే విద్యే మూలమని గ్రహించిన భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎన్నో విద్యా సంస్థలకు అంకురార్పణ చేసి ప్రోత్సహించారని జిల్లా కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు కలెక్టరేట్ శంకరన్ హాల్లో ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధుడు ఆజాద్ హిందూ, ముస్లింల ఐక్యతకు ఎంతగానో కృషి చేశారన్నారు. అనేక వ్యాసాలు, కథనాల ద్వారా జాతిలో స్వాతంత్ర కాంక్షను రగిలించాన్నారు. ఆయన ఆలోచనలు, ప్రణాళికలు నేటికీ ఆచరణీయమన్నారు.

యువతకు ఆదర్శం - వేమిరెడ్డి దంపతులు

స్వాతంత్ర్య సమర యోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు నేటి యువతకు ఆదర్శనీయమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికా విద్యకు పెద్ద పీట వేశారని కొనియాడారు.

న్యూస్ బాక్స్

నేడు రాళ్లపాడు కాలువలకు నీటి విడుదల

లింగసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ఆయకట్టు పరిధిలోని రైతులు నీటిని విడుదల చేయమని కోరుతున్న నేపథ్యంలో మంగళవారం రాళ్లపాడు ప్రాజెక్టు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ చంద్రమౌళి సోమవారం ప్రకటనలో తెలిపారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేస్తారన్నారు.

నేడు గ్రద్దగుంటలో గ్రామసభ

అల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రీసర్వే సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభను మంగళవారం గ్రద్దగుంటలో నిర్వహించనున్నట్లు తహసీల్దారు లక్ష్మీ నారాయణ సోమవారం ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

కొండాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల కాంప్లెక్స్‌ల పరిధిలో మంగళవారం నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు సోమవారం ఎంపీడీవో ఆదినారాయణరావు తెలిపారు.

మరమ్మతులు చేపట్టాలి

కావలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మురుగుకాలువల్లో చెత్త తొలగింపు, మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్, శానిటరీ అధికారులను కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం 33వ వార్డులోని పెండెంవారి, చిత్తూరివారి వీధి, మల్లెవరపువారి వీధులు, పెద్దపవని రోడ్లలోని కమిషనర్ రోడ్లు, కాలువలను పరిశీలించారు.

దుప్పట్ల పంపిణీ

కావలిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): లైఫ్‌లైన్ ఫౌండేషన్ సభ్యులు సోమవారం స్థానిక రైల్వేస్టేషన్, ఉదయగిరి బ్రిడ్జి, జనతాపేట, కలుగోళమ్మ గుడి ప్రాంతాల్లోని నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ తాటికొండ నవీన్ మాట్లాడారు. జేబీ కళాశాల అధ్యాపకులు శ్రీనివాసులు షర్మిల దంపతుల సహకారంతో వీటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో దాత షర్మిల, సభ్యులు స్రవంతి, శశాంక్, సురేష్, సహస్ర పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల చోరీపై ఫిర్యాదు

కావలి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌కు పడమర వైపున పార్కింగ్‌లో ఉంచిన రెండు మోటారు సైకిళ్లు చోరీకి గురైనట్లు బాధితులు జలదంకి మండలం అనుమకొండపాలెం కర్రా మల్లికార్జున్, నాగిరెడ్డిపాలెం కు చెందిన గొల్లమూరి శ్రీనివాసులు రెడ్డి సోమవారం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భర్త కనిపించటం లేదని ఫిర్యాదు

కావలి రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణ వీజీ సెంటర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న మేకల శ్రీనివాసులు కనిపించటం లేదని ఆయన భార్య జయమ్మ సోమవారం రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. అనారోగ్యంతో ఉన్న శ్రీనివాసులు ఈ నెల 7వ తేదీన నెల్లూరులోని వైద్యశాలకు అని చెప్పి వెళ్లాడని అప్పటి నుండి కనిపించటం లేదని జయమ్మ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ. 1.76 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

● ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ. 1.76 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నువ్వూరుపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ నగర్ ఎస్సీ కాలనీలో రూ. 1.9 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, షేక్ మస్తాన్‌వలీ, వి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

కలువాయి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెరుబొట్లపల్లి రైతు సాధికారక కేంద్రంలో సోమవారం రాయితీపై పచ్చిశనగ విత్తనాలు అధికారులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో వీ ప్రతాప్, సర్పంచు జీ వెంకటరమణమ్మ, వెంకటేశ్వర్లు నాయుడు, గడ్డం కిషోర్‌రెడ్డి, సోమయ్య యాదవ్, రాధాకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చండి మహాప్రభో..!

● మూడేళ్లుగా నిలిచిన జలదంకి-తెల్లపాడు రహదారి పనులు
● డబుల్‌రోడ్డు నిర్మాణంలో ఉన్న సింగిల్ రోడ్డు ధ్వంసం
● గోతులతో ప్రయాణికుల ఇబ్బందులు

జలదంకి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం నుంచి తెల్లపాడుకు వెళ్లే సింగిల్ ఆర్‌అండ్‌రోడ్డును మూడేళ్ల క్రితం రూ.20కోట్లకు పైగా సీఎస్‌ఆర్ నిధులతో రెండువరుసల రోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేస్తూ టెండర్లు పిలిచారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు మొదట్లో పనులు వేగవంతంగా చేశారు. వంతెనల నిర్మాణంలోని కల్వర్టులను తొలగించి వాటి స్థానంలో కొత్త వంతెనలు నిర్మాణం ప్రారంభించారు. కొత్త వంతెనలు నిర్మించే చోట డైవర్షన్ రోడ్లు వేశారు. అలాగే బాగున్న సింగిల్‌రోడ్డుపై పలుచోట్ల అడ్డంగా గోతులు తీయడమే కాక రోడ్డుకు ఇరువైపులా వెడల్పు చేసేందుకు మెటల్‌తో నింపారు. ఇలారోడ్డు రూపురేకలు మార్చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా చేసిన పనులకు బిల్లులు గత ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో గుత్తేదారు ఉన్నపలంగా రోడ్డు నిర్మాణం ఆపేసి కోర్టును ఆశ్రయించారు. ఇదంతా ఏ డాదిలోపే జరిగిపోయింది. ఇక అప్పట్నుంచి నేటివరకు రెండేళ్లుగా ఈ రోడ్డు పనులు నిలిచిపోయాయి. ధ్వంసం చేసిన రోడ్డును అలానే వదిలేశారు. వర్షాకాలంలో డైవర్షన్లు తెగి రాకపోకలకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. రోడ్డును పలు చోట్ల నిర్మాణంలో భాగంగా తారుతొలగించగా అక్కడ గతుకులు ఏర్పడి వాహనరాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. గోతుల్లో పడి వాహనాలు ప్రమాదాల బారిన పడడమే కాకుండా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. కొత్తప్రభుత్వంలోనైనా పనులు ప్రారంభం అవుతాయని గంపెడాశతో ఉన్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. కనీసం గోతులనైనా పూడ్చి తాత్కాలిక మరమ్మతు



నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు



రోడ్డును తవ్వడంతో ఏర్పడ్డ గుంత

వారంలో విద్యుత్‌ను అందిస్తాం

● డీఈ శ్రీనివాసులు

ఏఎస్ పేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుప్పురుపాడు గ్రామంలోని పొలాల రైతులకు వారం రోజులలో విద్యుత్‌ను అందిస్తామని ఆత్మకూరు విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విద్యుత్ కార్యాలయానికి విచ్చేసి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రూ. 16వేలు చెల్లించి ఏడాది గడుస్తున్నా పొలాలకు విద్యుత్ రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేయడంతో స్తంభాలకు విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చి వారం రోజులలో విద్యుత్ వచ్చేలా చేస్తామని డీఈ హామీ ఇచ్చారు. కనెక్షన్‌కి రూ. 16వేలు వసూలు చేయడంపై కూడా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమస్యలను పరిష్కరించండి సారూ..

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవోకు వినతుల అందజేత

కావలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆర్డీవో వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జలదంకి మండలం లింగరాజు అగ్రహారంకు చెందిన రైతులు తమ వరి నారుమళ్లు ముదిరిపోతున్నాయని వరి నాట్ల కోసం సోమశిల నీటిని విడుదల చేయాలని కోరారు. చినక్రాక రిజర్వాయర్ నుంచి సోమశిల నీటిని మా కాలువలకు వదిలితే వరినాట్లు వేసుకుంటామన్నారు. అనంతరం డివిజన్‌లోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు సమస్యలపై వినతులు ఇచ్చారు. విచ్చలవిడి మద్యంను నియంత్రించాలని వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి సీపీఎం నాయకులతో కలిసి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ట్రూ అప్ చార్జీల పేరుతో పెంచుతున్న విద్యుత్ చార్జీలను, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాధాకృష్ణయ్య, సీతారామయ్య, మధు, కమలాకర్, సీతారాంసింగ్ పాల్గొన్నారు. పేద విద్యార్థుల కోసం కావలిలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని బీసీ ఐక్యతభవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్, గౌరవాధ్యక్షులు ఉరిటి గోవింద్, ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాద్‌లు వినతిలో పేర్కొన్నారు. ఆధార్‌కార్డులు లేవని పొదుపు రుణాలు సకాలంలో చెల్లించినా బ్యాంకర్లు తిరిగి ఇవ్వడంలేదని కొందరు పొదుపు గ్రూపు సభ్యులు ఆర్డీవోకు విన్నవించారు.



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న బీసీ ఐక్యత భవన్ నేతలు

హోరాహోరీగా రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు

ఆత్మకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రభుత్వ ఉన్నతపాఠశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల నెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్-19 బాలుర విభాగంలో విశాఖపట్నం, కడప, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. అండర్-19 బాలికల విభాగంలో నెల్లూరు, కడప, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల జట్లు విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరు కున్నాయి. అండర్-17 బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, నెల్లూరు, విశాఖపట్నం జట్లు విజయం సాధించాయి. మంగళవారం సెమీఫైనల్, ఫైనల్ ప్రారంభ మవుతాయని టోర్నీ ఆర్గనైజర్ తిరుపతయ్య తెలిపారు.



నెట్‌బాల్ పోటీల్లో తలబడుతున్న క్రీడాకారులు


భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు

ఆత్మకూరు, నవంబరు 11: కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని శివాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, అభయాంజనేయ స్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయం, అలఘనాథ స్వామి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమశిలలో ఉన్న సోమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

● శివాలయాల్లో ప్రత్యేక పూజలు

ఉదయగిరి రూరల్: కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా మండల పరిధిలోని గండిపాళెం, గుడినరవ, అప్పసముద్రం, లింగాలదొన, యర్రబల్లిగడ్డ, అర్లపడియ గ్రామాలతో పాటు ఉదయగిరి పట్టణంలోని పార్వతీ పరమేశ్వరాలయాల్లో భక్తులు విశేష పూజ లు నిర్వహించారు. దుత్తలూరు కొండపై ఉన్న రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.





భస్మాలంకారంలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి

ఇళ్లస్థలాలపై జరిగే ధర్నాను జయప్రదం చేయండి

కందుకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నివాసస్థలాలు లేని పేదలకు గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో రెండుసెంట్లు స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సురేష్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు గ్రామాలలో ఒకటిన్నర సెంట్లు, పట్టణాలలో ఒక సెంటు ఇచ్చారనరి ఓ కుటుంబానికి ఇది ఏమాత్రం సరిపోదం లేదన్నారు. సమావేశంలో బాలకోటయ్య, ఆనంద్‌మోహన్, సీహెచ్ దుర్గాప్రసాద్, హరిబాబు పాల్గొన్నారు.

● శాంతినగర్‌లో ప్రజాపోరు

కావలి టౌన్, నవంబరు 11: సీపీఎం ప్రజాపోరు కార్యక్రమం సోమవారం స్థానిక 20వార్డు శాంతినగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజలుకు కరపత్రాలు పంపిణీ చేసి సమస్యలడిగి తెలుసుకున్నారు. మద్దూరుపాడులో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈనెల 14న సమస్యల పరిష్కారం కోసం ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు తిరుపాల్, కృష్ణమోహన్, పెంచులయ్య, బాబురావు పాల్గొన్నారు.



కందుకూరు: మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

● జలదంకి, నవంబర్ 11: గ్రామ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు రావి మాల్యాద్రి, మేలంగి ఆంథోనీబాబులు సోమవారం ఎంపీడీఓ బ్రహ్మయ్యకు వినతిపత్రం అం దజేశారు. గ్రామంలోని పడమటిదొరువును శుభ్రం చేసి వినియోగంలోకి తేవాలని, యాదవబజారులో వీధిలో పారిశుధ్య పనలు చేపట్టాలని పేర్కొన్నారు.

● పెరిగిన ధరలు తగ్గించాలి

అనంతసాగరం, నవంబరు 11: పెరిగిన నిత్యావసర సరుకులు, విద్యుత్ ఛార్జీల ధరలు తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాపోరు ప్రచారయాత్రలో భాగంగా పలు గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేశారు. కూటమి ప్రభుత్వం వెంటనే పెరిగిన ధరలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో అన్వర్‌బాష, సందాని, గాడి సుధాకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్ సంక్షేమ పథకాల అమలుకు అనుకూలం

కందుకూరు, నవంబరు 11(ఆం ధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాల అమలుకు సోమవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అనుకూ లంగా ఉందని కందుకూరు ఎమ్మె ల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్ర కటనలో పేర్కొన్నారు. 2.94 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌లో వెనుకబ డినవర్గాల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. పంచాయతీ రాజ్‌శాఖకు 16,739కోట్ల రూపాయలు కేటా యించటం పభుత్వ ప్రాధాన్యత స్పష్టంగా కన్పి స్తుం దన్నారు. అలాగే రోడ్ల అభివృద్ధికి 9554 కోట్లు కేటాయించటం ద్వారా పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధినీ సమదృష్టితో ఈ ప్రభుత్వం చూ స్తున్నట్లు సామాన్యులకు సైతం అర్థమవుతోందన్నారు.

16న ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ తరగతులు

అల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ ఆదేశాల మేరకు ఈ నెల 16న నిర్వహించనున్న శిక్షణ తరగతులకు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ రజనీకాంత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలాధ్యక్షుడు, జడ్పీటీసీ సభ్యులు ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్‌ఆర్.పాలెం, పెంట్రాలలో వైద్యశిబిరాలు

లింగసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):ఆర్‌ఆర్.పాలెంలో లింగసముద్రం వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ తిరిగి జ్వరాలు, ఇతరవ్యాధులపై సర్వే చేపట్టారు. వైద్యులు రమేష్ 13 మందికి కీళ్ల నొప్పుల రోగులకు మందులు అందజేశారు. ఇతర చిన్న వ్యాధులతో బాధపడే 73మందిని పరీక్షించారు. గ్రామ సర్పంచు సీహెచ్ అంజమ్మను కలిసి మంచినీటి ట్యాంకును శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలని, బ్లీచింగ్, ఫాగింగ్ చేయించాలని కోరారు. పెంట్రాలలో కూడా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.మాధవరావు ఆరోగ్య సిబ్బందితో బ్లీచింగ్ చల్లించారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రమేష్

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

సంగ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పలువురు నిరుపేద కుటుంబాలకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎం చెన్నమ్మ, పి లక్ష్మమ్మ, బి సంజీవులు, పాలెపి లక్ష్మి, ఎం అమ్మనమ్మ అనే నిరుపేదలకు 25 కేజీల బియ్యం, కేజి కంది పప్పు, నూనె, ఎర్రగడ్డలు, చింతపండు, తదితర నిత్యావసర సరుకులను ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షుడు, జనసేన నాయకులు దాడి భాను కిరణ్, తిరుమలేష్, వంశీ కృష్ణ, వెంకటేష్, రాజా, హిమసాగర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పరామర్శ

సంగం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలకండ్రికకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గంగపట్నం చంద్రశేఖరయ్యను మాజీ సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి సోమవారం రాత్రి పరామర్శించారు. గంగపట్నం చంద్రశేఖరయ్య అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో ధనుంజయరెడ్డి చంద్రశేఖరయ్యను పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక నాయకులు మానికల కృష్ణమూర్తి, ముత్యాల మోహన్, హరిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

దగదర్తి, (బిట్రగుంట) నవంబరు 11. (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై నిత్యం పోరాటం చేస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో ఆయన పాల్గొని డిప్యూటీ తహసీల్దారు గిరీష్‌తో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార విషయంలో అధికారులు అశ్రద్ధ వహిస్తే సహించం అన్నారు. ఆయన వెంట కంచర్ల క్రిష్ణయ్య, వడ్డె వినయ్, సూరిబాబు, వేంకటేశ్వర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయంలో గ్రీవెన్స్ డే

సంగం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం తహసీల్దారు సోమ్లానాయక్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తిరుమనతిప్ప కాలనీలో హెల్త్ క్లీనిక్ స్థలం ఆక్రమించి ఓ వైసీపీ నేత అమ్మకానికి పెట్టారని టీడీపీ నాయకుడు కాకు మధు వినతిపత్రం అందచేశారు. దీనిపై విచారణ చేసి ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని వినతిపత్రంలో కోరారు.

ఆజాద్‌కు ఘన నివాళి

ఉదయగిరి రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని సోమవారం మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు షేక్ నాయబ్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

ఉదయగిరి నార్త్ ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పఠాన్ సందానిబేగం రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. సోమవారం విజయవాడలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆమెను ఆశాఖ కమిషనర్ షమీం మెడల్, మెమెంటో అందజేసి సన్మానించారు.



● ఏఎస్ పేట : గ్రామంలోని దర్గా సెంటర్‌లో సోమవారం మౌలానా అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ నాయకులు హబీబ్‌బాషా, మల్లికార్జునరెడ్డి, అల్లాఉద్దీన్, మహమ్మద్ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఆత్మకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో అరుణాచలం దర్శించుకునే భక్తుల కోసం ఈనెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు ఆత్మకూరు నుంచి సూపర్‌లగ్జరీ బస్సులు నడుపుతామని డిపో మేనేజర్ షేక్ కరీమున్నీసా సోమవారం తెలిపారు. ఒక్కొక్కరికి రానుపోను టికెట్ ధర రూ.1400గా నిర్ణయించామన్నారు. వాటికి ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నామని, పూర్తి వివరాల కోసం ఆత్మకూరు డిపో మేనేజర్ లేదా అసిస్టెంట్ మేనేజర్లను 9959225645, 7382924753, 8555929504 నెంబర్లుకు ఫోన్‌చేసి సంప్రదించాలని కోరారు.

పూర్వవిద్యార్థుల వనమహోత్సవం

కందుకూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కార్తీక వనమహోత్సవం సందర్భంగా సోమవారం పూర్వ విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. 10వేల రూపాయల వ్యయంతో పాఠశాల ఆవరణ, ఆట స్థలాలలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ట్రీగార్డులు కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యా యులు ముప్పాళ్ల అంజయ్య, గుళ్లా వెంకటకృష్ణారావు, రావులకొల్లు వెంకటేశ్వరు, సీహెచ్ సుబ్బా రావు, గుళ్లా నరసింహ్మం, ఇన్‌చార్జి హెచ్ ఎం విప్రనారాయణ, పాటిబండ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న పూర్వ విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు

అనారోగ్యంతో తాళ్లూరు రమణయ్య మృతి

దగదర్తి (బిట్రగుంట) నవంబరు 11. (ఆంధ్రజ్యోతి): మండల సీనియర్ నాయకులు తాళ్లూరు రమణయ్య నాయుడు (86) అనారోగ్యంతో సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా, నెల్లూరు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ మాజీ ఛైర్మన్ పనిచేశారు. విషయం తెలిసిన వివిధ పార్టీల నేతలు ఆయన కుమారుడు దగదర్తి ఎంపీపీ తాళ్లూ వెంకట క్రిష్ణప్రసాద్ నాయుడుతో ఫోన్లో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



గృహనిర్మాణ శాఖలో వంద రోజుల కార్యాచరణ

● గౌస్‌మొహిద్దీన్, ఏఈ, హౌసింగ్



సంగం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ శాఖలో చేపట్టిన పక్కాగృహాల నిర్మాణాలను పూర్తిచేసేందుకు కూటమి ప్రభుత్వం వందరోజుల కార్యాచరణకు లక్ష్యాలు నిర్దేశించిందని గృహనిర్మాణ శాఖ ఏఈ ఎండీ గౌస్‌మొహిద్దీన్ తెలిపారు.

? వందరోజులకు ఎన్ని గృహాలు పూర్తయ్యాయి.

! డిసెంబరు నెలాఖరుకు 362పక్కాగృహాలు పూర్తి చేయాలని నిర్దేశించి 105నిర్మాణాలు పూర్తిచేశాం. 257 పూర్తిచేయాల్సి ఉంది.

? సిమెంట్, ఇనుము అందుబాటులో ఉందా.

! సిమెంట్, ఇనుము లబ్ధిదారులు అడిగితే తెప్పించి ఇస్తాం. అలాగే బిల్లులు కూడా వెంటనే అందచేస్తాం.

? జగనన్న కాలనీ నిర్మాణాలపై విజిలెన్స్ విచారణ ఏం తేల్చింది.

! కాంట్రాక్టర్లు నిర్మించిన ఎక్కువ శాతం ఇళ్లు నాసిరకంగా నిర్మించారని అధికారులు నివేదికలో తేల్చి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ల వద్ద రికవరికీ నివేదించింది.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు మండవ అభినందన

కావలి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు రాష్ట్ర గ్రంథాలయ సంస్థల చైర్మన్‌ను సోమవారం టీడీపీ విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావును అమరావతిలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దివ్యాంగులకు నామినేటెడ్ పోస్టులు ఇచ్చి వారిని ప్రోత్సహించడం శుభపరిణామని సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

దేశ భద్రతపై అవగాహన

ఉలవపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోస్టల్ సెక్యూరిటీ విధులు, దేశ భద్రత విషయంలో తీర ప్రాంత విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రామాయపట్నం సీఐ శివనారాయణ తెలిపారు. సోమవారం రామాయపట్నం జడ్పీ హైస్కూల్‌లో తీరప్రాంత భద్రత అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. సముద్రమార్గంలో స్మగ్లర్లు, మానవ అక్రమ రవాణా, టెర్రరిస్టులు, మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలు రవాణ జరుగుతుంటాయన్నారు. వాటిని అరికట్టేందుకు గ్రామస్తులు, విద్యార్థులు తమవంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐ మస్తాన్ షరీఫ్, హెచ్ఎం జీవనకుమార్, ఉపాధ్యాయులు సుధాకర్, శ్రీను, సంపత్, వెంకట్, ప్రసన్న ఉన్నారు.

అధిక ధరలకు మద్యం అమ్మితే చర్యలు

కలిగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వారా లైసెన్సు పొంది అమ్మకాలు జరిపే మద్యం దుకాణాదారులు ఎమ్మార్పీ ధరలకు మించి అధిక ధరలకు మద్యం అమ్మినా లేదా మద్యం కల్తీ చేసినా చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ జలీల్‌బాష తెలిపారు. ఈ విషయంపై సోమవారం ఆయన స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో మాట్లాడారు. నెరిజాల వ్యవధిలో సర్కిల్ పరిధిలో ఎనిమిది మద్యం దుకాణాలపై దాడులు చేసి 8మంది పై కేసులు నమోదు చేసి 110మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అక్రమాలపై తొలివిడత మద్యం వ్యాపారులు పట్టుబడితే రూ.5లక్షల జరిమానా, రెండోసారి పట్టుబడితే దుకాణం లైసెన్సు రద్దు చేస్తామన్నారు.

వేధింపుల కేసు నమోదు

బిట్రగుంట, నవంబరు 11. (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్రగుంట పంచాయతీ అరుందతి వాడకు చెందిన బొద్దు లలిత (30) భర్త వేధింపులు తట్టుకోలేక పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బొజ్జ సోమవారం తెలిపారు. మృతురాలి అన్న యండపల్లి నరసింగరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

లింగసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెదపవని చోరీ దొంగలను అరెస్టు చేసినట్టు ఎస్ఐ షేక్ మహబూబ్ సుబాని తెలిపారు. ఈ చోరీలో 6గురు ముద్దాయిలను గుడ్లూరు సీఐ మంగారావుతో కలిసి సోమవారం ఉదయం 7.30 గంటలకు కొత్తపేట జంక్షన్‌లో అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా వారి వద్ద నుండి 250 గ్రాముల వెండి, 20 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరిని కందుకూరు కోర్టులో హాజరుపరచగా, కోర్టు వీరికి రిమాండ్ విధించామన్నారు. వీరిలో ఇద్దరు నెల్లూరు టౌన్, ఒకరు బుచ్చి, ఒకరు పెదపవని, ఒకరు ఒరిస్సా, మరొకరు పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారు ఉన్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీటీఆర్ఐ ఫీడర్, కంచరగుంట ఫీడర్‌లలో 11కేవీ లైనుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించేందుకు మంగళవారం ఉదయం ఎనిమిదిన్నర నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.